22 . 2. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

ఆదివారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 258 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## ఢిల్లీ నుంచి మీరట్‌కు కేవలం 58 నిమిషాల్లోనే

- అందుబాటులోకి ఢిల్లీ-మీరట్ నమో భారత్ కారిడార్
- కారిడార్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21 వెలుతురు :** ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం మీరట్‌లో పర్యటించి సుమారు రూ. 12,930 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో

## దేశం నుంచి చొరబాటుదార్లను తరిమేస్తాం

- ఓటరు జాబితాతో పాటు, దేశంలోనూ స్థానం లేకుండా చేస్తాం
- కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరిక



## అవకాశాలను అందిపుచ్చుకుని సాగాలి

- డిసిసి అధ్యక్ష పదవి ఎదిగేందుకు తొలిమెట్టు
- కాంగ్రెస్‌లో కష్టపడితేనే పదవులు వరిస్తాయి
- ఎవ్వరికైనా మెరిట్ లిస్ట్ ప్రకారమే అవకాశం
- భిన్నాభిప్రాయాలు పార్టీ కార్యకర్తల స్థయిర్యాన్ని దెబ్బతీస్తాయి
- డిసిసి అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి



**వికారాబాద్,ఫిబ్రవరి 21 వెలుతురు:** భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గాంధీ సిద్ధాంతాలను విశ్వసించే పార్టీ కాంగ్రెస్ అని ఆయన గుర్తుచేశారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని విమర్శించారు.రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈ శిక్షణ డీసీసీ అధ్యక్షులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వారి అవకాశాలను మెరుగు పరుచుకునేందుకు దీన్ని సద్వినియోగం




చేసుకోవాలని సూచించారు. పార్టీ విధానాలు, ప్రజల సమస్యలపై చర్చించేందుకు ఈ తరగతులు సహాయపడతాయని సీఎం అన్నారు. గాంధీజీపై లాఠీలు ఎత్తడానికి బ్రిటిషర్లు బయపడ్డారని, దేశభక్తులమని అనుకునే కొందరు

## మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి

జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో మంత్రి సీతక్క

**హైదరాబాద్,ఫిబ్రవరి21( వెలుతురు):**




మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క అన్నారు. వారిని ఆర్థికంగా స్థితిమంతులుగా చేయడానికి ఇందిరా

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,ఫిబ్రవరి21 వెలుతురు:** జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ మీడియా అకాడమి కట్టుబడి ఉందని చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారంనాడు తెలంగాణ మీడియా అకాడమిలోని కాన్ఫరెన్సు హాలులో 2వ పాలకమండలి సమావేశం చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన



## అవినీతి నిరూపిస్తే వెంటనే రాజీనామా

- ప్రజలకు ఎవరేంటో తెలుసు
- తనపై దాడి చేసేందుకు షబ్బీర్ కుట్ర
- ఇక ప్రజల్లో ఉండే తేల్చుకుంటా
- తనకేదైనా జరిగితే సిఎం రేవంత్‌దే బాధ్యత
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హెచ్చరిక



**కామారెడ్డి,ఫిబ్రవరి21 వెలుతురు:** కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అవినీతిలో కింగ్ అన్నారని.. తనపై ఏ ఒక్క అవినీతి బయటపడినా స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. కామారెడ్డిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి ఓడిపోయిన కామారెడ్డిలో షబ్బీర్ అలీ అన్నీ తానే అంటున్నారని చెప్పుకొచ్చారు. తనను కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్, జడ్పీటీసీ చేశామని

## రాష్ట్రప్రభుత్వ విన్నపాన్ని మన్నించిన సిసిఐ

- కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిలు వెంటనే స్పందించారు
- పత్తి కొనుగోళ్లు ఈ నెలాఖరు వరకు కొనసాగుతాయి
- పత్తి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావువెల్లడి



**హైదరాబాద్,ఫిబ్రవరి21 వెలుతురు:** రాష్ట్రంలో ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగనున్న పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయని, ఈ అవకాశాన్ని పత్తిరైతులు వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తమ అభ్యర్థన మేరకు పత్తి కొనుగోళ్లను ఫిబ్రవరి నెలాఖరు వరకు సీసీఐ పొడిగించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను కోరినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు.

## గ్రామీణ ప్రాంతాల్లో గడచిన 12 ఏండ్లల్లో ఒక్క ఇల్లు కూడా లేదు

- కనీసం ఈ ఏడాదిలోనైనా 3 లక్షల ఇండ్లు మంజూరు చేయండి
- పేదల సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పం
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి



**హైదరాబాద్,ఫిబ్రవరి21 వెలుతురు:** తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా 2014-23 వరకు దాదాపు పది సంవత్సరాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదు. దీంతో ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన ఇండ్లను మంజూరు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదల సంక్షేమాన్ని విస్మరించిన ఆనాటి ప్రభుత్వం పది సంవత్సరాలల్లో కేంద్రం నుండి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాలకు ఇండ్లు మంజురు చేయాలని గడిచిన రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాం. కానీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడం లేదు. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా గ్రామీణ ప్రాంతాలకు 3 లక్షల ఇండ్లు మంజురు చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ గ్రామీణ

## దేశ టెక్నాలజీ విప్లవానికి తెలంగాణ నాయకత్వం రేవంత్ రెడ్డి...

# ప్రజా పాలనతో అభివృద్ధి, ఆవిష్కరణలకు స్వర్ణయుగం

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 21:** ప్రపంచం సాంకేతిక విప్లవం వైపు వేగంగా పయనిస్తున్న ఈ కీలక సమయంలో, భారత్ టెక్నాలజీ, డిజిటల్ ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) రంగాలలో విశేష పురోగతి సాధిస్తోంది. ఈ జాతీయ అభివృద్ధి యాత్రలో తెలంగాణ రాష్ట్రం కీలక పాత్ర పోషిస్తూ, దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ కేంద్రంగా అవతరిస్తోంది. ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారి దూరదృష్టి నాయకత్వం, ప్రజా కేంద్రిత పాలన, ప్రగతిశీల విధానాల అమలు తెలంగాణను దేశ భవిష్యత్తుకు మార్గదర్శక రాష్ట్రంగా నిలబెడుతున్నాయి.

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధిని కొత్త దిశలో తీసుకెళ్లే చర్యలు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వెహికిల్స్ రంగంలో ప్రభుత్వం రూపొందించిన ప్రగతిశీల ఈవీ పాలసీ, పర్యావరణ పరిరక్షణతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి బలమైన పునాది వేస్తోంది. ఈవీ తయారీ సంస్థలకు ప్రోత్సాహకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఈవీ రంగంలో దేశంలోనే అగ్రగామిగా ఎదుగుతోంది.

అదేవిధంగా, తెలంగాణ ప్రభుత్వం స్టార్టప్‌ల అభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇస్తోంది. యువతలో ఉన్న సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రాష్ట్రాన్ని దేశంలో ప్రముఖ స్టార్టప్ హబ్‌గా మార్చాయి. హైదరాబాద్ ఇప్పటికే ప్రపంచ స్థాయి ఐటీ కేంద్రంగా గుర్తింపు



పొందగా, ఇప్పుడు ఈవీ, డిజిటల్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగాలలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తోంది. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి, డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ, పెట్టుబడులకు అనుకూల విధానాల అమలు ద్వారా దేశ, విదేశీ పెట్టుబడిదారుల విశ్వాసాన్ని సంపాదించింది. దీని ఫలితంగా రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు స్థాపించబడుతున్నాయి, యువతకు వేలాది ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, తెలంగాణను భవిష్యత్తు పారిశ్రామిక కేంద్రంగా నిలబెడుతోంది.

ప్రత్యేకంగా, ప్రజా పాలనలో సంక్షేమం మరియు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్లడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రత్యేకత. ఫైన్ రైస్ పథకం ద్వారా పేదలకు ఆహార భద్రత, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా సాధికారత, రైతు భరోసా ద్వారా రైతులకు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదలకు గృహ వసతి కల్పించడం వంటి చర్యలు ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకొచ్చాయి.

అదే సమయంలో, టెక్నాలజీ మరియు పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రాష్ట్రాన్ని భవిష్యత్తు అవసరాలకు సిద్ధం చేస్తున్నాయి. పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాలు, ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలు తెలంగాణను దేశంలో అత్యంత ప్రగతిశీల రాష్ట్రంగా నిలబెడుతున్నాయి.

ఈ రోజు తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న అభివృద్ధి, రేపటి భారత దేశ భవిష్యత్తుకు పునాది వేస్తోంది. ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ కేవలం అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం మాత్రమే కాదు.దేశ టెక్నాలజీ విప్లవానికి దిశానిర్దేశం చేసే శక్తిగా అవతరిస్తోంది.

ప్రజల విశ్వాసం, ప్రభుత్వ నిబద్ధత, ప్రగతిశీల విధానాల సమన్వయంతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన, సాంకేతికంగా బలమైన, భవిష్యత్తు దిశగా దూసుకెళు న్న రాష్ట్రంగా నిలవడం ఖాయం. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా కేంద్రిత పాలనకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టి నాయకత్వానికి నిదర్శనం.



డా. రేఖ బోయలపల్లి

ఉపాధ్యక్షురాలు, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్

## ఢిల్లీ నుంచి మీరట్‌కు కేవలం 58 నిమిషాల్లోనే

భాగంగా 82 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ 'నమో భారత్' రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్కారిడార్‌ను పూర్తిస్థాయిలో జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ 'మీరట్ మెట్రో' సేవలను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు. తాజా ప్రారంభోత్సవంతో ఢిల్లీలోని సారాయ్ కాలే ఖాన్ నుంచి మీరట్‌లోని మోదీపురం వరకు ప్రయాణ సమయం కేవలం 58 నిమిషాలకు తగ్గనుంది. ఇంతకుముందు ఈ ప్రయాణానికి దాదాపు మూడు గంటల సమయం పట్టేది. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే మీరట్ మెట్రో, దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలవనుంది. మరో విశేషమేమిటంటే, ఒకే రైల్వే ట్రాక్‌పై రీజనల్ రైలు (నమో భారత్), లోకల్ మెట్రో (మీరట్ మెట్రో) నడవడం దేశంలో ఇదే తొలిసారి. ఈ కొత్త విధానం పట్టణ రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రద్దీ తగ్గడంతో పాటు పర్యావరణ హితమైన రవాణాకు మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వం తెలిపింది.

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మాట్లాడుతూ, తెలంగాణలోని 8 జిల్లాలకు చెందిన జర్నలిస్టులకు శిక్షణా కార్యక్రమాలు, వివిధ అంశాలపై 7 వర్క్ షాప్ లు, 12 మంది సీనియర్ జర్నలిస్టులు చేసిన సేవలను రాబోయే తరాలకు తెలియపర్చాలనే ఉద్దేశ్యంతో వారి జీవితాలపై మోనోగ్రాఫ్స్ ముద్రించినట్లు ఆయన తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా విడతల వారీగా 120 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం, 5 సంవత్సరాల కాల పరిమితితో నెలకు 3 వేల రూపాయల పెన్షన్ సదుపాయం కల్పించినట్లు ఆయన వివరించారు. అదే విధంగా అనారోగ్యం, ప్రమాదాలకు గురైన 19 మంది జర్నలిస్టులకు ఆర్థిక సహాయం చేశామన్నారు. అకాడమి భవన నిర్వహణలో భాగంగా 250 మంది సీటింగ్ కెపాసిటీ గల ఆడిటోరియం అ÷-దదెకు ఇవ్వడానికి సమావేశంలో చర్చించగా కమిటీ సభ్యులు తమ ఆమోదం తెలుపడం పట్ల కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వర్కింగ్ కౌన్సిల్ సభ్యులు మీడియా అకాడమి భవన నిర్వహణలో భాగంగా ఆడిటోరియం అద్దెకు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేస్తునే ఈ విధానం పూర్తిగా ఆన్ లైన్ విధానం ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకునే విధంగా మీడియా అకాడమి వెబ్ సైట్లో ఆయా తేదీలు, సమయ పాలనని పొందుపర్చాలని సూచించారు. అప్పుడే పూర్తి పారదర్శకత చేకూరుతుందని వారు వెల్లడించారు. అందుకోసం ప్రభుత్వ ఆధీనంలోని రవీంద్రభారతి, జె.ఎన్.టి.యూ., సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయాకు సంబంధించిన విధి, విధానాలను అధ్యయనం చేసి అ÷-దదెకు సంబంధించిన విధి విధానాలను రూపొందించాలని మీడియా అకాడమి కార్యదర్శికి సూచించారు. ఈ పాలక మండలి సమావేశంలో సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ శ్రీమతి సి.హెచ్. ప్రియాంక, ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ సతీష్ కుమార్ తల్లాడి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ ఇంచార్జి హెడ్ డా. సునిల్ కుమార్ పోతన, దూరదర్శన్ కేంద్ర ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ శ్రీమతి ఎ. చాందిని, ఆల్ ఇండియా రేడియే ప్రోగ్రామ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. రమేష్ సుంకసారి, స్పెషల్ గెస్ట్ వీర నారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం జర్నలిజం డిపార్టుమెంట్ హెడ్ బి.వి. కృష్ణాజీరావు, తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## దేశం నుంచి చొరబాటుదార్లను తరిమేస్తాం

**గౌహతి,ఫిబ్రవరి21 వెలుతురు:**

నక్సలిజం నుంచి దేశం విముక్తి పొందుతున్నట్లే.. చొరబాటుదారులను ఏరివేయడం కూడా సాధ్యమేనని కేంద్ర మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అక్రమ వలసదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా.. దేశం నుంచే తొలగిస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఈ పనిని పూర్తి చేస్తామని చెప్పారు. అస్సాంలోని కామ్‌రూప్‌లో పోలీస్ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఓ సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. చొరబాటుదారుల ఆక్రమణల నుంచి విడిపించిన స్థలంలోనే ఈ కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. చొరబాటుదారులను వారు ఆక్రమించిన స్థలాల నుంచి తరిమికొట్టినంత మాత్రాన సమస్య తీరిపోదు. వారు మరోచోట స్థిరపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిని మొత్తంగా దేశం నుంచే బయటకు పంపించాలి. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. కానీ.. కాంగ్రెస్ ఆ పని చేయబోదు. ఎందుకంటే వారే ఆ పార్టీకి ఓటు బ్యాంకు' అని అమిత్ షా ఆరోపించారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు.. అస్సాంకు ముప్పుగా మారాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటే.. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని సవాల్ విసిరారు. రానున్న ఐదేళ్లలో ఈశాన్య భారతంలో అస్సాం పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని అమిత్ షా చెప్పారు. అనంతరం గువాహటిలో నిర్వహించిన సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో పాల్గొన్నారు. శౌర్యపరాక్రమాలు, దేశభక్తిలో అందరికీ ఆదర్శంగా సీఆర్పీఎఫ్ నిలుస్తోందని పేర్కొన్నారు.

## మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి




మహిళా శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో మహిళా సాధికారతలో తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతిని ఆవిష్కరించారు. 46.68 లక్షల మంది మహిళలు 4.37 లక్షల స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదుగుతున్నారని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సా ధికారతకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. గడిచిన రెండేండ్లలో మహిళా సంఘాలకు రూ.35.435 కోట్ల బ్యాంకింగ్ రుణాల మంజూరు చేశామన్నారు.ఇందిరా మహిళా శక్తితో 2.05 లక్షల సూక్ష్మ వ్యాపారాలను మహిళా సంఘాలు స్థాపించాయని చెప్పారు. సమ్మక్క, సారలమ్మ జాతరలో ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళా సంఘాలకు రూ.3.5 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. వారికి స్థిరమైన ఆదాయం కల్పించేందుకు ఆర్టీసీ అ÷-దదె బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లు మహిళా సంఘాలతో ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. జీడీపీలో మన దేశ మహిళల భాగస్వా మ్యం 18 శాతమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది 40 శాతంగా ఉందన్నారు. మంత్రి సీతక్క ప్రసంగాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశంసించారు.

# వైసిపి రాజకీయ పరాచకాలు ఆడుతోంది

### - వేంకటేశ్వరాలయంలో ప్రత్తిపాటి పూజలు

**పల్నాడు,ఫిబ్రవరి21( వెలుతురు):**

చిలకలూరిపేటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన సంప్రోక్షణ చర్యలు, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. కూటమి నాయకులతో కలిసి ఆలయాన్ని శుద్ధి చేశారు ప్రత్తిపాటి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరునితో వైసీపీ రాజకీయ పరాచకాలు ఆడుతోందని మాజీ మంత్రి తీవ్రంగా విమర్శించారు. స్వామివారిని రాజకీయ ఆయుధంగా వాడుకోవడం దుర్మార్గమని.. మహా పాపమని అన్నారు. శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీయాలన్నదే వైసీపీ లక్ష్యమన్నారు. మండలిలో తమకు బలం ఉందని భావించి కుట్రలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారని రుజువైనా కావాలనే శాసనమండలిలో రచ్చ చేస్తున్నారని ప్రత్తిపాటి పుల్లారావు వ్యాఖ్యానించారు. కల్తీ నెయ్యి అంశాన్ని పక్కదారి పట్టించడానికే హెరిటేజ్ సంస్థను రాజకీయాల్లోకి లాగారని తెలిపారు. ÷రాజకీయాలకు తనను వాడుకుంటున్న వారిని శ్రీవారు కచ్చితంగా శిక్షిస్తారనేది చరిత్ర ఎరిగిన సత్యమని హెచ్చరించారు. హిందూ సమాజం, శ్రీవారి భక్తుల మనోభావాలు కాపాడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు.

# అవకాశాలను అందిపుచ్చుకుని సాగాలి

తూటాలతో గాంధీని చంపారని విమర్శించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయని, గాంధీ ఆలోచనలపై కూడా భిన్నాభిప్రాయాలు చెప్పినవారు ఉన్నారని తెలిపారు. 'భిన్నాభిప్రాయాలు చెప్పిన వారిని తరిమేస్తే మనకే నష్టం.. అందరూ కలిసి పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చు' అని రేవంత్ అన్నారు. పార్టీలో ఏ లిస్టులకు చోటు లేదు.. కేవలం మెరిట్ లిస్టు ప్రకారమే అవకాశాలు వస్తాయి. డీసీసీ పదవి ఎంతో విలువైనది.. వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోవద్దు. డీసీసీ నుంచి పీసీసీ కావొచ్చు. ఎమ్మెల్యే కావొచ్చు.. ఎంపీ కావొచ్చు.. సీఎం కావొచ్చని రేవంత్ రెడ్డి అన్నారు.రెండున్నర శాతం ఓట్ల నుంచి 40 శాతం వరకు కాంగ్రెస్ పార్టీని తీసుకొచ్చామన్నారు. డిజిటల్ మెంబర్‌షిప్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్‌లో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసినవాళ్లమవుతామన్నారు. ఎన్నికలకు సమగ్ర సన్నద్ధత, ప్రజలతో అనుసంధానమే లక్ష్యంగా తెలంగాణ, ఏపీకి చెందిన డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం రూ.వేల కోట్ల ఆస్తులను త్యాగం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారు. పార్టీలో అందరి పనితీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్నవారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ బాధ్యతలు తీసుకున్న వారిని వెతికి మరీ పదవులు ఇచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. నాయకుల ప్రతీ కదలికను గమనిస్తూనే ఉంటామని.. మెరిట్ కోటా తప్ప కాంగ్రెస్‌లో ఏ కోటా లేదని స్పష్టం చేశారు. మెరిట్ కోటాలో పాస్ అయితేనే పదవులు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి చాలా విలువైనదని.. ఈ పదవిని దుర్వినియోగం చేస్తే దేవుడు కూడా కాపాడలేడ న్నారు. 'డీసీసీ అధ్యక్ష పదవి మీ ఉన్నతికి తొలిమెట్టు' అని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనాయకుల ను అవమానపరచాలని బీజేపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీకి ఉండడానికి సొంత ఇల్లు కూడా లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలపై సీఎం రేవంత్ రెడ్డి పొగడ్తల వర్షం కురిపించారు. రాజకీయ వారసత్వం నుంచి షర్మిల వచ్చినా ఆమె అవకాశాలను తీసుకోలేదన్నారు. ముళ్లబాటలో కూడా ఏపీలో కాంగ్రెస్ కోసం షర్మిల కష్టపడుతున్నారని తెలిపారు. ప్రజల దగ్గరికి వెళ్ళి రాజకీయాల్లో రాణించాలని షర్మిల చేస్తున్న కృషిని ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాగా, డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరయ్యారు. అలాగే, రెండు రాష్ట్రాల నుంచి సుమారు 70 మంది డీసీసీ అధ్యక్షులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు

# రాష్ట్రప్రభుత్వ విన్నపాన్ని మన్నించిన సిసిఐ

పొడిగించిన గడువును వినియోగించుకొని పత్తిని అమ్ముకోవాలని పత్తి రైతులను మంత్రి తుమ్మల కోరారు.రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, రాష్ట్రంలోని పత్తి రైతులకు ఇబ్బంది కలగకుండా, ఫిబ్రవరి నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లను కొనసాగించాలని సీసీఐ అంగీకరించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. రైతుల ప్రయోజనాలను ప్రాధాన్యంగా తీసుకొని కొనుగోళ్ల గడువును పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం మరియు సీసీఐ దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో పత్తి సాగు ఆలస్యంగా ప్రారంభమవడంతో దిగుబడులు కూడా ఆలస్యంగా మార్కెట్‌కు వస్తున్నాయి. ఈ వాస్తవ పరిస్థితిని కేంద్రానికి వివరిస్తూ కొనుగోళ్ల గడువును పొడిగించాలని మంత్రి గారు కోరారు. అలాగే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తో రాష్ట్ర పరిస్థితిని వివరించి, రైతులకు నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం 45.32 లక్షల ఎకరాలలో పత్తిని సాగు చేయగా, 28.29 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేయడం జరిగింది. ఇప్పటివరకు 8,80,053 మంది రైతుల నుంచి రూ.12,823 కోట్ల విలువైన 16.15 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. అదేవిధంగా ఇప్పటివరకు మార్కెట్ ద్వారా 2.24 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యత ప్రమాణాలు లేని పత్తిని కోనుగోలు చేయడం జరిగింది. అయినప్పటికీ రాష్ట్రంలో ఇంకా 9.99 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి రైతుల వద్ద ఉందని మార్కెటింగ్ అధికారులు అంచనా వేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ పై మొదట రైతులు మరియు జిన్నర్ల నుండి వ్యతిరేకత వచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తూ, రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన యాప్ కి రాష్ట్ర ప్రభుత్వం సపోర్టు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీంతో ఈ యాప్ ద్వారా రైతులు క్యూలలో నిలబడే అవకాశం లేకుండా, సమయపాలన పాటిస్తూ, రైతులకు దగ్గరలోని పత్తి కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించుకునే అవకాశం కలగడంతో పాటు, పత్తి కొనుగోళ్లను రెగ్యులేట్ చేస్తూ, పారదర్శకంగా కొనుగోళ్లను చేపట్టే వెసులుబాటు కలిగిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతులకు సమయానికి ఎరువుల పంపిణీకి తమ సర్కారు మొబైల్ యూరియా బుకింగ్ యాప్ ని తీసుకొచ్చిందన్నారు. తద్వారా యూరియా బ్లాక్ మార్కెటింగ్ అరికట్టడంతో పాటు అధిక నిల్వలను నియంత్రిస్తూ పారదర్శక పంపిణీ వ్యవస్థ అమల్లోకి వచ్చిందన్నారు. పంట పూర్తిగా మార్కెట్‌కు రాకముందే సీసీఐ వారు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తారనే సమాచారంతో రైతుల్లో ఆందోళన నెలకొందని, నాణ్యమైన పత్తిని ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందనే భయం రైతుల్లో ఉన్న నేపథ్యంలో, మరో 30 రోజులు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని మంత్రి తుమ్మల సీసీఐను ప్రత్యేకంగా కోరారు. రాష్ట్రంలోని ప్రతి పత్తి రైతు తన పంటను పూర్తిగా విక్రయించే వరకు కొనుగోలు కేంద్రాలను తెరిచి ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సీసీఐ సీఎండీ శ్రీ లలిత్ కుమార్ గుప్తా మరియు కేంద్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్‌లకు మంత్రి ఆదేశాలతో వ్యవసాయశాఖ సెక్రటరీ లేఖ రాశారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనుగోళ్ల గడువు పొడిగించడంతో రైతులకు ఉపశమనం లభించిందని మంత్రి తెలిపారు. పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకొని రైతులు సమీపంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకువచ్చి మద్దతు ధరకు విక్రయించుకోవాలని మంత్రి కోరారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

# గ్రామీణ ప్రాంతాల్లో గడచిన 12 ఏండ్లల్లో ఒక్క ఇల్లు కూడా లేదు

అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా శనివారం హైదరాబాద్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గృహ నిర్మాణానికి సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో గృహ నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పది సంవత్సరాలలో సంవత్సరానికి కనీసం పదివేల ఇండ్లను కూడా నిర్మించలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రెండేళ్ల క్రితం రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన మా ప్రభుత్వం పేదల ఇండ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వచ్చే మూడు సంవత్సరాలలో రాష్ట్రం లో అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజురు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతం అవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం గతంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 1.0లో భాగస్వామ్యం కాలేదు. అయితే 2023 తరువాత మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం 2.0 లో రాష్ట్రం అధికారికంగా చేరింది. 2024 ఆగస్టులో కేంద్ర మంత్రివర్గం 2.0కు ఆమోదం తెలిపి, ఆవాస్-?2018 సర్వే నవీకరణ తర్వాత సాచురేషన్ పద్ధతిలో గృహాల మంజూరు చేయాలని నిర్ణయించినప్పటికీ, పాత డేటా ఆధారంగా 2024-25 మరియు 2025-26 సంవత్సరాలకు ఇతర రాష్ట్రాలకు 1.19 కోట్ల గృహాలను కేటాయించింది. తెలంగాణ రాష్ట్రం ఖఓఉజ 1.0 లో భాగస్వామ్యం కాకపోవడంతో 2018 పెండింగ్ డాటా లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ విస్తృత సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారుల డేటాబేస్‌ను సిద్ధం చేసుకుంది. అయినప్పటికీ, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆవాస్?2024 మొబైల్ యాప్ ద్వారా మరోసారి సర్వే నిర్వహించి మొత్తం 11.57 లక్షల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో గత 12 ఏళ్లలో ఏర్పడిన పెండింగ్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోని పరిస్థితులను అర్థం చేసుకొని ఈ ఆర్థిక సంవత్సరములో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో రెండు లక్షల ఇండ్లను మజూరు చేయాలని' మంత్రి పొంగులేటి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి విజ్ఞప్తి చేశారు. పేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, పేదలకు సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# అవినీతి నిరూపిస్తే వెంటనే రాజీనామా

అన్నారని.. ఆయన కామారెడ్డికి చేసిందేమీ లేదని విమర్శించారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన అవకాశంతో తాను కాంగ్రెస్ నుంచి గతంలో గెలిచానని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి ప్రస్తావించారు. 'వైఎస్ రాజశేఖర్ రెడ్డి నా రాజకీయ గురువు. నువ్వు మా తండ్రి వద్ద చేతులు కట్టుకుని నిలబడ్డావ్. నువ్వు కట్టిన ఐదు అంతస్తుల భవనానికి మున్సిపల్ అనుమతి లేదు. ఈ నియోజకవర్గం నీ సొంతం కాదు. నీవల్లే నేను కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చాను. అసెంబ్లీలో హుందాగా ఉండాలని మాట్లాడిన నన్ను ఇలా చీప్‌గా మాట్లాడేలా చేశారు. నాపై నిందలేస్తే ఎలా ఉంటుందో ఈ రోజు చూశారు. ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది. నాపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేశా. మా వాళ్లు ఎవరూ రావద్దని నేను చెబితే మీరు వేలాదిగా తరలిరావాలని మెసేజ్‌లు పెట్టారు. రేపటి నుంచి గ్రామాలకు వస్తా, ఎవరు అడ్డుకుంటారో చూస్తా. బాన్సువాడలో గొడవ జరిగితే మేం మాట్లాడి సద్దుమణిగేలా చేశాం' అని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి తెలిపారు. 263 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎలాంటి అక్రమాలు లేవు. నేను ఒక్క గజం అమ్మినా నిరూపించాలని వెంకటరమణా రెడ్డి సవాల్ విసిరారు. 'దొంగలెవరో ప్రజలకు తెలుసు. నాకేం జరిగినా సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత. రేపటి నుంచి యుద్ధమే. ఇది సీఎంకు, నాకూ మధ్య యుద్ధం. కలెక్టర్ వద్ద కూర్చుందాం. కాలేజీ కమిటీ పేరిట ఎఫ్‌డీలు ఉన్నాయి. అరోరా ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన అక్రమాలపై పోరాడాం. తెలంగాణ యూనివర్సిటీని కామారెడ్డిలో పెట్టమని కోరాం. అప్పుడు మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ ఏం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడితే ఊరుకోం. సోమవారం కలెక్టర్ వద్దకు వెళ్దాం. నాపై ఒక్క తప్పు తేలినా కాళ్లు పట్టుకుంటా, పదవి వదులుకుంటా. రమ్మంటే సీఎంఓకు వస్తా' అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ కాలేజీ భూముల్లో ఒక్క ఇంచు తేడా వచ్చిన రాజీనామా చేస్తానన్నారు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి. దొంగ ఎవరో దొర ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఇన్ని రోజులు ప్రశాంతంగా ఉన్న కామారెడ్డిని రణరంగంగా మార్చారని ఫైర్ అయ్యారు. తనను చంపుతామని బెదిరించారని..ఇవాళ ఆ పనిచేశారని ఆరోపించారు. తాను పిలిస్తే వేలమంది రోడ్లమీదకు వచ్చేవాళ్లు.. అపుడు పరిస్థితి ఎలా ఉండేదని ప్రశ్నించారు వెంకటరమణా రెడ్డి. తాను తప్పు చేసినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పారు. రేపటి నుంచి గ్రామాల్లో తిరుగుతా. ఇక యుద్ధ వాతారణమేనని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి హెచ్చరించారు. తనపై ఏం జరిగినా ప్రభుత్వానిది, సీఎందే బాధ్యత అనిచెప్పారు. ఇవాళ కారు బోల్తా పడింది రేపు మీ ప్రభుత్వం కూడా బోల్తా పడుతుందన్నారు. తమ కుటుంబంపై వచ్చిన ఆరోపణల విషయంలో తన నిజాయితీ నిరూపించుకునేదాక ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటి వరకు కామారెడ్డిలో ఏది జరిగిన భరించా ఇక నుంచి భరించే ప్రసక్తే లేదన్నారు.

# పసి పిల్లలపై లైంగిక దాడులు

### - 33 మంది బాలలకు నరకం చూపిన దంపతులు

### - మరణశిక్ష విధించిన సిబిఐ కోర్టు

**లక్నో,ఫిబ్రవరి21 వెలుతురు:**

అభంశుభం తెలియని పసి పిల్లలపై కొందరు మానవ మృగాలు లైంగిక వేధింపులకు పాల్పడ్డ కేసులో దంపతులకుమరణశిక్ష పడింది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారికి కోర్టులు సైతం కఠిన శిక్షలు విధిస్తున్నాయి. తాజాగా ఇలాంటి ఓ కేసు విషయంలో దంపతులకు మరణశిక్ష పడింది. పదేళ్లలో 33



మంది బాలురపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు, ఆ దృశ్యాలను చిత్రీకరించి విదేశాలకు పంపించిన ఈ నరరూప రాక్షస దంపతులకు సరైన శిక్షపడింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రామ్ భవాన్.. చిత్రకూట్ జిల్లాలో గతంలో నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో తన భార్య దుర్గావతితో కలిసి 2010-2020 మధ్య.. బందా, చిత్రకూట్ ప్రాంతాల్లో బాలురపై లైంగిక దాడులకు పాల్పడ్డాడు. వీరి దారుణాలకు బలైన వారిలో మూడేళ్ల వయసు చిన్నారులు కూడా ఉన్నారు. ఆన్‌లైన్ వీడియో గేమ్స్, బహుమతులు, తినుబండారాల పేరుతో పిల్లలను మభ్యపెట్టి ఇంటికి రప్పించి ఈ దారుణాలకు ఒడిగట్టారు. ఈ దంపతుల దారుణాలకు సంబంధించిన 2 లక్షల వీడియోలు, ఫొటోలను ఇంటర్నెట్ ద్వారా 47 దేశాలకు పంపించారు. నిందితులపై సీబీఐ 2020 అక్టోబరులో కేసు నమోదు చేసింది. మైనర్ బాధితుల పట్ల సీబీఐ దర్యాప్తు సున్నితంగానే కొనసాగింది. రామ్ భవాన్, అతడి భార్యపై 2021 ఫిబ్రవరిలో సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఆ దంపతుల నుంచి ప్రాణాలతో బయటపడిన పిల్లల్లో కొందరి ప్రైవేట్ భాగాలపై గాయాలు అయ్యాయని, వారిలో కొందరు ఏళ్ల తరబడి ఆసుపత్రులలో చికిత్స తీసుకోవాల్సి వచ్చిందని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఐదేళ్ల పాటు యూపీలోని పోక్సో కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. తాజాగా కోర్టు తుది తీర్పును వెల్లడించింది. దీన్ని అత్యంత అరుదైన కేసుగా పోక్సో కోర్టు అభివర్ణించింది. ఈ కేసులో నిందితులైన మాజీ ఇంజినీరు దంపతులకు మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. అలానే బాధితులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# ఆరు రాష్ట్రాల్లో పూర్తయిన సర్ ప్రక్రియ

**- గుజరాత్‌లో 68 లక్షల 12 వేల 711 ఓట్ల తొలగింపు**

**- వివరాలు వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి21 వెలుతురు:**
ఆరు రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయింది. ఆ వివరాలను ఎన్నికల కమిషన్ శనివారంనాడు విడుదల చేసింది. రివిజన్ పక్రియలో భాగంగా ఆయా రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో అనర్హత కలిగిన ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. తాజాగా విడుదల చేసిన జాబితాలో అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల కంటే గుజరాత్‌లో అత్యధికంగా ఓటర్ల తొలగింపు చోటుచేసుకుంది. రికార్డు స్థాయిలో 68 లక్షల 12 వేల 711 మందిని జాబితా నుంచి తొలగించింది. ఎస్ఐఆర్ పక్రియకు ముందు 5,08,43,436 మంది ఓటర్లు ఉండగా అది ప్రస్తుతం 4,40,30,725కు తగ్గింది. మధ్యప్రదేశ్‌లో 34,25,078 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించింది. దీంతో ఓటర్ల సంఖ్య 5,74,06,143 నుంచి 5,39,81,065కు తగ్గింది. తర రాష్ట్రాల్లోనూ గణనీయంగా ఓటర్ల జాబితాలో సవరణలు చేటుచేసుకున్నాయి. రాజస్థాన్‌లో ఓటర్ల సంఖ్య 5,46,56,215 నుంచి 5,15,19,929 మందికి తగ్గింది. ఛత్తీస్‌గఢ్‌లో 2,12,30,737 నుంచి 1,87,30,914కు, కేరళలో 2,78,50,855 నుంచి 2,69,53,644కు తగ్గింది. గోవాలో ఓటర్ల సంఖ్య 11,85,034 నుంచి 10,57,566కు తగ్గింది. కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ ఐలాండ్స్‌లో 52,364 మందిని జాబితా నుంచి తొలగించారు. దీంతో ఓటర్ల సంఖ్య 3,10,404 నుంచి 2,58,040కి తగ్గింది. పుదుచ్చేరిలో ఓటర్ల సంఖ్య 10,21,578 నుంచి 9,44,211 మందికి, లక్షద్వీప్‌లో 57,813 నుంచి 57,607కు తగ్గింది. ఓటర్ల మరణం, శాశ్వతంగా నివాసస్థలాల మార్పు, పలుచోట్ల రిజిస్టర్ చేయించుకోవడం, ఇతర అనర్హత కారణాల వల్ల ఓటర్ల తొలగింపు జరిగిందని, కొత్త ఓటర్లకు జాబితాలో చోటు కల్పించామని ఈసీ తెలిపింది. ఎన్నికల జాబితా అప్‌డేట్ అనేది నిరంతర పక్రియ అని, అర్హత కలిగిన పౌరులు అప్లయ్ చేసుకోవడం, ఎంట్రీల కరెక్షన్ వంటివి చేసుకోవచ్చని పేర్కొంది.

# అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం

**- దేశ రైతులతో పాటు తెలంగాణకూ ముప్పే**

**- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు**

**హైదరాబాద్,ఫిబ్రవరి21 వెలుతురు:**
కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఇటీవల చేసుకున్న ఒప్పందాల వల్ల తెలంగాణ రైతులతో పాటూ దేశంలోని రైతులు తీవ్ర నష్టానికి గురయ్యే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అమెరికాలో సాగవుతున్న జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటలను భారతదేశంలోకి ఎలాంటి టాక్స్ లేకుండా అనుమతించడం వల్ల మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న రైతులతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతులు ప్రమాదంలో పడతారని తెలిపారు.



మన దేశంలో కూడా అన్నదాతలు మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, పత్తి పంటలని ఎక్కువగా పండిస్తూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. అమెరికా దేశం నుంచి ఈ పంటలను దిగుమతి చేసుకోవడం వల్ల తెలంగాణలో ఉన్న రైతులంతా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో రైతులకు సంబంధించిన ఓ కార్యక్రమానికి హరీశ్‌రావు ఇవాళ (శనివారం) హాజరయ్యారు. వివిధ స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయం చేస్తే మంచి లాభాలు పొందే అవకాశం ఉందని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న యాంత్రిక పరికరాలను ఉపయోగించుకోవాలని దిశానిర్దేశర చేశారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ సర్కార్ రైతు భరోసా రావడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. కేవలం 12 గంటల పాటే విద్యుత్ సరఫరా ఇస్తున్నారని, ఎరువులు సకాలంలో అందడం లేదని చెప్పుకొచ్చారు. అన్నదాతల సమస్యలను త్వరలో జరిగే రాష్ట్ర బ్జడెట్ సమావేశాల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేసే రైతులకు వ్యవసాయ పనిముట్లు, డ్రోన్లు, ట్రాక్టర్లు సబ్సిడీకి ఇచ్చే విధంగా బ్జడెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# స్వావలంబనతోనే అభివృద్ధి సాధ్యం

**- ప్రధాని నరేంద్ర మోదీ**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి21( వెలుతురు):**
భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే స్వావలంబన సాధించడం అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.



దీనికోసం సెమీకండక్టర్ చిప్‌ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని తెలిపారు. హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్ కలిసి ఉత్తర్‌ప్రదేశ్‌లోని జేవర్‌లో ఏర్పాటు చేయనున్న సెమీకండక్టర్ పరిశ్రమకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. 'వికసిత భారతానికి 'మేడ్ ఇన్ ఇండియా' చిప్‌లు ఎంతో ముఖ్యం. కరోనా సమయంలో చిప్‌ల సరఫరా వ్యవస్థ దెబ్బతినడంతో.. అనేక ఆర్థిక వ్యవస్థల అభివృద్ధి నిలిచిపోయింది. వివిధ కర్మాగారాల్లో పనులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో చిప్‌ల తయారీలో స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత దశాబ్దంలో సాంకేతికపరంగా మనం తీసుకుంటున్న చర్యలు.. 21వ శతాబ్దంలో దేశ శక్తిసామర్థ్యాలకు పునాదులు అవుతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్ సంస్థలు కలిసి జేవర్‌లో 'ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్' (ఓఎస్ఏటీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నాయి. దీని కోసం రూ.3,700 కోట్ల పెట్టుబడిని ప్రకటించాయి. 2028 నాటికి ఇది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ పరిశ్రమ 3,500 ఉద్యోగాలు సృష్టిస్తుందని అంచనా. ఈ ప్లాంట్ నెలకు 3.6 కోట్ల చిప్‌ల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

# బాడుగ ఒప్పందాలు - అన్నదాతల ఆర్తనాదాలు



**దూడం సంతోష్,**
**సామాజిక విశ్లేషకులు.**

*ఒక తెలుగు సినిమాలో డైలాగ్ లో పేర్కొన్నట్టు... ఈ సమాజంలో జరిగే ఒక పరిణామం... ఇంకొక పరిణామాన్ని ప్రభావితం చేస్తుంది. అదే విధంగా ఉంది మనం ఇటీవల చదువుతున్న అమెరికా వాణిజ్య ఒప్పందం. ఎందుకంటే, దీంతో దేశ రైతాంగం చాలా ఇబ్బందులు ఎదుర్కొనున్నది. భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశ రైతాంగంపై జరిగిన ఒక దాడిగా చెప్పవచ్చు. ఇది సాధారణ వ్యాపార ఒప్పందం కాదు... భారత రైతు భవిష్యత్తును తాకట్టు పెట్టిన ఘాతుకంగా అభివర్ణించవచ్చు. అయితే, భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ వెల్లడించడం సైతం సర్వత్రా విమర్శలకు కారణమైన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు ఈ వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, పాడి పరిశ్రమలకు సంబంధించిన ప్రయోజనాలను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినా, మోడీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలు, రైతు సంఘాలు, రైతుల విజ్ఞప్తులను ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకు వెళ్ళడం అన్నివర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. మోడీ ప్రభుత్వ నిరంకుశపూరిత వైఖరికి నిరసనగా... ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా రైతు సంఘాలు సమ్మె కూడా చేపట్టాయి. ప్రధాని మోడీ ప్రభుత్వ నిరంకుశ, రైతు వ్యతిరేక విధానంపై అన్నదాతలు ఆందోళనలు భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు.*

ఇప్పటికే రైతు వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చిన మోడీ ప్రభుత్వం, దానిపై రైతులు పెద్ద ఎత్తున పోరాటం చేస్తే వాటిని వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందే. అయితే, ఆ పరిణామం తర్వాత కూడా మోడీ ప్రభుత్వ వైఖరిలో ఎటువంటి మార్పు రావడం లేదు. తాజా అమెరికా వాణిజ్య ఒప్పందం మరింత ప్రమాదకరంగా తయారైంది. ఈ ఒప్పందం మీద అమెరికా మంత్రి బ్రూక్ రోలిన్స్ మాట్లాడుతూ... ఈ నిర్ణయం అమెరికా రైతులకు లాభదాయకమని అభివర్ణించారు. కానీ, భారతీయ రైతులకు ఈ ఒప్పందం శరఘాతంలా మారిన విషయం ప్రధాని మోడీ ఆయన పరివారం ఎందుకు గుర్తించడం లేదో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి. అమెరికా సోయాబీన్ ఆయిల్, డిస్టిలర్స్ గ్రెయిన్స్‌కు భారత మార్కెట్ తలుపులు తెరవడం ద్వారా దేశీయ రైతును తన నేలపైనే పోటీ చేయలేని స్థితికి నెట్టివేస్తున్నారు. చౌక విదేశీ దిగుమతులు పాడి, పశుసంవర్ధక రంగాలను కూల్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తాయి. "పంట మనది లాభం పరాయిది" అనే దోపిడీ విధానాన్ని దేశంపై ప్రధాని మోడీ బలవంతంగా రుద్దుతున్నారు. ఎంఎస్‌పీ హామీలతో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం నేడు అంతర్జాతీయ డంపింగ్‌కు ద్వారాలు తెరిచి రైతును బలి చేస్తోందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. రైతు రక్షణ ముసుగులో అమెరికా బహుళజాతి సంస్థల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నది. ఈ ఒప్పందం భారత ఆహార భద్రతను బలహీనపరిచే కుట్రనే. కాగా, ఇంతటి కీలక నిర్ణయం తీసుకునే ముందు... రాష్ట్రాలను సంప్రదించకపోవడం, పార్లమెంటులో చర్చ జరపకపోవడం, రైతు సంఘాల అభిప్రాయాన్ని లెక్కలోకి తీసుకోకపోవడం ప్రజాస్వామ్య విలువల స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించారు. దేశ భవితను నిర్ణయించే ఇంత పెద్ద అంశాన్ని సరైన వేదికల్లో కనీస చర్చ లేకుండా రాజ్యాంగ విలువల్నీ పాతరేయడం కిందకు వస్తుంది. ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసి రైతుకు చట్టబద్ధ రక్షణ కల్పించాల్సిన అసవరముంది. దేశాన్ని పోషించే రైతును బలి చేసి ఏ ప్రభుత్వం నిలబడలేదన్న విషయం మోడీ గుర్తించుకోవాలి. పాడి పరిశ్రమపై తీవ్రంగా ప్రభావం చూపుతుంది. అమెరికా నుండి పౌల్ట్రీ ఉత్పత్తులు, డిస్టిలర్స్ గ్రెయిన్స్ (పశువుల మేతగా వాడేవి) దిగుమతి అయితే, దేశీయ పశుగ్రాసం ధరలు పడిపోయతాయి. పాడి రైతులకు ఆదాయం తగ్గుతుంది. మన అవసరాలకు సరిపడా ఆహారాన్ని మనమే పండించుకోకుండా, దిగుమతులపై ఆధారపడితే... భవిష్యత్తులో అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల వల్ల దేశంలో ఆహార కొరత ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెకు రైతులంతా పిలుపునిచ్చి విజయవంతం చేశారు. కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)ను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, దానిని ఒక చట్టపరమైన హక్కుగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర జాబితాలో ఉన్న వ్యవసాయం గురించి కేంద్రం నిర్ణయాలు తీసుకునేటప్పుడు రాష్ట్రాలను సంప్రదించకపోవడంపై ఆగ్రహం కల్పించడం జరుగుతున్నది. వ్యవసాయ రంగంలోకి బహుళజాతి సంస్థల ప్రవేశం వల్ల రైతు కేవలం ఒక 'కూలీ'గా మారిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం రాష్ట్ర పరిధిలోని అంశం. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం ఇలాంటి ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్ల కేంద్ర-రాష్ట్రాల సయోధ్య పోతుంది. ఇంతటి కీలకమైన మార్కెట్ మార్పులపై పార్లమెంటులో చర్చ జరగకపోవడం వల్ల, భవిష్యత్తులో తలెత్తే లోటుపాట్లను సరిదిద్దే అవకాశం లేకుండా పోతుంది. అమెరికా వంటి దేశాల్లో యాంత్రీకృత వ్యవసాయం వల్ల ఖర్చులు తక్కువ, కానీ భారత్ లో ఎక్కువ మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారన్న విషయం ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం గుర్తించి సరైన నిర్ణయాలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉన్నది.

# డిజైన్, ఆవిష్కరణ, బాధ్యతలు మూల స్తంభాలని స్పష్టం చేసిన ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ సదస్సు








**హైదరాబాద్, ఫిబ్రవరి 21, 2026:**
హైదరాబాద్‌లోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) తన ప్రాంగణంలోని ఆడిటోరియంలో వైభవంగా నిర్వహించిన 5వ స్నాతకోత్సవ వేడుక విద్య గొప్పతనాన్ని ఘనంగా చాటింది. ఈ వేడుక 2025 గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్ విద్యా ప్రయాణంలో కీలక మైలురాయిగా నిలిచింది. ఈ బ్యాచ్ విద్యార్థుల విజయాలను గుర్తించిన ఈ వేడుక... డిజైన్, ఫ్యాషన్, ఫుట్‌వేర్, రిటైల్, అనుబంధ రంగాల్లో వృత్తిపరమైన కెరీర్‌ల కోసం వారిని సిద్ధం చేసింది. ఈ వేడుకకు భారత ప్రభుత్వ బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన స్నాతకోత్సవ ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ... తయారీ, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ప్రపంచంలో పెరుగుతున్న భారత్ ఆధిపత్యాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధాన చోదక శక్తిగా ఉన్న పాదరక్షలు, తోలు రంగం లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తోందని... ఎగుమతులు, ఎమ్ఎస్ఎమ్ఈల వృద్ధికీ గణనీయంగా దోహదపడుతోందని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ప్రపంచస్థాయి సామర్థ్యాలను బలోపేతం చేయడం కోసం సాంకేతికత, సుస్థిరత, డిజైన్ ఆవిష్కరణలను ఉపయోగించుకోవాలని ఆయన గ్రాడ్యుయేట్లను ప్రోత్సహించారు. ఎఫ్‌డీడీఐ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వివేక్ శర్మ (ఐఆర్ఎస్) ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన కోర్సు పూర్తి చేసుకున్న గ్రాడ్యుయేట్లను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా సమర్థులైన నిపుణులను అభివృద్ధి చేయడం పట్ల సంస్థ నిబద్ధతను శ్రీ వివేక్ శర్మ స్పష్టం చేశారు. అర్థవంతమైన సామాజిక ప్రభావాన్ని సృష్టించడానికి ఆవిష్కరణలు, సుస్థిరత, నైతిక పద్ధతులు, వినూత్న పరిష్కారాలను ఆవిష్కరించే ఆలోచనలను స్వీకరించాలని ఆయన విద్యార్థులను కోరారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్ లోహిత్ రెడ్డి (ఐఏఎస్) స్వాగత ప్రసంగంతో ఈ వేడుక ప్రారంభమైంది. 2018లో హైదరాబాద్ క్యాంపస్ ఏర్పాటు నుంచి ఈ సంస్థ సాధించిన వేగవంతమైన వృద్ధిని ఆయన వివరించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఆధునిక ప్రయోగశాలలు, మెరుగైన పరిశ్రమ సహకారాలు వంటి కీలక విజయాలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. 2025 బ్యాచ్‌లో ఫ్యాషన్ డిజైన్, ఫుట్‌వేర్ డిజైన్, లెదర్ గూడ్స్-యాక్సెసరీస్ డిజైన్, మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు చెందిన 72 మంది గ్రాడ్యుయేషన్ విద్యార్థులు ఉన్నారు. ఈ వేడుకలో భాగంగా విద్యార్థుల విద్యా నైపుణ్యాన్ని గుర్తిస్తూ, ఆయా ప్రోగ్రామ్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్నాతకోత్సవ ప్రతిజ్ఞనూ నిర్వహించారు. ప్రముఖులు, అధ్యాపకులు, పరిశ్రమ భాగస్వాములు, గర్వంతో ఉప్పొంగుతున్న తల్లిదండ్రుల సమక్షంలో గ్రాడ్యుయేట్లకు అధికారికంగా డిగ్రీలను ప్రదానం చేశారు. నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, పరిశోధన, పరిశ్రమ ఏకీకరణ ద్వారా భారత పాదరక్షలు, తోలు, ఫ్యాషన్, రిటైల్ వ్యవస్థలను బలోపేతం చేయడంలో ఎఫ్‌డీడీఐ కీలక పాత్ర పోషిస్తూనే ఉందని వక్తలు పేర్కొన్నారు. డిజైన్, తయారీలో సుస్థిర పద్ధతులను, ఔత్సాహిక పరిశ్రమలను, ప్రపంచస్థాయి ప్రమాణాలను ప్రోత్సహించడానికి ఈ సంస్థ కట్టుబడి ఉంది.

# హైదరాబాద్‌లోని ఐసీఏఆర్-నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (ఎన్ఏఏఆర్ఎం) లో నూతనంగా నిర్మించిన క్షమత భవన్ ను ప్రారంభించిన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్




**హైదరాబాద్ వెలుతురు 21 ఫిబ్రవరి,2026:**
హైదరాబాద్‌లోని ఐసీఏఆర్-నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (ఎన్ఏఏఆర్ఎం) లో క్షమత భవన్ ను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు (2026 ఫిబ్రవరి 21) ప్రారంభించారు. ఐసీఏఆర్ - నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన తరుణంలో ఈ భవనం ప్రారంభం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. క్షమత భవన్ ఐసీఏఆర్- ఎన్ఏఏఆర్ఎం మౌలిక సదుపాయాలకు ఒక ముఖ్యమైన జోడింపు. ఈ భవనం కేవలం ఒక కట్టడమే కాకుండా, వ్యవసాయ రంగంలోని వివిధ భాగస్వాముల, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కేంద్రంగా పనిచేస్తుంది. హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ సంస్థల పురోగతి, భవిష్యత్తు ప్రణాళికలను కేంద్ర మంత్రి ఈ సందర్భంగా సమీక్షించారు. అన్ని ఐసీఏఆర్ సంస్థల కృషిని అభినందిస్తూ, ముఖ్యంగా నూనెగింజలు, చిరుధాన్యాల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించేలా, రైతుల ఆదాయాన్ని పెంచేలా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు, డీఏఆర్ఈ కార్యదర్శి, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాంగి లాల్ జాట్ శాస్త్రవేత్తలతో ముఖాముఖి చర్చలు జరిపారు. వ్యవసాయ శాస్త్రీయ పరిశోధనల్లో ఆలోచనలు, వనరులను వినియోగించేటప్పుడు సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా, వినూత్నంగా ఆలోచించాలని ఆయన సూచించారు. ఈ ముఖాముఖి కార్యక్రమంలో ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (మత్స్య, వ్యవసాయ విద్య) డాక్టర్ జయకృష్ణ జెనా కూడా పాల్గొన్నారు. ఐకార్ - నార్మ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర మంత్రికి నార్మ్ చేపడుతున్న వివిధ సామర్థ్య పెంపుదల కార్యక్రమాలు, సంస్థ సాధించిన విజయాల గురించి వివరించారు.



# సంపాదకీయం.. నయా నియంతృత్వంలో ట్రంప్

ట్రంప్ కారణంగా ప్రపంచ దేశాలకు పీడతప్పడం లేదు. సుంకాలపై అమెరికా సుప్రంకోర్టు చెంప ఛెళ్లు మనిపించినా తగ్గేది లేదంటున్న ట్రంప్‌తో చిక్కులు, ముప్పు తప్పేలా లేదు. ఎందుకంటే ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని, సుప్రీం తీర్పును అధ్యయనం చేస్తున్నామని ప్రకటించారు. ఇది ఓ రకంగా అమెరికా పౌరులకే కాకుండా, ప్రపంచ పౌరులకు కూడా అశనిపాతం లాంటిది. ఇంకా చెప్పాలంటే ప్రపంచానికి ట్రంప్ ఇప్పుడు గుదిబండగా మారారు. ఆయన యుద్ద పిపాస కూడా ప్రపంచ దేశాలకు శాపంగా మారుతోంది. అధికారం లేకున్నా.. అత్యవసర చట్టం కింద అడ్డగోలు సుంకాలు విధిస్తామంటే కుదరదని.. అది రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సుంకాలు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంది తప్ప.. రాజ్యాంగ నిర్మాతలు ఆ హక్కును కార్యనిర్వాహక శాఖకు అప్పగించలేదని స్పష్టం చేసింది. ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు చెబితే.. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు అమెరికా ప్రయోజనాలకే విరుద్ధంగా ఉందంటూ ట్రంప్ మండిపడ్డారు! విదేశీ శక్తుల ప్రభావానికి లోనయ్యారంటూ జడ్జీలపైనే ఆరోపణలు చేశారు. వారు అమెరికాకే అవమానకరమని దుయ్యబట్టారు. సుంకాలపై తగ్గేదేలేదని..వాటి స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాలను అమలుచేస్తామని తేల్చిచెప్పారు. వేరే చట్టాల కింద..అన్ని దేశాలపైనా 10శాతం ప్రత్యామ్నాయ సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. అంటే కోర్టులన్నా ట్రంప్ లెక్కచేయడం లేదని అర్థం చేసుకోవాలి. ఇది ఓ రకంగా చెప్పాంటే నాజీలను మించిన నియంతృత్వ ధోరణిలో ట్రంప్ ఉన్నారు. నాజీనేత హిట్లర్‌ను మించిన నియంతగా ఇప్పుడు



ట్రంప్ అవతరించాడు. ముక్కుపిండి సుంకాలు విధించడం, యుద్దాలతో బెదరించడం అలావాటు చేసుకున్న ఆధునిక నియంతలా ట్రంప్ మారాడు. ఇది ప్రపంచానికి ఓ హెచ్చరిక కావాలి. 'విమోచన దినం' పేరుతో గత ఏడాది ఏప్రిల్ 2వ తేదీన.. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద పలు దేశాలపై ఆయన విధించిన భారీ టారిఫ్‌లను కొట్టేస్తూ శుక్రవారం తీర్పు నిచ్చింది. ఆ చట్టం కింద ఇతర దేశాలతో వాణిజ్యాన్ని నియంత్రించే హక్కు మాత్రమే ఉంటుంది తప్ప సుంకాలు విధించే హక్కు ఉండదని తేల్చిచెప్పింది. తన అధికార పరిధిపై ట్రంప్ చేసిన అత్యంత వివాదాస్పద వాదనలను తోసిపుచ్చింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంటుందని.. టారిఫ్‌లు కూడా పన్నుల్లో భాగమేనని మెజారిటీ జడ్జిలు స్పష్టం చేశారు. అయితనా జడ్జిల తీర్పును తప్పు పట్టారు. ఇది న్యాయవ్యవస్థ ఉనికికి కూడా సవాల్ లాంటిదే. సుప్రీం తీర్పును కూడా సవాల్ చేసే స్థితికి ఇప్పుడు ట్రంప్ ఎదిగారంటే ఏమవుతుందో అన్న భయం అమెరికన్ల లోనే ఎక్కువగా ఉంది. టారిఫ్‌ల రూపంలో తాము కట్టిన సొమ్మును తిరిగి చెల్లించాలంటూ అతి పెద్ద వేర్‌హౌస్ చైన్ కాస్ట్‌కో సహా పలు కంపెనీలు ఇప్పటికే దిగువ కోర్టులకు క్యూ కట్టిన నేపథ్యంలో.. ఆ పక్రియ సంక్లిష్టంగా ఉండొచ్చని న్యాయమూర్తి బ్రెట్ క్యావనో అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. ఆయన తన తీర్పులో భారత్‌పై విధించిన 25శాతం అదనపు సుంకాల గురించి కూడా ప్రస్తావించారు. చైనా, యూకే, జపాన్, ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అధ్యక్షుడు ఈ సుంకాలను ఒక సాధనంగా ఉపయోగించుకున్నారు. రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై అదనంగా 25శాతం సుంకాలను విధించారు. రష్యా చమురు కొనబోమని భారత్ హామీ ఇవ్వడంతో ఆ సుంకాలను తొలగించారని క్యావనో గుర్తుచేశారు. ఇక.. ఈ తీర్పుతో అమెరికా స్టాక్ మార్కెట్ సూచీల్లో పెరుగుదల కనిపించింది. అంటే ఓ రకంగా మార్కెట్లు కూడా సుంకాల బారిన పడి విలవిల్లాడుతున్నాయని గుర్తించాలి. ట్రంప్ విధించిన టారిఫలతో అమెరికా ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు 14 దాకా 3,01,000 మందికిపైగా దిగుమతిదారుల నుంచి 133 బిలియన్ డాలర్లు అంటే రూ.12 లక్షల కోట్లు వసూలు చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా వసూలైన మొత్తం కూడా కలిపితే అది 175 బిలియన్ డాలర్ల రూ.16 లక్షలకోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇవి ఓ దేశ బడ్జెట్‌కన్నా ఎక్కువే. ట్రంప్ ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధం.. అమెరికా వాణిజ్య భాగస్వాములతో సంబంధాలను దెబ్బతీయడమే కాక, ఆర్థిక మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తీవ్ర అనిశ్చితికి కారణమైంది. ట్రంప్ టారిఫ్ విధానాలు చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పినట్లైందని కెనడా అభిప్రాయపడింది. తీర్పు ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నామని యూరోపియన్ యూనియన్ తెలిపింది. పరిస్థితులు ఎలా ఉన్నా అమెరికాతో తమ ప్రత్యేక వ్యాపార, వాణిజ్య సంబంధాలు కొనసాగుతాయని బ్రిటన్ తెలిపింది. అమెరికాతో కలిసి పనిచేస్తామంది. ట్రంప్ టారిఫ్‌ల వల్ల నష్టపోయిన వ్యాపారసంస్థలు, డెమొక్రాట్ల పాలనలో ఉన్న 12 అమెరికా రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ తన అధికార పరిధిని మించి ఈ చట్టాన్ని వాడారని, పన్నులు వేసే అధికారం అధ్యక్షుడికి లేదని దిగువ కోర్టు తీర్పు ఇచ్చింది. ట్రంప్ సర్కారు ఆ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. సుప్రీం కూడా ఆ తీర్పును సమర్థించింది. ఈ తీర్పును వెలువరించిన ధర్మాసనంలో.. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నియమించిన ముగ్గురు కన్జర్వేటివ్ జడ్జీలు ఉన్నారు. దీంతో తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తుందని చాలా మంది భావించారు. ట్రంప్ కూడా.. ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన కేసుల్లో ఒకటని.. ఒకవేళ తీర్పు వ్యతిరేకంగా వస్తే అది దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ అవుతుందని హెచ్చరించారు. అయితే ఈ దశలో ట్రంప్ మొండివైఖరి కారణంగా అమెరికా పెత్తనం చెలాయించాలన్న పట్టుదల కనిపిస్తోంది. ప్రపంచ దేశాలు ఏమైనా తనకు అక్కర్లేదన్న ధోరణి కనిపిస్తోంది.

## మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం

### - వాసుదేవరెడ్డిని అదుపులోకి తీసుకున్న సిట్



**అమరావతి,ఫిబ్రవరి21( వెలుతురు):**
మద్యం కుంభకోణం కేసులో.. విచారణను సిట్ వేగవంతం చేసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారుల్లో ఒకరైన వాసుదేవరెడ్డిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. దాదాపు రూ. 3,500 కోట్ల మేర అవినీతి జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఈ కేసులో వాసుదేవరెడ్డి అరెస్ట్ అత్యంత కీలకంగా మారింది.వాసుదేవరెడ్డి వైసీపీ హయాంలో బెవరేజెస్ కార్పొరేషన్‌లో కీలక బాధ్యతల్లో ఉండి, మద్యం పాలసీ రూపకల్పన, కంపెనీల ఎంపికలో కీలక పాత్ర పోషించినట్లు సిట్ అధికారులు నిర్ధారించారు. మద్యం కుంభకోణంలో వాసుదేవరెడ్డిని రెండో నిందితుడిగా (ఎ2) సిట్ అధికారులు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయన కొన్ని మద్యం కంపెనీలకు లబ్ది చేకూర్చారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ.. సిండికేట్లకు మేలు చేస్తూ వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్లు సిట్ అధికారుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి వాసుదేవరెడ్డి ఇప్పటికే కింది కోర్టులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే కోర్టు బెయిల్ నిరాకరించడంతో ఆయన ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో విచారణ జరుగుతుండగానే పోలీసులు ఆయన్ని అదుపులోకి తీసుకోవడం గమనార్హం. ఈ కేసులో కీలక వ్యక్తుల పేర్లు బయట పెట్టేందుకు వాసుదేవరెడ్డి 'అప్రూవర్' గా మారే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఆయన అప్రూవర్‌గా మారితే.. ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనేది బయటకు వచ్చే అవకాశం ఉంది. వాసుదేవరెడ్డి అరెస్ట్‌తో ఏపీ రాజకీయాల్లో వేడి రాజుకుంది. మద్యం సరఫరాలో జరిగిన అవకతవకలు, డిజిటల్ పేమెంట్లకు అవకాశం ఇవ్వకుండా నగదు రూపంలో జరిగిన లావాదేవీలపై సిట్ అధికారులు దృష్టి సారించారు. ఆయన అరెస్ట్ తర్వాత మరికొంత మంది అధికారులు, రాజకీయ నేతలకు నోటీసులు అందే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

## ప్రేయసి ఆత్మహత్యతో టెక్కీ ఆత్మహత్య

**విశాఖపట్నం,ఫిబ్రవరి21( వెలుతురు):**
భీమిలీలో విషాదం చోటుచేసుకుంది. స్థానికంగా గల ఒక హోటల్ లో శ్యాం కూమార్ అనే సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఉద్యోగి మృతికి ప్రేమ వ్యవహారమే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కొద్దిరోజుల క్రితం తన ప్రియురాలితో శ్యాంకుమార్ గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో కలత చెందిన తన ప్రియురాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయమై ఆ అమ్మాయి బంధువులు శ్యాంకుమార్ పై హైదరాబాల్ లోని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీంతో భయపడిన శ్యాంకుమార్ హోటల్ లో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు భావిస్తున్నారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. అమ్మాయి స్వస్థలం అనకాపల్లి కాగా ప్రియుడు శ్యాంకూమార్ హైదరాబాద్ కు చెందిన వాడిగా పోలీసులు తెలుస్తోంది.

## తూ.. తూ.. తూ.. ఇవేం పొత్తులు..? ప్రజాస్వామ్యా సిద్ధాంతాల శవ యాత్ర నా...!



**మన్నారం నాగరాజు.**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

**తెలంగాణ రాజకీయాలు నేడు ఒక విచిత్రమైన, బాధాకరమైన మలుపులో నిలిచాయి. ప్రజల ఆశలు, ఆకాంక్షలు, కలలు, కన్నీళ్లతో నిర్మితమైన ప్రజాస్వామ్యం, నేడు అధికారపు వ్యాపారం, పదవుల బేరసారాలు, సిద్ధాంతాల అమ్మకపు రాజకీయంగా మారుతోందన్న ఆవేదన ప్రతి సామాన్యుడి గుండెల్లో మోగుతోంది. ప్రజల కోసం పోరాడతామని, వారి జీవితాల్లో మార్పు తీసుకువస్తామని ఎన్నికల ముందు పెద్ద పెద్ద మాటలు చెప్పే నేతలు, ఎన్నికల తరువాత మాత్రం తమ స్వార్థ ప్రయోజనాల కోసం సిద్ధాంతాలను పక్కన పెట్టి చేతులు కలుపుతున్న దృశ్యం, ప్రజాస్వామ్యానికి అపహాస్యంగా మారింది.**

ఎన్నికల సమయంలో పరస్పరం శత్రువుల్లా తలపడే పార్టీలు, ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు, ఆరోపణలు చేసే నాయకులు, అధికారం కోసం అవసరమైతే అదే శత్రువులతో చేతులు కలిపి పదవులను పంచుకునే దృశ్యం నేడు సర్వసాధారణంగా మారింది. ప్రజలు ఓటు వేస్తున్నది సిద్ధాంతాల కోసం, విధానాల కోసం, తమ భవిష్యత్తు కోసం. కానీ రాజకీయ నాయకులు మాత్రం ఓట్లను కేవలం సంఖ్యలుగా, ప్రజలను ఓటు బ్యాంకులుగా, పదవులను సంపాదించడానికి సాధనాలుగా మాత్రమే చూస్తున్నారు. ఈ రాజకీయ వ్యాపారం వల్ల ప్రజాస్వామ్యం యొక్క మూల సారాంశం మసకబారుతోంది. ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, సమానత్వం వంటి మౌలిక లక్ష్యాలు పక్కకు నెట్టబడి, రాజకీయ లెక్కల గణితం, కులమతప్రాంత సమీకరణాల లెక్కలు మాత్రమే ముందుకు వస్తున్నాయి. ప్రజలు సమస్యలతో బాధపడుతుంటే, నాయకులు మాత్రం పదవుల పంచకం, అధికార బలాబలాలపై చర్చలు చేస్తున్నారు. ఈ పరిస్థితి ప్రజల్లో నిరాశ, అసహనం, అనుమానం పెంచుతోంది. "మా ఓటు విలువ ఏమిటి? మా నమ్మకం ఎవరి కోసం?" అనే ప్రశ్నలు ప్రతి పౌరుడి మనసులో మెదులుతున్నాయి. ప్రజాస్వామ్యం అనేది ప్రజల చేతుల్లో ఉండాల్సిన వ్యవస్థ, కానీ నేడు అది కొద్ది మంది నాయకుల రాజకీయ వ్యూహాల ఆటబొమ్మగా మారుతోంది. ఇలాంటి రాజకీయ సంస్కృతి కొనసాగితే ప్రజల విశ్వాసం పూర్తిగా చిద్రమవుతుంది. ప్రజలు రాజకీయాలపై విశ్వాసం కోల్పోతే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. అందుకే రాజకీయ పార్టీలకు, నాయకులకు ప్రజల పట్ల నైతిక బాధ్యత ఉంది. సిద్ధాంతాలు, విలువలు, ప్రజల ఆశలుఇవన్నీ కేవలం ఎన్నికల నినాదాలు కాకుండా ఆచరణలోకి రావాల్సిన అవసరం నేడు అత్యంత గంభీరంగా ఉంది. ప్రజాస్వామ్యం వ్యాపారం కాదు, అది ప్రజల స్వప్నాల ప్రతిబింబం. ఆ స్వప్నాలను కాపాడాల్సిన బాధ్యత నాయకులదే కాదు, ప్రజలదీ కూడా. ఒకప్పుడు రాజకీయాలు అంటే సిద్ధాంతం. సిద్ధాంతం అంటే త్యాగం. త్యాగం అంటే ప్రజల కోసం పోరాటం. కానీ నేడు రాజకీయాలు అంటే లెక్కలు, లావాదేవీలు, లాభనష్టాల గణితం. సిద్ధాంతాలు ఓట్ల కోసం బేరసారాల పావులుగా మారాయి. ప్రజల జీవితం ఒక ప్రయోగశాలగా, ప్రజల ఓటు ఒక రాజకీయ కరెన్సీగా మారింది. ప్రజాస్వామ్యం అనే మహత్తర వ్యవస్థ నేడు ఒక రాజకీయ మార్కెట్‌గా మారుతోందన్న ఆందోళన తలెత్తుతోంది. ఖమ్మం తో పాటు ఇతర జిల్లాలో జరుగుతున్న పరిణామాలు ఈ రాజకీయ సంక్షోభానికి ప్రతిబింబం. తెలంగాణ సాయుధ పోరాటం, రైతు ఉద్యమాలు, కార్మిక పోరాటాలతో వామపక్ష ఉద్యమాలకు ఊపిరి పోసిన ఖమ్మంనేడు సిద్ధాంతాల కంటే పదవులే ముఖ్యమన్న రాజకీయ నాటకానికి వేదికగా మారింది. బొగ్గు గనుల కార్మికుల చెమట, రైతుల పొలాల్లో జారిన కన్నీళ్లు, పోరాటాల చరిత్ర,ఇవన్నీ వామపక్ష రాజకీయాలకు సామాజిక బలాన్ని ఇచ్చాయి. కానీ అదే వామపక్షాలు నేడు తమ సిద్ధాంతాలను పక్కన పెట్టి బూర్జువా పార్టీలతో పొత్తులు పెట్టుకుంటున్నాయన్న విమర్శలు ప్రజల మనసును కలచివేస్తున్నాయి. ఇది వ్యూహమా? లేక సిద్ధాంత సంక్షోభమా? అనే ప్రశ్న ప్రతి వామపక్ష కార్యకర్త గుండెల్లో మోగుతోంది. మున్సిపల్ ఎన్నికల తరువాత తెలంగాణలో ఏర్పడిన రాజకీయ సమీకరణాలు ప్రజల విశ్వాసాన్ని తుడిచివేస్తున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ,సిద్ధాంతంగా ఒకరినొకరు తీవ్రంగా వ్యతిరేకించే పార్టీలుపదవుల కోసం చేతులు కలిపాయి. ఒకచోట కాంగ్రెస్–బీజేపీ కలిసి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు పంచుకుంటే, మరొచోట బీఆర్ఎస్–బీజేపీ కలిసి అధికారాన్ని దక్కించుకున్నాయి. ఇంకొచోట కాంగ్రెస్–బీఆర్ఎస్ కలిసి ప్రజల ఓట్లను పంచుకున్నారు. జాతీయ స్థాయిలో శత్రువులుగా, జిల్లా స్థాయిలో మిత్రులుగా మారే ఈ ద్వంద్వ రాజకీయాలు ప్రజలను అయోమయంలో నెట్టేశాయి. కమ్యూనిస్టు పార్టీలుసిద్ధాంత రాజకీయాలకు ప్రతీకగా, అధికారానికి దూరంగా, ప్రజల కోసం పోరాడే రాజకీయాలకు ప్రతినిధులుగా ప్రజల మనసుల్లో స్థానం సంపాదించాయి. కానీ తాజా ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం వేరు వేరు మున్సిపాలిటీల్లో వేరు వేరు పార్టీలతో పొత్తులు పెట్టుకోవడం, ఎక్కడ ఎక్కువ సీట్లు సాధిస్తే వారితో కలవడం, పదవుల కోసం బేరసారాలు చేయడం,ఇవి వామపక్ష ఉద్యమానికి తీవ్ర నైతిక దెబ్బ. సిద్ధాంతం అంటే కేవలం పుస్తకాలలో ఉండే మాట కాదు, అది కార్యాచరణలో కనిపించాలి. నేడు వామపక్షాల సిద్ధాంతం రాజకీయ లెక్కల ముందు తలవంచిందన్న భావన కార్యకర్తల హృదయాలను గాయపరుస్తోంది. ఇక పదవుల వ్యాపారం రాజకీయాలను మరింత విషపూరితంగా మార్చింది. గెలిచిన అభ్యర్థులను కొనుగోలు చేయడం, పార్టీలు మారడం, 'ఎక్కువ ఇస్తే అమ్ముడుపోతాం' అన్న ధోరణిఇవి ప్రజాస్వామ్యాన్ని అవినీతి వ్యాపారంగా మార్చుతున్నాయి. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలన, ఈ పదాలు కేవలం ఎన్నికల మేనిఫెస్టోలలో మిగిలిపోయాయి. అధికారమే లక్ష్యంగా మారిన రాజకీయాలు ప్రజల ఆశయాలను తుంగలో తొక్కుతున్నాయి. ప్రజల ముందు ఒకలా మాట్లాడి, అధికార సమీకరణాల్లో మరోలా వ్యవహరించే రాజకీయ ద్వంద్వత ప్రజల మనసుల్లో తీవ్ర ఆవేదనను కలిగిస్తోంది. ఎన్నికల ప్రచారంలో ఒకరినొకరు తిట్టుకున్న నేతలు, పదవుల విషయంలో ఒకే టేబుల్ వద్ద కూర్చుని నవ్వుతూ ఒప్పందాలు కుదుర్చుకోవడం, ఇది ప్రజల ఓట్లకు, ప్రజల భావోద్వేగాలకు చేసిన ద్రోహం. ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇది రాజకీయమా? లేక రాజకీయ నాటకమా?ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడం కాదు. అది ప్రజల ఆశయాలను ప్రతిబింబించే, ప్రజల జీవితాలను మార్చే వ్యవస్థ. సిద్ధాంతాల ఆధారంగా విధానాలు రూపొందించి, ప్రజల భవిష్యత్తును నిర్మించే బాధ్యత రాజకీయ పార్టీలపై ఉంది. కానీ నేడు ప్రజాస్వామ్యం ఒక రాజకీయ మార్కెట్‌గా మారుతోంది. సిద్ధాంతాలు బేరసారాల పావులుగా మారుతున్నాయి. ప్రజల ఓటు రాజకీయ లావాదేవీలకు స్పష్టంగా ముడిపడుతోంది. తెలంగాణ ప్రజలు నేడు రాజకీయాలపై నమ్మకం కోల్పోతున్నారు. ఒకచోట శత్రువులుగా, మరోచోట మిత్రులుగా కనిపించే నాయకులపై ప్రజల విశ్వాసం క్షీణిస్తోంది. తెలంగాణ ప్రజలు అడుగుతున్నారు,ఈ రాజకీయాలు ఎవరి కోసం? ప్రజల కోసం కాదు. నాయకుల పదవుల కోసం. ఇక తెలంగాణలో ప్రస్తుత రాజకీయ పరిస్థితి ఒక తీవ్ర సంక్షోభ దశలో ఉంది. సిద్ధాంతాలు, విలువలు, ప్రజల సంక్షేమం వంటి మూల సూత్రాలను పక్కనపెట్టి అధికార రాజకీయాలు, పొత్తుల రాజకీయాలు, పదవుల వ్యాపారం ప్రధానంగా మారాయి. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే రాజకీయ పార్టీలకు ఆత్మపరిశీలన అత్యవసరం. సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే రాజకీయ సంస్కృతి తిరిగి పునరుద్ధరించాలి. రాజకీయాలు పదవుల కోసం కాకుండా ప్రజల జీవితాలను మార్చే సాధనంగా మారాలి.

వామపక్షాలు తమ మూల సిద్ధాంతాలను మళ్లీ ప్రజల మధ్యకు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన వామపక్షాలు, నేడు రాజకీయ అంచులపైకి వెళ్లిపోయాయి. కార్మికులు, రైతులు, పేద ప్రజల సమస్యలను కేంద్రంగా చేసుకుని సిద్ధాంత రాజకీయాలను తిరిగి ప్రజల మధ్యకు తీసుకురావడం వామపక్షాల చారిత్రక బాధ్యత. అలాగే జాతీయ, ప్రాంతీయ పార్టీలు రాజకీయ ద్వంద్వతను విడిచిపెట్టి ప్రజలకు స్పష్టమైన విధాన దిశను చూపాలి. ఒకచోట ఒక మాట, మరోచోట మరో మాట చెప్పే ద్వంద్వ విధానాలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి.

అయితే ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల పాత్ర ఎంత ముఖ్యమో, ప్రజల పాత్ర కూడా అంతే కీలకం. ప్రజలు రాజకీయ వింతలను నిశ్శబ్దంగా చూడకుండా ప్రశ్నించాలి. సిద్ధాంతాలు, విధానాలు, పాలన నాణ్యత ఆధారంగా రాజకీయాలను తీర్పు చెప్పాలి. ఓటు హక్కును కేవలం పార్టీ పట్ల అనురాగంగా కాకుండా ప్రజాస్వామ్య బాధ్యతగా వినియోగించాలి. ఓటు అనేది ఒక వ్యక్తిగత అభిరుచి కాదు, అది ఒక సామాజిక బాధ్యత, చరిత్రను మలచే శక్తి. తెలంగాణ రాజకీయాల్లో జరుగుతున్న పొత్తుల రాజకీయ నాటకం ఒక హెచ్చరిక. సిద్ధాంత రాజకీయాలు నశిస్తే ప్రజాస్వామ్యం ఖాళీ అవుతుంది. అధికార రాజకీయాలు ప్రజల ఆశయాలను మింగేస్తాయి. రాజకీయాలు ప్రజల జీవితాలను మార్చే సాధనంగా ఉండాలి, నాయకుల వ్యక్తిగత లాభాల సాధనంగా కాదు. పొత్తులు సిద్ధాంతాల ఆధారంగా కాకుండా అధికార లెక్కల ఆధారంగా జరిగితే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. ప్రజలు కేవలం ఓటర్లు కాకుండా రాజకీయ ప్రయోగాలకు బలులుగా మారిపోతారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదు, ప్రజల గుండెల్లో నుంచి వచ్చిన ఆర్తనాదం. తెలంగాణ ప్రజలు చూస్తున్నారు. ప్రజలు ఆలోచిస్తున్నారు. ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్యం ఎవరి చేతుల్లో ఉంది? ప్రజల చేతుల్లోనా? లేక పదవుల వ్యాపారంలో మునిగిపోయిన రాజకీయ నేతల చేతుల్లోనా? ఈ ప్రశ్న నేడు ప్రతి చైతన్యవంతుడైన పౌరుడిని వెంటాడుతోంది. ఈ ప్రశ్నకు సమాధానం రాజకీయ పార్టీలే కాదు, ప్రజలే ఇవ్వాలి. ఎందుకంటే ప్రజాస్వామ్యం అంటే రాజకీయ నాయకుల ఆస్తి కాదుప్రజల ఆశ. ప్రజల శ్వాసను ఎవ్వరూ అమ్మకానికి పెట్టలేరు. ప్రజలు తమ హక్కులను వినియోగించుకుంటే, ప్రశ్నించే సంస్కృతి పెంచితే, రాజకీయ వ్యవస్థను కూడా సరిదిద్దగలరు. చరిత్ర తీర్పు చెప్పబోతోంది. తెలంగాణ ప్రజల తీర్పు మరింత ఘాటుగా జడ్పిటిసి, ఎంపిటిసి, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలలో ఉండబోతోంది అనేది నగ్నసత్యం. రాజకీయ పార్టీలకు ఇది ఒక హెచ్చరిక. ప్రజలకు ఇది ఒక అవకాశము. ప్రజాస్వామ్యం నిలబడాలంటే ప్రజల చైతన్యం, రాజకీయ నైతికత, సిద్ధాంత రాజకీయాలు తిరిగి పునరుజ్జీవించాలి. లేకపోతే ప్రజాస్వామ్యం పేరు మాత్రమే మిగిలి, లోపల ఖాళీ అవుతుంది. ప్రజలే ప్రజాస్వామ్యానికి జీవం. ప్రజలే ప్రజాస్వామ్యానికి శక్తి. ప్రజలే ప్రజాస్వామ్యానికి తుది తీర్పు ఇస్తారని ఆశిద్దాం.

# గీత కార్మికులకు పెండింగ్ ఎక్సిగ్రేషియా 3,02,50,000 లు విడుదల

**- కేజీకేపీఎస్ నిరాహార దీక్షకు స్పందించిన ప్రభుత్వం**

**- మిగిలిన 11 కోట్ల రూపాయలు కూడా వెంటనే విడుదల చేయాలని కల్లుగీత కార్మిక సంఘం డిమాండ్**



ANNEXURE - IV

KGKS

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 21:**





రాష్ట్రంలో కల్లుగీత వృత్తిలో ప్రమాదానికి గురైన వారికి ఎక్సిగ్రేషియా డబ్బులు 14 కోట్ల రూపాయలు ఇవ్వాలని మరియు మరో 13 డిమాండ్లతో ఫిబ్రవరి 17న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గం ఇందిరా పార్క్ వద్ద నిరాహార దీక్ష చేసింది. ఫలితంగా ఫిబ్రవరి 20, 3,0 2,50,000 లు బాధితులకు ఇచ్చారు. మిగిలిన 11 కోట్ల రూపాయలు కూడా వెంటనే విడుదల చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది. అభివందనములతో యం.వి.రమణ, రాష్ట్ర అధ్యక్షులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

## నూతన వధూవరులు ఉదయ్ కిరణ్, మిత్రవింద దంపతులను ఆశీర్వదించిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్



కుషాయిగూడ వెలుతురు ఫిబ్రవరి 21:
బీసీ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎల్కశెట్టి నిరంజన్,రమ దంపతుల కుమారుడు ఉదయ్ కిరణ్ మిత్రవిందల వివాహము హైదరాబాదులోని ఈసీఐఎల్ క్రాస్ రోడ్డు, కుషాయిగూడ శ్రీ లక్ష్మీ కన్వెన్షన్ లో జరిగిన వివాహ మహోత్సవానికి బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ మరియు విద్యార్థి జేఏసీ చైర్మన్ స్వామి గౌడ్ గోదా రవీందర్ లు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

## ఘనంగా మంచాల సిఐ మధుకు జన్మదిన శుభాకాంక్షలు

**- ప్రజా సంఘాల అధ్యక్షుడు కంబాలపల్లి భాస్కర్ మంచాల మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల రాఘవ**



**మంచాల వెలుతురు ఫిబ్రవరి 21:**
మంచాల మండలం మంచాల పోలీ స్ స్టేషన్ సిఐ మధు జన్మదినం సందర్భంగా పోలీస్ స్టేషన్ కు వెళ్ళిసీఐ మధును శాలువతో ఘనంగా సన్మానించి స్వీటు తినిపించి జన్మదిన వేడుకలు ఘ నంగా నిర్వహించిన ప్రజాసంఘాల అధ్యక్షుడు కంబాలపల్లి భాస్కర్ మంచాల మండలం యూ త్ కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల రాఘవ ఈసందర్భంగా ప్రజా సంఘాల అధ్యక్షుడు కంబాలపల్లి భాస్కర్ మాట్లాడుతూ సీఐ మధు మండలం మంచాల మండలంలోని యువతను మంచిగా ప్రో త్సహిస్తూ యువతను మంచి మార్గంలో నడవాలని చెప్పి పలుసూచనలు చేస్తూ చెడు వాసనా లకు దూరంగా ఉండి మంచి మార్గంలో నడవాలని ప్రతి గ్రామానికి వెళ్లి యువతకు మంచి సందే శం ఇస్తూ మంచాల మండలంలో మంచి సీఐగా పేరు తెచ్చుకున్న గొప్ప సీఐ మధు అనిఅన్నారు ఈకార్యక్రమంలో ఇబ్రహీంపట్నం జేఏసీ పల్నాటి యాదయ్య ఇబ్రహీంపట్నం జేఏసీ ఉపాధ్యక్షులు మంచాల మండల జేఏసీ తదితరులు ఉపాధ్యక్షులు దంచుక బిక్షపతి వార్డు సభ్యుడు లింగం ప ల్లి ఏ సురేష్ అశ్వాల బాలరాజ్ నాయకులు శివ లింగం తదితరులు పాల్గొన్నారు

## ఇబ్రహీంపట్నం చైర్మన్ ఎన్నిక విషయంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయ క్రీడను చూసి అసహ్యించు కుంటున్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజలు

**- ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మహమ్మద్ జానీ పాషా**



**ఇబ్రహీంపట్నం వెలుతురు ఫిబ్రవరి 21:**
ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మహమ్మద్ జానీ పాషా మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ పక్షాన కౌన్సిలర్లు మెజార్టీ స్థానాలు ఉన్న చైర్మన్ ఎన్నిక కాకుండా కాంగ్రెస్ పార్టీ రాజకీయ డ్రామా ఆడుతుంది అన్నారు ఇలాంటి పరి ణామాలతో కాంగ్రెస్ పార్టీ యువతకు ఎలాంటి సందేశం ఇస్తుందో ప్రజలు అర్థం చేసుకుంటున్నా రు అని అన్నారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పైన తీవ్ర వ్యతిరేకత మొదలైం ది అని అన్నారు.ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ప్రజలు ఓటుతో బిఆర్ఎస్ పార్టీకి ఇచ్చిన తీర్పు ను కాలరాస్తు చైర్మన్ ఎన్నిక కాకుండా కాంగ్రెస్ పార్టీ అడ్డు కోవడం సిగ్గుచేటు అన్నారు ప్రజా స్వా మ్యంలో ఓటు విలువ తెలిసిన ఏ రాజకీయ పార్టీ ఇలాంటి చేష్టలు చేయదు అన్నారు ఇబ్రహీం పట్నంనియోజకవర్గంలో వున్నా ఒకే ఒక్క మున్సిపాలిటీ లో ఎన్నికలు వాటి ఫలితాలు చుసిన తరువాత ప్రజ ల్లో కాంగ్రెస్ చేస్తున్న రాజకీయ క్రీడ లు చూసిఅసహ్యించుకుంటున్నారుమారు తున్నా కాలంతో పాటు సోషల్ మీడియద్వారా ప్రతి విషయం సులువుగా వేగంగా ప్రజలకు చేర డం ఇప్పుడు ప్రజల్లో అవహగానా పెరిగిందని అన్నారు ఇప్పటి అయినా ప్రజలు తీర్పుని గౌరవిం చి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నికకు సహకరించాలని అన్నారు

# 1.2 కేజీల గంజాయి పట్టివేత..

**బషీర్ బాగ్ వెలుతురు 21 ఫిబ్రవరి :**



నాంపల్లిలోని మెదర్ బస్తీ మల్లేపల్లి ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎస్టీఎఫ్ ఏ టీమ్ లీడర్ అంజిరెడ్డి సిబ్బంది కలిసి నిర్వహించిన దాడుల్లో 1.2 కేజీల గంజాయి పట్టుబడింది. ఈ గంజాయిని యుఎనఐ గ్యాస్ పాయింట్, పొట్టిశ్రీరాములు యూనివర్శిటీ సమీపంలో గంజాయి పట్టుకున్నారు. ఈ కేసులో కాంబ్లె శ్యామ్ సుందర్‌ను అరెస్టు చేశారు. మరో వ్యక్తి జాంగీర్‌పై కూడ కేసు నమోదు చేశారు. నిందితుడిని, గంజాయిని నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పటించారు.

# ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలేవి

**-సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ**

**- కుంటని మాయం చేస్తున్న పట్టించుకోని అధికారులు.**



**బషీర్ బాగ్ వెలుతురు 21 ఫిబ్రవరి :**
అబ్దుల్లాపూర్ మండల పరిధిలోని హత్తిగూడా రెవిన్యూ సర్వే నంబర్ 19 మరియు హయత్ నగర్ మండల పరిధిలోని సర్వే నంబర్ 98 లో కలిపి సుమారు 6 ఏకారాల విస్తీర్ణంలో గల కుంటని నుండి ఆయకట్టుకి వెళ్లే నాలని పూడ్చి పక్కనే ఉన్న 2.5 ఎకరాల బిల్ల దాఖల భూమి మరియు ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెంచర్ వేసి విల్లాలు నిర్మాణం చేస్తున్న కబ్జా కోరులపై రెవిన్యూ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవటం లేదని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మరియు హయత్ నగర్ మండలాల పరిధిలో కబ్జా కి గురైతున్న చిన్న కుంటని మరియు దాని నాలాని శనివారం నాడు భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ మరియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి గార్లు వారి పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా అందొజు రవీంద్ర చారీ మాట్లాడుతూ తక్కువ విస్తీర్ణంలో గల ప్రైవేట్ భూమిని సాకుగా చూపి హత్తిగూడా చిన్న కుంటని మరియు దాని నాలాని పూడ్చి నాలా స్థలంలో అక్కడి భూస్వామి అక్రమంగా విల్లాల నిర్మాణం చేపడుతున్నాడు.కొన్ని కోట్ల రూపాయల విలువ చేసి ఈ భూమిపై కన్నేసిన సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి (భూస్వామి) రెవిన్యూ అధికారులని మోసం చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తూ పబ్బం గడుపుతున్న వారిపై చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేశారు.ఇదే విషయంలో 2023 లో సంబంధిత అధికారులకి ఫిర్యాదు చేయటం కొంత కాలం పనులని నిలిపివేయగలిగాం.తిరిగి ఇప్పుడు పనులు ప్రారంభం కావటం వల్ల ఈ నెల 16 నాడు హైడ్రా కమిషనర్ రంగనాథ్ కి కూడా ఫిర్యాదు చేశామని.ఈ రోజు వరకు కూడా ఎలాంటి చర్యలు వారిపై తీసుకోక పొగ కనీసం నిర్మాణాలని కూడా అపకపోవటం అనుమానంగా ఉందన్నారు.ప్రభుత్వ భూముల్లో నీరుపేదలు గుడిసెలో వేసుకుంటే వెంటనే అడ్డుకునే రెవిన్యూ అధికారులు ఇక్కడ నాలా అంత కబ్జాకి గురైన కూడా ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం అవుతుందని అన్నారు. హత్తిగూడా చిన్న కుంట చాలా పురాతమైనదని ఎల్ బి నగర్ సర్కిల్ పరిధిలోని అనేక కాలానిల వర్షపు నీరు ఈ కుంటలోకె చేరుతుంది.ఈ కుంట నుండి అలుగు పోయటం ద్వారా ఆయాకట్టుకు చేరటానికి ఉన్న నాలానే ఇప్పుడు పూర్తిగా కనుమరుగు అయింది దాని స్థానంలో వెంచర్ చేసి నిర్మాణాలు కడుతున్నారు.కాబట్టి రెవిన్యూ మరియు,నీటిపారుదల శాఖ అధికారులు,తక్షణమే స్పదించి సర్వే చేయించి కబ్జాకి గురైన కోట్ల రూపాయల విలువ చేసే 5 ఎకరాల ప్రభుత్వ భూమిని మరియు ఆయకట్టు నాలాని రక్షించి కుంటకి పూర్వ వైభవం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, రంగరెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్ మెట్ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్,బిఓసి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్,సిపిఐ నాయకులు వద్యా రమేష్ నాయక్,పేరాల గోపి, నిరంజన్, ఉప్పలయ్య, అశోక్, పాండు, ప్రియా, అన్నపూర్ణ, రాజు, విరమల్లు, మాల్సూర్, రమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉద్యోగుల హితాసక్తుడు, ఉద్యోగుల హృదయ నేత తెలంగాణ నాన్ గెజెటెడ్ అధికారుల సంగం జిల్లా అధ్యక్షుడు బి రవి ప్రకాష్ జన్మదిన వేడుకలు





**మేడ్చల్ వెలుతురు ఫిబ్రవరి 21:**
శనివారం రోజున 21/02/2026న, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మరియు టీఎన్జీవోస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు గౌరవనీయులు బి. రవి ప్రకాష్ గారి 55వ జన్మదిన వేడుకలు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉద్యోగుల మధ్య ఆనందోత్సాహ వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉద్యోగుల హక్కుల సాధనలో ఎల్లప్పుడూ ముందుండే ఆయన నాయకత్వాన్ని స్మరించుకుంటూ సహచరులు తమ అభిమానాన్ని, గౌరవాన్ని వ్యక్తపరిచారు. కేంద్ర సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఈశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు శామ్యూల్ పాల్, జిల్లా కార్యదర్శి & కోశాధికారి బి. భరత్ కుమార్ శేష సాయి గిరికాంత్, యూనియన్ అడ్వైజర్ సంజయ్ సింగ్ పాల్గొన్నారు. అలాగే మల్కాజ్గిరి యూనిట్ కార్యదర్శి శ్రీమతి అరుణ, కుత్బుల్లాపూర్ యూనిట్ ప్రతినిధి నజీమా, కలెక్టరేట్ యూనిట్ కార్యదర్శి లింగాల అక్షయ్ కుమార్, కార్తీక్, ఉమ, కిషోర్ మరియు వివిధ యూనిట్ల అధ్యక్షులు, కార్యదర్శులు హాజరై కార్యక్రమాన్ని మరింత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బి. రవి ప్రకాష్ ని శాలువాలు మరియు గజమాలతో ఘనంగా సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనకు ఆయురారోగ్యాలతో కూడిన దీర్ఘాయుష్షు, మరింత సేవా స్ఫూర్తి, నాయకత్వ విజయాలు చేకూరాలని అందరూ ఆకాంక్షించారు.

## తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మహిళా విభాగం 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించిన మంత్రి శ్రీమతి కొండా సురేఖ



**బషీర్ బాగ్ వెలుతురు 21 ఫిబ్రవరి :**
తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (TGO) మహిళా విభాగం రూపొందించిన 'డైరీ/క్యాలెండర్ – 2026' ను ఈరోజు గౌరవ అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీఓ నేతలు ఉద్యోగులకు సంబంధించిన పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించిన మంత్రి సంబంధిత అంశాలపై త్వరలోనే చర్చిస్తామని హామీ ఇచ్చారు. మహిళా దినోత్సవ ఆహ్వానం: వచ్చే నెల మార్చి 6, 2026న నిర్వహించనున్న 'అంతర్జాతీయ మహిళా దినోత్సవ' ప్రారంభ వేడుకలకు ముఖ్య అతిథిగా రావాలని మంత్రి కొండా సురేఖ ను టీజీఓ మహిళా విభాగం కోరింది సానుకూలంగా స్పందించిన మంత్రి, తప్పకుండా వేడుకలకు హాజరవుతానని స్పష్టం చేశారు.ఉద్యోగుల సమస్యలు: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం సానుకూల ధోరణితో ఉందని ఆమె ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో టీజీఓ కేంద్ర సంఘం అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బి. శ్యామ్, మహిళా విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ దీపా రెడ్డి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి శ్రీమతి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధనిక సిల్వర్ జ్యువెలరీ షోరూమ్ ఘనంగా ప్రారంభోత్సవం



**దిల్సుఖ్నగర్ వెలుతురు ఫిబ్రవరి 21:**
దిల్సుఖ్నగర్ మెట్రో స్టేషన్ పరిధిలో ధనికా సిల్వర్ జువెలరీ షోరూమ్ ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి మలక్ పేట్ ఎమ్మెల్యే మహమ్మద్ బిన్ అబ్దుల్లా బల్లాల ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా ఘనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధనిక జువెలరీ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ చక్కటి అవకాశాన్ని ప్రజలు



సద్వినియోగం చేసుకోవాలని నాణ్యత గల సిల్వర్ ఆభరణాలు చాలా చక్కటి అలంకరణకు ఉపయోగపడతాయని సిల్వర్ సామాన్యునికి అందుబాటులో ఉన్నాయని కస్టమర్లకు తగ్గింపు ధరలో అందిస్తున్న సంస్థ ధనిక సిల్వర్ జ్యువలరీ అని ఈ సందర్భంగా అన్నారు ధనిక యాజమాన్యం వారు కోట్రమధు కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ దిల్సుఖ్నగర్ షో రూమ్ ఏర్పాటు చేసినందుకు ఎంతో సంతోషంగా ఉందని ప్రతి ఒక్కరూ కస్టమర్లు వచ్చి నాణ్యమైన జూలర్స్ కొని ఆనందపడాలని ఈ సందర్భంగా అన్నారు ఇక్కడ నాణ్యమైన వెండి ఆభరణాలు అందుబాటులో ఉంటాయని ఈ సందర్భంగా అన్నారు ఈ కార్యక్రమంలో బుగ్గారపు వరుణ్ రాజ్యలక్ష్మి కవితా రెడ్డి గుండా శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## నాగర్ కర్నూల్ జిల్లాలో మల్లన్న జాతరకు వెళ్లిన రజకులపై దాడి చేసిన అగ్రకులాల వారిని కఠినంగా శిక్షించాలి

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 21:**
నాగర్ కర్నూలు జిల్లాలో మల్లన్న దర్శనం కోసం వెళ్లిన చాకలి చంద్రకళ కుటుంబాన్ని అడ్డుకొని దాడి చేసి, రెండు నెలల పసిపాప మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్లన్న దేవుని దర్శనానికి వెళుతుండగా కొంతమంది అగ్రకులాల వారు అడ్డుకొని చాకలి చంద్రకళ మరియు ఆమె కొడుకు గణేష్ కోడల్ని కూతురుని బూతులు తిడుతూ దారుణంగా కొట్టడమే కాకుండా రెండు నెలల పసిపాప ఉందని కూడా కనికరం లేకుండా వారి మీద దాడి చేయడంతో తీవ్ర అస్వస్థతతో రెండు నెలల పసిపాప మృతి చెందడం చాలా బాధాకరమని ఇది అమానుష సంఘటన అని లింగం గౌడ్ విచారం వ్యక్తం చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేశారు

## హిమాయత్ నగర్ డివిజన్ స్ట్రీట్ నెంబర్ 6, 7, 8 లో మొక్కలను తొలగించిన అధికారులు

**- అధికారులతో మాట్లాడి సమస్య ను పరిష్కరించిన హిమాయత్ నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 21:**
గత కొన్ని రోజులుగా విద్యుత్ అధికారులు చెట్ల కొమ్ములను తొలగించి ఎక్కడికి అక్కడ వదిలేసి వెళ్లిపోవడం జరిగింది. దీనికి సంబంధించి హిమాయత్ నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ అధికారులతో నిరంతరం మాట్లాడి శనివారం రోజున స్ట్రీట్ నెంబర్ 6 7 మరియు 8 లో మొక్కలను తొలగించడం జరిగింది. రానున్న రెండు మూడు రోజులలో మిగతా చోట్ల కూడా ఉన్న మొక్కలను తొలగించడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

## బీసీలకు రాజ్యాధికారం కావాలి దాసు సురేష్



**బషీర్ బాగ్ వెలుతురు 21 ఫిబ్రవరి :**
బీసీ రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయం నందు రాబోయే బడ్జెట్, గ్రేటర్ ఎన్నికలు మరియు బీసీల అవకాశాలపై నిర్వహిస్తున్న అఖిలపక్ష సమావేశానికి మద్దతుగా మీ వంతు సహకారాన్ని మద్దతును అందించాలి దాసు సురేష్ కోరారు.

# విజ్ఞాన్ స్కూల్స్‌లో ఐఏఎస్, ఐపీఎస్ ఫౌండేషన్‌కు శ్రీకారం

**- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మీదుగా ప్రారంభం**

**- విద్యార్థులకు ఉన్నత లక్ష్యాల దిశగా మార్గదర్శనం**




**భువనగిరి, ఫిబ్రవరి 21 (వెలుతురు న్యూస్ ):**
యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ పగిడాల జలందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఐఏఎస్, ఐపీఎస్ ఫౌండేషన్ ప్రోగ్రాంను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఇలాంటి ఫౌండేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డా. పగిడాల జలంధర్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థల చైర్మన్ మహమ్మద్ అవేజ్ చిస్తి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, మండల విద్యాధికారి నాగవర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేష్, స్వర్ణగిరి ఆలయ చైర్మన్ రామారావు, లింగ నరసింహారావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రామ్ రెడ్డి, కరస్పాండెంట్ పగిడాల పురేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ అపర్ణ, స్వాతి, పక్కిరు కొండల్ రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కంటి చూపుకు కవచం కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**11 విడతల్లో 8424 మందికి కంటిపరీక్షలు,1747 మందికి కంటి ఆపరేషన్లు పూర్తి,3427 మందికి కంటిఅద్దాలు ఉచితంగా పంపిణీ**

**మునుగోడు నియోజకవర్గంలో నిరంతరాయంగా కొనసాగుతున్న ఉచిత కంటి వైద్యశిబిరాలు**

**నేడు(22-02-2026, ఆదివారం) 12వ, విడత ఉచిత కంటి వైద్య శిబిరం**









**మునుగోడు వెలుతురు ఫిబ్రవరి 21:**
మునుగోడు నియోజకవర్గ ప్రజల కంటిచూపుకు కవచంగా మారారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తన నియోజకవర్గం మునుగోడులో నిరంతరాయంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వేలాది మంది కంటి చూపుకు ఆశాకిరణంగా మారారు.కంటి చూపు తో ఇబ్బంది పడుతున్న వృద్దులు, మహిళలు, వయోజనులకు కంటి ఆపరేషన్లు చేయిస్తూ...కంటి ఆపరేషన్ అవసరం లేని వారికి కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు... పేదోళ్ల కండ్లలో వెలుగులు చూడాలనే తలంపుతో తానే పెద్దకొడుకుగా మారి తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా మొదలైన ఉచిత కంటి వైద్య శిబిరాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి..ఇప్పటికే ఏడు మండలకేంద్రాలలో రెండు మున్సిపాలిటీలలో వైద్య శిబిరాలు పూర్తయ్యాయి..మునుగోడు మండల ప్రజలకు మరోమారు ఉచిత వైద్య శిబిరం నిర్వహణ పూర్తయింది..నేడు(22-02-2026, ఆదివారం) రోజున చందూరు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలతో పాటు చందూరు మున్సిపాలిటీలో ఉన్న పది వార్డుల ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు... ఇప్పటివరకు 11 విడతలుగా ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి 8424 మందికి కంటి పరీక్షలు చేయించి, 1747 మంది కి కంటి ఆపరేషన్లు పూర్తిచేసి, 3427 మందికి కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు.. మునుగోడు మండల ప్రజలకు మునుగోడు లో నిర్వహించి న మొదటి విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 216 మందికి, రెండవ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 108 మందికి, చందూరు మున్సిపాలిటీ ప్రజలకు మునుగోడు లో నిర్వహించిన మూడవ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 129 మందికి, నాంపల్లి మండల ప్రజలకు నాంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన నాలుగవ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 229 మందికి, మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన ఐదవ విడత కంటి వైద్య శిబిరంలో 171 మందికి, చందూరు మండల ప్రజలకు బంగారిగడ్డ గ్రామంలో నిర్వహించిన ఆరవ విడత వైద్య శిబిరంలో 198 మందికి, ఘట్టుప్పల్ మండల కేంద్రంలో నిర్వహించిన ఏడవ విడత వైద్య శిబిరంలో 65 మందికి, నారాయణ్ పూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఎనిమిదవ విడత వైద్య శిబిరంలో 132 మందికి, చౌటుప్పల్ మున్సిపాలిటీలో నిర్వహించిన తొమ్మిదవ విడత వైద్యశిబిరంలో 82 మందికి , చౌటుప్పల్ మండల ప్రజలకు లక్కారంలో నిర్వహించినన పదవ విడత వైద్య శిబిరంలో 160 మందికి కంటి ఆపరేషన్లు పూర్తి చేశారు...తిరిగి రెండవ సారి మునుగోడు మండల కేంద్రంలో నిర్వహించిన పదకొండవ విడత వైద్య శిబిరంలో 257 మందికి కంటి ఆపరేషన్లు పూర్తిచేశారు..మళ్లీ ఈరోజు ఆదివారం చండూరు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు , చండూరు మున్సిపాలిటీలోని పది వార్డుల ప్రజలకు మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో 12 వ, విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు... రాబోయే మూడు సంవత్సరాలలో నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కూడా కంటి సమస్యతో బాధపడకుండా ఉండాలని ప్రణాళిక రూపొందించారు.. ఆ ప్రణాళికలో భాగంగానే 10 వేల మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించేలా టార్గెట్ పెట్టుకున్నారు.. దాంట్లో భాగంగానే నేడు(22-02-2026) ఆదివారం చందూరు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలతో పాటు మున్సిపాలిటీలోని పది వార్డుల ప్రజలకు మునుగోడులోని క్యాంపు కార్యాలయం వద్ద 12 వ, విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు..తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు....చందూరు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, మున్సిపాలిటీలోని పది వార్డుల ప్రజలు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఇప్పటికే గ్రామాలలో, మున్సిపాలిటీలో టామ్ టామ్ వేయించి ప్రచారం నిర్వాహించారు స్థానిక నాయకులు...

# నార్కెట్‌పల్లి పట్టణం 13వ వార్డు రాఘవేంద్ర కాలనీలో వివాదాస్పదంగా మారిన చర్చిని తొలగించాలి



**నార్కట్ పల్లి వెలుతురు ఫిబ్రవరి 21:**
నార్కట్ పల్లి 13వ. వార్డు రాఘవేంద్ర కాలనీ లో నిర్వహిస్తున్న చర్చిని తొలగించాలని కాలనీ వాసులతో కలిసి భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్ డిప్యూటీ తహసీల్దారు మరియు పంచాయతి కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవేంద్ర కాలనీలో పాస్టర్ జయరాజు ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకుని, అనంతరం బయటి ప్రాంతాల నుంచి ప్రజలను తీసుకువచ్చి ప్రార్థనలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కాలనీలో క్రైస్తవులు ఎవరూ లేనప్పటికీ మైకులు ఏర్పాటు చేసి పగలు, రాత్రి తేడా లేకుండా ప్రార్థనలు నిర్వహించడం వల్ల కాలనీ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై కాలనీ వాసులు పలుమార్లు పాస్టర్‌ను సంప్రదించి చర్చిని అక్కడి నుంచి తొలగించాలని కోరగా, గ్రామ శివారులో కొనుగోలు చేసిన స్థలానికి చర్చిని తరలిస్తానని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. అయితే గత సోమవారం పాస్టర్ అనారోగ్యంతో మరణించడంతో సమస్య పరిష్కారం కాలేదన్నారు. కాలనీలో క్రైస్తవులు లేని పరిస్థితిలో ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని చర్చిని తొలగించాలని అధికారులను కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నోముల రాజు, వార్డు సభ్యులు వద్దెగోని రామలింగం, పాలకూరి రమేష్, సీనియర్ సిటిజన్ పాల్వాయి భాస్కర్ రావు, మాజీ వార్డు సభ్యుడు మట్టిపల్లి రాజు తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

# పాలడుగు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నూతన చైర్మెన్ ఎన్నిక



**మోత్కూర్, ఫిబ్రవరి 21,( వెలుతురు న్యూస్):**
పాలడుగు గ్రామంలో మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ సమావేశం ఏర్పాటు చేయనైనది. ఈ సందర్భంగా (AAPC) అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నూతన ఛైర్మెన్ గా మిడిదొడ్డి శైలజ గారిని ఎన్నుకొని, బాధ్యతలను అప్పజెప్పుతూ ఘనంగా స్వాగత సన్మానం చేశారు .నూతన ఛైర్మెన్ మాట్లాడుతూ,వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యార్థుల సంఖ్యను 100 కు పైగా పెంచడానికి ప్రయత్నిస్తూ,పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చుటకు కృషి చేస్తానని తెలిపారు .ఈ సమావేశంలో విద్యా బోధనలో వినియోగిస్తున్న వివిధ రకాల టి. ఎం.ఎల్. లను విద్యార్థులచేత ప్రదర్శింపజేసి,విద్యార్థుల ప్రగతిని పరిశీలించడం జరిగినది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ అంతటి భగవంతు గారు,ఉపసర్పంచ్ దడిపెల్లి సైదులు గారు,నాగరాజ మాజీ చైర్మన్ పబ్బు అరుణ గారు, ప్రధానోపాధ్యాయులు కమలాకర్ రెడ్డి గారు, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు

# నిరుపేద మృతురాలి కుటుంబానికి మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ చేయూత

**- రూ.18000/- రూపాయల చెక్కు,క్వింటా బియ్యం అందజేత**

**మోత్కూర్, ఫిబ్రవరి 21 ( వెలుతురు న్యూస్) :**
మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో ని అన్నెపువాడ లో నిరుపేద కుటుంబానికి చెందిన



కొంతం సుజాత అనారోగ్యంతో మృతి చెందగా, మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు.ఈ సందర్భంగా మృతురాలి కుమారుడు అంజి కి మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న ల చేతుల మీదుగా రూ.18 వేల చెక్కు , క్వింటా బియ్యం అందించారు.ఏడాది క్రితం సుజాత భర్త యాదయ్య సైతం అనారోగ్యం తో చనిపోగా వాట్సాప్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు.వీరికి ఇద్దరు బిడ్డలు , ఒక కుమారుడు ఉన్నారు. కొడుకు కొనతం అంజి (20) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.ఆర్థిక ఇబ్బందులతో మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ ని ఆశ్రయించగా,తక్షణమే స్పందించిన సభ్యులు ఆర్థిక సహాయం అందించి ఆ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో వాట్సప్ గ్రూప్ ప్రతినిధులు ధబ్బేటి సోంబాబు, కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్న ,మెంట రమణ నగేష్, గనగాని శైలజ నర్సయ్య, మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి,ప్రతినిధులు మొరిగాల శ్రీను,ఎం డి షాకీర్,బొల్లెపల్లి శ్రావణ్,ప్రకాష్ రెడ్డి, చాపల అంజయ్య,బోయిని వెంకట్,రాజయ్య,రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల డీలర్ల మీద ఉన్న ప్రేమ రైతుల మీద లేదాయె..





**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 21:**
మండలం, కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన రేపాక గణేష్, నర్సింహా అనే రైతులు రామన్నపేట లో కోరమాండల్ కంపెనీ యూరియా 6 బస్తాలు కొనుగోలు చేసి, యూరియా చల్లడానికి బస్తా విప్పి చూడగా మట్టి పెడ్డలు లాంటివి వచ్చాయని, అది కల్తీ యూరియానేమో అని పత్రికల్లో వార్తలు చక్కర్లు కొట్టాయి. మండల వ్యవసాయ అధికారి ఈ విషయమై విచారణ చేపట్టినట్టు, రైతు రేపాక గణేష్ దగ్గర నుండి సంజాయిషీ పత్రం తీసుకున్నట్టు కూడా ఒక లేఖ మండల వ్యవసాయ అధికారికి రైతు ఇచ్చినట్టు ప్రచారంలో ఉంది. ఇంత తొందరగా డీలర్ల తరపున ఉండి రైతు నుండి సంజాయిషీ ఇప్పించుకున్న అధికారులు, గతంలో రైతులు తమ వడ్లు కాంటా వేసి,సర్టిఫైడ్ చేసిన తర్వాత దుమ్ము, తాలు వడ్లలో వచ్చాయని, మిల్లర్లు అభ్యంతర పెట్టినప్పుడు, ధాన్యం లోడులను దించుకోవడానికి నిరాకరించినపుడు సంబంధిత అధికారులు ఒక్కరైనా రైతుల తరపున మాట్లాడారా? ఆ విషయం గురించి విచారణ చేపట్టారా? అధికారులకు ఎరువుల డీలర్ల మీద ఉన్న ప్రేమ రైతుల మీద లేకపాయెనే అని రైతులు వాపోతున్నారు.మరి దీనికి సంభందిత అధికారులు ఏమని సమాధానమిస్తారో చూడాలి.

# మోత్కూర్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు శ్రీవిద్య,శైలజ విజయం పట్ల మేడారంలో మొక్కు చెల్లింపులు



**. మోత్కూరు, ఫిబ్రవరి 21, ( వెలుతురు న్యూస్):**
మోత్కూరు మున్సిపల్ పరిధిలోని 7,8 వార్డులలో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులు గనగాని శైలజ, పన్నాల శ్రీవిద్య విజయం సాధించడం పట్ల ఎన్.ఎస్. యు. ఐ. యూత్ కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో మేడారంలో మొక్కు చెల్లించినట్లు ఎన్.ఎస్. యు.ఐ. మండల అధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు బుర్ర సాయి, రేగోటి నవీన్, బుర్ర కిషోర్, నిర్మల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు

**- 9మాతృభాషలోనే సృజనాత్మకతకు బలం...**

**- 9ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ముహమ్మద్ అస్లాం ఫరూఖీ...**




**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 21:**
ఐక్యరాజ్యసమితి ప్రకటించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ భాషా విభాగాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ముహమ్మద్ అస్లాం ఫరూఖీ మాట్లాడుతూ, భాష మన ఆలోచనలను వ్యక్తపరచే ప్రధాన సాధనమని పేర్కొన్నారు. పిల్లల ప్రారంభ విద్య మాతృభాషలోనే ఉండాలని, కొత్త జాతీయ విద్యా విధానం కూడా దీనికి ప్రాధాన్యతనిచ్చిందన్నారు. విద్యార్థులు అనువాద వనరులను వినియోగించి ప్రపంచ జ్ఞానాన్ని తమ మాతృభాషలో గ్రహించవచ్చని సూచించారు. కవిత్వం, గద్య రచనల ద్వారా తమ ఆలోచనలను వ్యక్తపరచడం ద్వారా సృజనాత్మకత



పెరుగుతుందని చెప్పారు. డైరీ రాయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 21న మాతృభాష పరిరక్షణ కోసం త్యాగం చేసిన బంగ్లాదేశ్ విద్యార్థుల స్మారకార్థం ఐక్యరాజ్యసమితి ఈ రోజును అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. భారతదేశం బహుభాషా దేశమని, అన్ని భాషలను గౌరవించి భాషా పక్షపాతం నివారించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయేషా బేగం, ఎలాహి బేగం, మహీన్, గాయత్రి కలీం తదితర విద్యార్థులు ఉర్దూ, హిందీ, తెలుగు, ఆంగ్ల భాషల ప్రాముఖ్యతను వివరించారు. ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ నరహరి మూర్తి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ లాచియా, ఉర్దూ విభాగాధిపతి డాక్టర్ ఇష్రత్, హిందీ విభాగాధిపతి డాక్టర్ మదన్ రాథోడ్, లెక్చరర్ డి. ప్రీతి ప్రసంగించారు. అనంతరం డాక్టర్ ఇష్రత్ విద్యార్థులకు పుస్తకాలను బహుకరించారు. విద్యార్థిని ఆయేషా బేగం తన నవలను త్వరలో పూర్తి చేయనున్నట్లు ప్రకటించగా సభలో అభినందనలు వ్యక్తమయ్యాయి.

# రామన్నపేటలో ప్రైవేటు ఏజెన్సీ షాపులలో కల్తీ యూరియాని కట్టడి చేయాలి.

**- సిపిఐ జిల్లా నాయకులు ఎర్ర రమేష్ గౌడ్...**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 21:**



ప్రభుత్వం యాప్ ద్వారా యూరియాని బుక్ చేసుకోవాలనే నిబంధన పెట్టడం ద్వారా , రైతులకు యూరియా లేటుగా అందడం మూలంగా యాప్ లో బుక్ చేసి ప్రైవేట్ ఏజెన్సీలలో తీసుకోవడం వల్ల ప్రైవేట్ ఏజెన్సీ వారు ఏ యూరియా అమ్ముతున్నారో తెలుసుకోలేని పరిస్థితిలో ఉన్నారు, అటు పంటకు యూరియా వేసే టైం అయిపోతుందని ఎక్కడ దొరికితె అక్కడ తీసుకొని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు... వ్యవసాయ అధికారులు రైతులకు సకాలంలో యూరియాని యాప్ ద్వారా కాకుండా అగ్రికల్చర్ సహకార సంఘం ద్వారానే నేరుగా ఇవ్వాలని ఎర్ర రమేష్ డిమాండ్ చేశారు. యూరియా సప్లై చేసే ప్రైవేట్ ఏజెన్సీలని ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని వ్యవసాయ అధికారులను కోరారు.

## ఇండియా AI ఎక్సపో లో కాంగ్రెస్ గుండాలు

### - కొండాపూర్ బీజేవైఎం అధ్యక్షులు అరెస్ట్



**కొండాపూర్ వెలుతురు ఫిబ్రవరి 21:**
కొండాపూర్ బీజేవైఎం అధ్యక్షులు గుమ్మడి సాయి సుకుమార్ పటేల్ గారు మాట్లాడుతు ఇండియన్ యూత్ కాంగ్రెస్ చేసిన షర్ట్‌లెస్ నిరసనలు ప్రజాస్వామ్య సంస్కృతికి తగినవి కావు. రాహుల్ గాంధీ బాధ్యత తీసుకుని క్షమాపణ చెప్పాలి. భారతీయ జనతా పార్టీ మరియు భారతీయ జనతా యువమోర్చ క్రమశిక్షణతో కూడిన రాజకీయాలకు కట్టుబడి ఉన్నాయి లిఇండియా ా× ఎక్సపోలి లో శనివారం రోజున కాంగ్రెస్ గుండాలు భారతమండపంపై దాడి చేసి భారతప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారిని అవమానపరచాడని నిరసిస్తూ భారతీయ జనతా యువ మోర్చా తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీ భవన్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది . కావున ఈ కారియక్రమం లో భాగంగా కాంగ్రెస్ పార్టీ బయపడ్డు ముందుగా ఆడుకొని బీజేవైఎం కొండాపూర్ అధ్యక్షులు గుమ్మడి సాయి సుకుమార్ పటేల్, బీజేపీ కొండాపూర్ కార్యదర్శి శంకర్ మరియు బీజేవైఎం నాయకులు ఉమేష్ ముదిరాజ్, గోర్జ్, షణ్ముఖ్ యాదవ్, సంతోష్, ఆకాష్ నాయకులను ముందుస్తుగా అరెస్ట్ చేసి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది.

## ఆహ్వాన పత్రిక అందజేత

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 21:**



మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎడ్ల నరేందర్ రెడ్డి సోదరి అనూష వివాహం ఈనెల 25 తేదీన హయత్ నగర్ లోని వి.ఆర్.సి కన్వెన్షన్ హాల్లో వివాహం జరుగనుండగా ఆహ్వాన పత్రికను ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్ రెడ్డికి మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డితో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

## సుంకరి మాధవరెడ్డి కి నివాళులర్పించిన సర్పంచ్ జెర్రిపోతుల భరత్ కుమార్



**నార్కట్ పల్లి వెలుతురు ఫిబ్రవరి 21:**
నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ సుంకరి మాధవ రెడ్డి అనారోగ్య కారణాలతో శనివారం రోజు మృతిచెందారు. ఈ సందర్భంగా నార్కట్‌పల్లి సర్పంచ్ జెర్రిపోతుల భరత్ కుమార్ గౌడ్, ఉపసర్పంచ్ సామ శిరీషప్రవీణ్ రెడ్డి , 5వ వార్డు సభ్యురాలు మంద ఉమగిరి వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. వారు మాట్లాడుతూ మాధవ రెడ్డి ఆర్టీసీ సేవల్లో నిబద్ధతతో పనిచేసి అందరి అభిమానాన్ని పొందారని తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## జహీరాబాద్‌లో గృహిణి అదృశ్యం

### - టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు...



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 21:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని కాంత రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న మొహమ్మద్ ముస్తఫా (26), తండ్రి లేట్ బీమ జమీర్, వృత్తి: పెట్రోల్ బంక్ వర్కర్, తన భార్య ఆసియా (19), తండ్రి ఖాసీం సాబ్, గృహిణి అదృశ్యమైనట్లు జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, ఫిబ్రవరి 20, 2026 రాత్రి 10:00 గంటలకు ముస్తఫా మరియు ఆసియా సాధారణంగా నిద్రపోయారు. అనంతరం రాత్రి 12:00 గంటల సమయంలో ముస్తఫా లేచి చూడగా ఆసియా ఇంట్లో కనిపించలేదని తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు మరియు పరిచయస్తుల వద్ద విచారించినప్పటికీ ఎక్కడా ఆమె ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై సబ్ ఇన్‌స్పెక్టర్ కె. వినయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అదృశ్యమైన యువతి గురించి సమాచారం తెలిసిన వారు జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

## దిగ్వాల్ వద్ద జాతీయ రహదారిపై బోలెరో బోల్తా డ్రైవర్ సురక్షితం



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 21:**
సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పరిధిలోని దిగ్వాల్ వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం బోలెరో వాహనం ప్రమాదానికి గురైంది. హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వైపు కట్టెల కట్ సైజ్ లోడుతో వెళ్తుండగా, అకస్మాత్తుగా టైరు పగిలి వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో వాహనం నడుపుతున్న డ్రైవర్ స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. ఘటనతో కొంతసేపు రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు.

## వావ్.. సింహా తేజ పిట్ట కొంచెం ఘనత ఘనం

# ఎల్లలు దాటిన యువ తేజం..

ప్రత్యేక ఇంటర్వ్యూ వెలుతురు
ప్రతినిధి తెలంగాణ శ్రీనివాస్

- ప్రపంచ వేదికపై ప్రతిభ చాటిన సింహా తేజ
- థాయిలాండ్‌లోని బ్యాంకాక్ యునైటెడ్ నేషన్స్‌లో గ్లోబల్ కాన్ఫరెన్స్ ప్రాతినిధ్యం వహించి రికార్డు సృష్టించిన తె(లంగాణ)లుగు విద్యార్థి కీసర పల్లవి
- ఇంటర్ నేషనల్ స్కూల్ నుండి బ్యాంకాక్ యూనిటైడ్ నేషన్స్‌కు పయనం
- ప్రపంచ కాన్ఫరెన్స్‌లో నాగారం వాసీ నయా రికార్డు
- సంతోషంలో సింహా తేజ తల్లిదండ్రులు ప్రహ్లాద్, కీర్తన దంపతులు










**హైదరాబాద్ వెలుతురు ప్రతినిధి, ఫిబ్రవరి 21:**
పిట్ట కొంచేం కుత ఘనం అంటే ఇదేనేమో.. మేధస్సు, జ్ఞానం, ప్రతిభ ఉంటే వారిని ఎవరు? అపలేరు సరికదా?... ఆ ప్రతిభాశీలురికి ఎక్కడ, ఎప్పుడైన సరే, యావత్ ప్రపంచం నలు ములల గర్వపడేలా, తన సత్తా(కు)ను నిరుపించుకోనే ఓ రోజు వస్తొంది. అప్పుడు వారి సహసం, ప్రతిభకు మెచ్చి, ప్రతి ఒక్కరు సలాం కొట్టాల్సిందే. తాజాగా.. పాఠశాల విద్యనభ్యసించే ఓ తెలంగాణ విధ్యార్ధి ప్రతిభ ఎల్లలు దాటింది. మేడ్చల్ జిల్లా, కీసర మండలం సత్యనారాయణ కాలనికి చేందిన జిడికంటి ప్రహ్లాద్, కీర్తన దంపతుల కుమారుడు సింహాతేజ.. బ్యాంకాక్‌లో జరిగిన యుఎన్ సమావేశంలో అరుదైన ఘనత సాదించారు. ప్రపంచంలోని వివిధ దేశాలకు చేందిన రాయబారులు, మంత్రులు, విద్యావేత్తలు, పరిశోధకులు, విశ్వవిద్యాలయ మేధావులు, యువ ప్రతినిధులు, విధాన రూపకర్తలు పాల్గోన్న ఈ ప్రతిష్టాత్మక గ్లోబల్ సమావేశంలో భారతదేశం నుంచి ప్రపంచ వేధికపై ప్రాతినిధ్యం వహించే అవకాశం ఈ యువ సృష్టికర్త.. మాస్టర్ సింహా తేజకు దక్కడం ఓ విశేషం. ఇటివల థాయిలాండ్‌లోని బ్యాంకాక్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన గ్లోబల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎడ్యుకేషన్ ఫర్ ఏ సస్టైనబుల్ ఫ్యూచర్‌లో మన(ఈ) తెలంగాణ విద్యార్థి అక్కడి (వేధిక) సంఘానికి ప్రాతినిధ్యం వహించి రికార్డు సృష్టించారు. అయితే, ఈ బాల మేధావి కీసర మండలం, పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. అత్యంత పిన్న వయస్సులో ఈ బుడతడు విశ్వ వేధికను పంచుకోవడం, భారత్‌కు గర్వకారణమైన రోజుగా పలువురు మేధావులు కోనియాడారు. ప్రపంచ డెలిగెట్స్‌తో పాటు అత్యంత జ్ఞానవంతమైన




యువతతో కలిసి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా విద్య యొక్క భవిష్యత్తుపై సింహతేజ ప్రసంగించిన ఈ భారీ వేధిక.. ఆవిష్కరణ, సమానత్వం, భవిష్యత్తు(కు)పై సిద్ధంగా ఉన్న అభ్యాస వ్యవస్థలపై అర్ధవంతమైన చర్చలను ప్రోత్సహిస్తుందని కాన్ఫరేన్స్‌లో సింహా తేజ చెప్పిన మాటలు... కలలుగనే నేటి యువత(కు) అక్షర సత్యాలుగా కనిపించాయట.. అ స్పీచ్‌ను విన్న వారంతా ఒక్కసారిగా తమ ఉజ్వల భవిష్యత్‌పై ఊహల్లో పడ్డారట.. విద్యా పరివర్తనలో మార్పులను రూపొందించడంలో పెరుగుతున్న యువత స్వరాన్ని, సింహ తేజ తన ప్రతిభను ద్వారా ప్రతిబింబింపచేశారని పలువురు డెలిగెట్స్ కోనియా(డారు)డటం విశేషం. ఇది అతని భవిష్యత్ విద్యా ప్రయాణాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందని ప్రౌడ్ పేరెంట్స్ పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ .. మాస్టర్ సింహా తేజకు దక్కిన ఈ అద్భుతమైన విజయాన్ని అభినందించారు. సింహ తేజ, రిహా, గాంధీలు సాదించిన ఈ ఘనతపై.. తొటి విద్యార్థులను సైతం ప్రపంచవ్యాప్తంగా ఆలోచించి, స్థిరమైన భవిష్యత్తు కోసం బాధ్యతాయుతంగా వ్యవహరించమని ప్రోత్సహిస్తదని, కో ఆర్డినేటర్ చింతలూరీ అన్నపూర్ణ, పల్లవి ఇంటర్ నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ చన్నప్రగడ శ్రీలత నేతృత్వంలో విజయవంతంగా జరిగిందని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేషనల్ యునైటెడ్ కాన్ఫరెన్స్‌లో యావత్ దేశం, తెలంగాణ రాష్ట్రం, గర్వపడేలా చేసిన సింహా తేజ రికార్డ్‌తో.. తల్లిదండ్రులు ప్రహ్లాద్, కీర్తన దంపతులు ఉప్పొంగిపోయారు. ఈ సందర్భంగా తెలంగాణకు చేందిన పలువురు ప్రముఖులతో పాటు, పాఠశాల యాజమాన్యం, బంధువులు, నాగారం డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ.. శుభాకాంక్షలు తెలిపారు. రికార్డు సాధించిన బుడతడిని పలువురు ప్రముఖులు దీవించారు. భవిష్యత్‌లో సింహా తేజ మరింత ఉన్నత శిఖరాలకి ఎదగాలని తెలంగాణ మలిధశ ఉద్యమకారుడు, సీనీయర్ జర్నలిస్ట్, సామాజిక ఉద్యమకారులు కోడికంటి శ్రీనివాస్, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు వెంగళా మధుసుధన్ తదితరులు అకాక్షించారు. 'సింహ తేజ'ను అభినందించిన ఈ సందర్భంగా 'సింహ తేజ'ను "సీనీయర్ పాత్రికేయుల బృందం అభినందించింది. ఈ సందర్భంగా "మా ప్రతినిధి"తో ఆయన మాట్లాడుతూ.. తనకు దక్కిన ఈ గొప్ప అవకాశం, సత్కారం, పలువురి నుంచి వస్తున్న అభినందనలపై 'సింహ తేజ' ఇది తన జీవితంలో మరచిపోలేనని అత్యంత అరుదైన ఘటనగా ఆయన అభివర్ణించారు. ఈ రికార్డులు తనను జీవితంలో మరింత శిఖరాలకు చేరేలా ఉపయోగపడతాయని ఆయన పేర్కోన్నారు.

## రాష్ట్ర మంత్రులు, ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసిన జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహ్మద్ యునూస్



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 21:**
జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మహ్మద్ యునూస్ శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణాభివృద్ధికి సంబంధించి ఆశయాలు, ప్రణాళికలపై చర్చించేందుకు ఈ భేటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ముందుగా రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహని వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్‌కుమార్ శెట్కార్ ని కలిసి పట్టణ అభివృద్ధి అంశాలపై చర్చించారు. అలాగే టీమ్రీస్ చైర్మన్ ఫహీం ఖురేషీ, రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్. గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. సిద్ధం ఉజ్వల్‌రెడ్డి లను మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాయకులు మహ్మద్ యునూస్‌ను అభినందిస్తూ, జహీరాబాద్ పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పారదర్శక పరిపాలన అందించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రంగా అరుణ్‌కుమార్, సీనియర్ నాయకులు పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జహీరాబాద్ మహేంద్ర లో ఈనెల 25 న ఉద్యోగ మేళా

**వెలుతురు నారాయణఖేడ్ ఫిబ్రవరి 21 :**
సంగారెడ్డి జిల్లా :- లోని నిరుద్యోగులకు ఇది గొప్ప అవకాశం జహీరాబాద్ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 25న ఉదయం 10 గంటలకు భారీ ఉద్యోగం మేళా నిర్వహించ నున్నారు. జిల్లాలోని నారాయణఖేడ్ తో పాటు అన్ని ప్రాంతాల నిరుద్యోగులకు గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డి ఆర్ డి ఓ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఐటిఐ, ఇంటర్ పూర్తి చేసిన 18 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల కలిగిన యువతి, యువకులు జహీరాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్ కు నిరుద్యోగులు సంబంధిత విద్యార్థులు జిరాక్స్ కాపీలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, జిరాక్స్ కాపీలు పాస్ ఫోటో సైజులో ఫోటోలతో హాజరు కాగలరని ఇట్టి అవకాశాన్ని నిరుద్యోగ యువతి యువకులు హాజరుకావాలని కోరారు. జహీరాబాద్ మహేంద్ర అండ్ మహేంద్ర ఆటోమేటిక్ డివిజన్ అప్రెంటీషిప్, పదవ తరగతి10500, ఐటిఐ అన్ని ట్రేస్ 11500 ఇంటర్11400 పూర్తిచేసి ఉండాలన్నారు.

# ప్రధాని నివాసం కోసం మురికివాడల ఖాళీ

**- ఇప్పటికే నోటీసులు ఇచ్చిన అధికారులు**

**- దాదాపు 700 కుటుంబాలకు ఈ నోటీసులు జారీ**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి21( వెలుతురు):**
దేశ రాజధాని న్యూఢిల్లీలో పరధాని నూతన నివాస నిర్మాణం.. దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో మురికి వాడల్లో నివాసముంటున్న కుటుంబాలపై పడింది. అక్కడి నుంచి ఖాళీ చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ వారిని ఆదేశించింది. ఈ మేరకు వారికి నోటీసులు పంపింది. అక్కడి నుంచి ఖాళీ చేయకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చ రించింది. దాదాపు 700 కుటుంబాలకు ఈ నోటీసులు అందాయని తెలుస్తున్నది. అయితే కచ్చితమైన గడువు తేదీని పేర్కొనకపోవడం, పునరావాసంపై ఎలాంటి స్పష్టతా లేకపోవడంతో అక్కడి స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధాని నూతన నివాసం నిర్మాణం నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఈ నోటీసులు వచ్చినట్టు అంతా భావిస్తున్నారు. రేస్‌కోర్స్ రోడ్ వెంట ఉన్న భాయిరామ్ క్యాంప్, మస్జిద్ క్యాంప్, డిఐడి క్యాంప్ నివాసితులకు ఈ నోటీసులు అందినట్టు సమాచారం. నోటీసులో ఆ భూమిని ప్రభుత్వానికి చెందినదనీ, ఇకపై అక్కడ నివసించడం అనధికారికంగా పరిగణిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఆదేశాలను పాటించకపోతే చట్ట ప్రకారం అక్కడి నుంచి తొలగింపు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు.ఈ నోటీసుతో అక్కడి స్థానికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. చాలా మంది నిరుపేదల అక్కడ నివసిస్తూ సమీప ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. ఖాళీ చేయాల్సిన గడువు, పునరావాసం, ప్రత్యామ్నాయాలపై ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదని వారు అంటున్నారు. కాగా వారు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులను సంప్రదించి.. పునరావాసంపై స్పష్టత కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా ఈ చర్యలు రాజధాని సెంట్రల్ జోన్ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునే విస్తృత ప్రణాళికలో భాగమని అధికారులు తెలిపారు.

# మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు!

**- అంతర్జాతీయ పరిణామాలతో పైపైకి..**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21( వెలుతురు):**
దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ వారం మధ్యలో కాస్త తగ్గుముఖం పట్టిన పసిడి, శనివారం ఉదయం మరోసారి పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరల్లో స్వల్ప పెరుగుదల నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం (10 గ్రాములు) ధర రూ.1,57,380 వద్ద స్థిరపడింది. ఇక ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,44,260గా ఉంది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ కథనం ప్రకారం, శుక్రవారంతో పోలిస్తే 24 క్యారెట్ల బంగారంపై రూ.880, 22 క్యారెట్లపై రూ.800 మేర పెరిగింది. దేశంలోని ఇతర నగరాల్లోనూ ఇదే ధోరణి కనిపించింది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,520 ఉండగా, ముంబైలో రూ.1,57,370, చెన్నైలో రూ.1,57,300గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న పరిణామాలే బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు, డాలర్ విలువలో మార్పులు, ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. ఈ కారణంగానే పసిడికి డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు వివరిస్తున్నాయి. ఈ ధరల పెరుగుదల సాధారణ వినియోగదారులపై, ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం కొనుగోలు చేసే వారిపై ప్రభావం చూపనుంది.

# మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హౌస్ అరెస్టు

**- కామారెడ్డి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు**

**మేడ్చల్,ఫిబ్రవరి21( వెలుతురు):**
మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డితోపాటు పెద్ద ఎత్తున ఈటల నివాసానికి చేరుకున్న పోలీసులు ఆయన్ను ఇంట్లోనే నిర్బంధించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిమీద దాడి నేపథ్యంలో ఆయన్ని పరామర్శించేందుకు ఈటల రాజేందర్ కామారెడ్డి బయల్దేరారు. ఈ క్రమంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈటలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ప్రభుత్వ వైఖరిని, పోలీసుల తీరును ఈటల తీవ్రంగా ఖండించారు. గుండాయిజం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

# మొబైల్ షాపులో షార్ట్ సర్క్యూట్

**- అగ్నిప్రమాదంలో పది లక్షల ఆస్తి బుగ్గి**

**నల్లగొండ,ఫిబ్రవరి21( వెలుతురు):**



నల్గొండ జిల్లాలో శనివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో భారీ ఆస్తి నష్టం సంభవించింది. నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని సాయి విఘ్నేశ్వర ఆటోమొబైల్ షాప్‌లో ఈ అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. స్థానికులు.. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాప్‌లో నుంచి ఒక్కసారిగా పొగ వ్యాపించింది. కాసేపటికే మంటలు వేగంగా వ్యాపించడంతో షాపులో ఉన్న స్పేర్ పార్ట్స్, వాహనాలకు సంబంధించిన సామగ్రి అగ్నికి ఆహుతైంది. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే షాప్‌లో ఉన్న సామగ్రి పూర్తిగా కాలిపోయినట్లు తెలుస్తోంది. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు భావిస్తున్నారు. విద్యుత్ వైర్లలో లోపం వల్ల మంటలు చెలరేగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు అధికారులు విచారణ చేపట్టారు. ఈ ఘటనతో స్థానిక వ్యాపారులు అప్రమత్తమయ్యారు. విద్యుత్ పరికరాలు, వైరింగ్ వ్యవస్థలను తరచూ తనిఖీ చేయించుకోవాలని ఫైర్ సేఫ్టీ అధికారులు సూచించారు.

# ఎన్నికల హామీ నెరవేర్చిన కౌన్సిలర్ గంకటి శ్రీధర్ రెడ్డి

**- మైనారిటీ కాలనీలో బోర్ మోటార్ ప్రారంభం**

**- కాలనీ వాసుల ఆనందం...**



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 21:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా పస్తపూర్ పరిధిలోని 3వ వార్డు మైనారిటీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన కౌన్సిలర్ గంకటి శ్రీధర్ రెడ్డి తన మాట నిలబెట్టుకున్నారు. ఎన్నికల ప్రచారంలో కాలనీ వాసులు తమ తాగునీటి సమస్యను వివరించగా, ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున వెంటనే చర్యలు తీసుకోలేనని, ఎన్నికల అనంతరం బోర్ వేయిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించి ప్రమాణ స్వీకారం చేసిన మూడు రోజుల్లోనే శుక్రవారం బోర్ మోటార్‌ను ప్రారంభించారు. పార్లమెంట్ ఇంచార్జ్ గంకటి శుక్లవర్ధన్ రెడ్డి, స్థానిక ముస్లిం మైనారిటీ నాయకులతో కలిసి టెంకాయ కొట్టి బోర్ ప్రారంభించారు. బోర్‌లో పుష్కలంగా నీరు రావడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. స్వర్గీయ మాజీ సర్పంచ్ ప్రతాప్ రెడ్డి ప్రజాసేవా స్ఫూర్తిని ఆయన తనయులు కొనసాగిస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. గతంలో తమ సమస్యలను ప్రతాప్ రెడ్డి పరిష్కరించినట్లే, ఇప్పుడు ఆయన కుమారులు కూడా అదే బాటలో నడుస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రజా సేవ చేయడమే తమ లక్ష్యమని, రాబోయే రోజుల్లో వార్డు సమగ్ర అభివృద్ధి కోసం మూడంచెల ప్రణాళికను అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఇంచార్జ్ శుక్లవర్ధన్ రెడ్డి, సిటీ సెంటర్ డైరెక్టర్ రాఘవేందర్ రెడ్డి, మొహమ్మద్ అఖిల్, మొహమ్మద్ మజీద్, అబ్దుల్ ఖదీర్ మొల్సాబ్, మొహమ్మద్ సాదిక్, ముజఫ్ఫర్, మొహమ్మద్ పాష తదితరులు పాల్గొన్నారు.



# తిరుమలలో పెరిగిన రద్దీ

**- దర్శనానికి 18 నుంచి 20 గంటలు**

**- వేసవి రద్దీకి అనుగుణంగా టిటిడి ప్రణాళిక**

**తిరుమల,ఫిబ్రవరి21( వెలుతురు):**
తిరుమల శ్రీవారి దర్శనానికి శనివారం యాత్రికులు పోటెత్తారు. దీంతో స్వామి వారి సర్వదర్శనానికి ఏకంగా 18 నుంచి 20 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు విస్తరించాయి. కాగా శుక్రవారం ఒక్కరోజే 68,156 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,295 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.46 కోట్లుగా నమోదైంది. ఇదిలావుంటే త్వరలో ప్రారంభం కానున్న వేసవి సెలవులకు రానున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కా ప్రణాళికతో సమర్థవంతంగా చేపడుతున్నట్లు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. గత రెండు,మూడు సంవత్సరాల వేసవి డేటాను విశ్లేషించి, దర్శనాల సంఖ్య, వేచి ఉండే సమయం, తర్వాత రోజు దర్శనాలకు క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సంఖ్య వంటి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అన్నప్రసాదం, తాగునీటి పంపిణీ, నడక దారి భక్తులకు మార్గమధ్యంలో షెడ్ల ఏర్పాటు, మాడ వీధులు తదితర ప్రాంతాల్లో కూల్ పెయింటింగ్, అవసరమైన చోట్ల షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే మజ్జిగ పంపిణీ పాయింట్ల సంఖ్యను పెంచి వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. వేసవి సెలవుల్లో కుటుంబాలతో కలిసి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే నేపథ్యంలో వసతి సదుపాయాలు, అన్నప్రసాదం నిర్వహణను



మరింత సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నడకదారి భక్తులు, అధిక రద్దీ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను బలోపేతం చేసి మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సామాన్య భక్తులు దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించి వీలైనంత త్వరగా దర్శనం కలిగేలా చర్యలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అదనపు ఈవో తెలిపారు. ఈసారి ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచి, గంటల వారీగా ఇన్?అవుట్ ఎ÷-లో, వేచి ఉండే సమయాన్ని ప్రతి నిమిషం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట తక్షణ నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. వివిధ కేటగిరీల దర్శనాలను డేటా ఆధారంగా హేతుబద్ధంగా కంపా÷-టం÷-మెంట్లు, క్యూ లైన్లలో భక్తులు వేగంగా దర్శనం పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత వేసవిలో జూన్ నెలలో సగటున రోజుకు 80 వేల నుంచి 82 వేల మందికి దర్శనం కల్పించామని, అలాగే 2026 జనవరిలో రోజుకు సగటున 74 వేల మందికి పైగా దర్శనం కల్పించినట్లు గుర్తు చేశారు. ఇది సమర్థవంతమైన టైమ్ మేనేజ్‌మెంట్, అన్ని విభాగాల సమన్వయంతో సాధ్యమైందని వివరించారు. వేసవిలో భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా టీటీడీ అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయని అదనపు ఈవో ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నాం

**- పాతవస్తువులు ఇస్తే నిత్యాసవర వస్తువులు ఇస్తున్నాం**

**- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం కూడా బాధ్యతే**

**- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రతో చెత్త పరివేత చేపట్టాం**

**- వినుకొండ సభలో సిఎం చంద్రబాబు వెల్లడి**




**పల్నాడు,ఫిబ్రవరి 21 వెలుతురు :**
గ్రామీణ ప్రాంతాల్లో మార్చి 31 నాటికి చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిదని సీఎం చంద్రబాబు అన్నారు. మండలానికి ఒక స్వచ్ఛరథం ఏర్పాటు చేస్తున్నామని, వారానికి ఒకసారి గ్రామానికి స్వచ్ఛరథం వస్తుందని చెప్పారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. స్వచ్ఛరథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను అందజేశారు. ప్రజావేదిక వద్ద స్టాళ్లను పరిశీలించారు. స్వచ్ఛ రథం వచ్చినప్పుడు పాత వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసరాలు ఇస్తారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు మీకు ఆదాయం వస్తుందని చంద్రబాబు అన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే మన ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. పరిశుభ్రత కోసం మనమంతా కంకణబద్ధులం కావాలన్నారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని 2025 జనవరిలో ప్రారంభించాను. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు సాగుతున్నాయి. పచ్చదనం- పరిశుభ్రత, నీరు-మీరుతో ప్రజల వద్దకు వస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటాం. నేను సీఎంగా వచ్చేనాటికి 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. దానిని క్రమంగా తొలగిస్తున్నాం. వర్షాలు పడినప్పుడు భూగర్భ జలాలు కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడింది. కలుషిత నీళ్లు తాగితే డయేరియా వంటి అనేక సమస్యలు వస్తాయి. ప్రజలకు స్వచ్ఛమైన నీరు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టాం అని వివరించారు. ప్రతి నెల మూడో శనివారం ఎక్కడ ఉన్నా కార్యక్రమానికి హాజరవుతున్నా. మున్సిపాలిటీల్లో ఇంటింటికి వెళ్లి చెత్తను వంద శాతం సేకరిస్తున్నారు. మార్చి 31 నాటికి గ్రామీణ ప్రాంతాల్లోనూ చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిది. రాబోయే రోజుల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొస్తుంది. ఇప్పటికే 'సూపర్ సిక్స్' హిట్ అయ్యింది. 'పేదల సేవలో' కార్యక్రమం కింద మొదటి తేదీనే ఇంటింటికి వస్తున్నాం. ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం కింద డబ్బులు ఇస్తున్నాం. ప్రతి ఎకరాకు నీళ్లిస్తున్నాం అన్నారు. గిట్టుబాటు వచ్చే పంటలు వేయిస్తున్నాం. రైతులకు టెక్నాలజీ అలవాటు చేస్తున్నాం. అగ్రికల్చర్ నిపుణులను అందుబాటులో ఉంచుతున్నాం. రైతాంగం టెక్నాలజీని అందిపుచ్చుకుంటోంది. మైక్రో ఇరిగేషన్, బిందుసేద్యం తదితర కార్యక్రమాలను నేనే ప్రారంభించానని వివరించారు. వారసత్వంగా వచ్చే పంటలే పండిస్తే ఆదాయం లేకుండా ఇబ్బందులు వస్తున్నాయి. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తున్నాం. ప్రతి ఒక్కరికీ అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో రూ.5కే భోజనం పెడుతున్నాం. మెరుగైన జీవన ప్రమాణాల కోసం పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం. ఆదాయం పెంచే మార్గాలను నేర్పించి వారిని ఆదుకుంటున్నాం అని అన్నారు. కొత్త విషయాలు నేర్చుకునేందుకు ముందుంటా. ఆదాయానికి చిరునామాగా మన రాష్ట్రం ఉండాలి. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారనేది ప్రజలు గమనించాలి. దిల్లీలో జరిగిన ఏఐ సమిట్‌కు కాంగ్రెస్ వాళ్లు ఆటంకం కలిగించారు. నిన్న దిల్లీలో కాంగ్రెస్ కార్యకర్తల వైఖరి చూసి చాలా బాధపడ్డా. దేశానికి ఎంతో మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని చంద్రబాబు అన్నారు.

# యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు

**- ఉదయం వటపత్రశాయి..రాత్రి హంసవాహనం**

**యాదగిరిగుట్ట,ఫిబ్రవరి21( వెలుతురు):**
శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 11 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి దర్శనమిచ్చారు.

రాత్రి హంస వాహనంపై స్వామివారు ఊరేగారు. బ్రహ్మోత్సవాలు, వారాంతం కావడంతో యాదగిరిగుట్టకు భారీగా భక్తులు తరలివచ్చారు. కాగా, లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 28 వ తేదీ వరకు జరుగనున్నాయి. 24న స్వామివారి ఎదుర్కోలు, 25న తిరుకల్యాణం, 28న అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలుకనున్నారు. ఉత్సవాల సందర్భంగా నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చనలను అధికారు రద్దు చేశారు.

# ఆ ఒక్కరూ ఎవ్వరు...

**హైదరాబాద్, ఫిబ్రవరి 21( వెలుతురు):** తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 26న నోటిఫికేషన్ విడుదల కానుండగా, మార్చి 16న పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం కాంగ్రెస్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న అభిషేక్ మను సింఘ్వీతో పాటు, బిఆర్ఎస్ సభ్యుడు కె.ఆర్. సురేష్ రెడ్డి పదవీకాలం ముగియనుంది. దీంతో కాంగ్రెస్ పార్టీలో ఈ రెండు స్థానాల కోసం పోటీ ప్రారంభమయింది. ఇప్పటి వరకూ సీనియర్ నేతలను పట్టించుకోలేదని, ఈసారైనా పార్టీ విధేయులకు రాజ్యసభర స్థానాలను ఇవ్వాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పార్టీకోసం కష్టపడిన వారికి ఇప్పటి వరకూ ఛాన్స్ ఇవ్వకపోవడాన్ని తప్పు పడుతుంది. శాసనసభలో ప్రస్తుత పార్టీల బలాబలాలను పరిశీలిస్తే, అధికార కాంగ్రెస్ పార్టీ ఈ రెండు స్థానాలను సునాయాసంగా కైవసం చేసుకునేలా కనిపిస్తోంది. రాజ్యసభ ఎన్నికల గెలుపు లెక్కల ప్రకారం, రెండు స్థానాలు ఖాళీగా ఉన్నప్పుడు ఒక్కో అభ్యర్థి గెలవడానికి దాదాపు 40 నుంచి 41 మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం.



అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ఉన్న 64 మంది స్వంత ఎమ్మెల్యేలతో పాటు, ఇతర పార్టీల నుండి చేరిన వారితో కలిపి మొత్తం బలం 75 దాటడంతో, ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకోవడానికి అవసరమైన 82 ఓట్లకు కాంగ్రెస్ అత్యంత సమీపంలో ఉంది. మజ్లిస్ మద్దతు ఎటూ కాంగ్రెస్ పార్టీకే లభిస్తుంది. అందుకే రెండు స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందిప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పరిస్థితి ఈ ఎన్నికల్లో కొంత ఇబ్బందికరంగానే ఉంది. ఆ పార్టీకి ప్రస్తుతం ఉన్న 27 మంది ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఒక సీటు గెలవడానికి కూడా సరిపోదు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్న బీజేపీ ఓటింగ్ కు హాజరు కాకపోవచ్చు. పైగా, రెండో ప్రాధాన్యత ఓట్ల విషయంలోనూ అధికార పక్షానికే స్పష్టమైన ఆధిక్యం ఉండటంతో బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టినా పోటీ ఇవ్వడం కష్టమే. కాంగ్రెస్ అధిష్టానం ఒక సీటును జాతీయ స్థాయి నేతకు, మరో సీటును సామాజిక సమీకరణాల దృష్ట్యా రాష్ట్ర స్థాయి నేతకు కేటాయించే అవకాశం ఉంది. అయితే ఆ ఒక్క సీటు ఎవరికి అన్నది ఇంకా తేలలేదు. జగ్గారెడ్డి మాత్రం వీహెచ్ కు, కుసుమ కుమార్ లకు ఇవ్వాలంటూ ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అయితే పార్టీ భవిష్యత్ ప్రయోజనాలు, రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని అంటున్నారు. మరి ఆ ఒక్కరు ఎవరో?

# కాంగ్రెస్ అగ్నిపరీక్ష గా ఐదు రాష్ట్రాల ఎన్నికలు

**పశ్చిమ బెంగాల్ ఫిబ్రవరి 21( వెలుతురు):** పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు వచ్చే మా?డు నెలల్లో జరగనున్నాయి. చాలా కాలంగా కాంగ్రెస్ పార్టీ గెలుస్తామని అనుకున్న రాష్ట్రాల్లో కూడా ఓడిపోతోంది. రాను రాను ఆ పార్టీ పరిస్థితి దిగజారుతోంది. ఇలాంటి సమయంలో మరో ఐదు రాష్ట్రాల ఎన్నికలు వచ్చాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో ముఖాముఖి, కూటములుగా తలపడే పరిస్థితులు ఉన్నాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ వరుస ఓటములతో సతమతమవుతున్న వేళ, ఈ ఎన్నికలు ఆ పార్టీ ఉనికికి ,ప్రతిపక్ష కూట ఐక్యతకు అగ్నిపరీక్షగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో మరోసారి తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య ముఖాముఖి పోరు నెలకొంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ తన సంక్షేమ పథకాలు , బెంగాలీ అస్తిత్వంపై నమ్మకం పెట్టుకోగా, ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలను బీజేపీ తన ప్రధాన అస్త్రాలుగా మార్చుకుంది. ఇక్కడ కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి పోటీ చేస్తున్నప్పటికీ, ప్రధాన పోటీ మాత్రం టీఎంసీ-బీజేపీ మధ్యే ఉండేలా కనిపిస్తోంది. ముస్లిం ఓట్ల సమీకరణ ఇక్కడ గెలుపోటములను శాసించనుంది. మమతా బెనర్జీ ఎంతో నమ్మకంగా ఉన్నప్పటికీ.. బీజేపీ కూడా గెలిచి చూపిస్తామన్న ధీమాతో ఉంది. తమిళనాడులో అధికార డీఎంకే కూటమి బలంగా ఉన్నప్పటికీ, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం రాకతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అన్నా డీఎంకే తన కోల్పోయిన వైభవాన్ని చాటుకోవాలని చూస్తుంటే, బీజేపీ



తన ఓటు బ్యాంకును పెంచుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తోంది. కాంగ్రెస్ ఇక్కడ డీఎంకేపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. సీట్ల సర్దుబాటు విషయంలో డీఎంకే ఈసారి కఠినంగా వ్యవహరించే అవకాశం ఉండటంతో కాంగ్రెస్‌కు ఇది సవాలుగా మారింది. త్రిముఖ పోరులో డీఎంకేకు లాభం కలుగుతుందన్న అంచనాలు వస్తున్నాయి. సాధారణంగా కేరళలో ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారుతుంది, కానీ గత ఎన్నికల్లో పినరయి విజయన్ ఆ సంప్రదాయాన్ని బ్రేక్ చేశారు. ఇప్పుడు వరుసగా మూడోసారి అధికారం దక్కించుకోవాలని ఎల్‌డిఎఫ్ చూస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కి ఇది చావో రేవో లాంటి ఎన్నిక. ఒకవేళ ఇక్కడ కూడా కాంగ్రెస్ ఓడిపోతే, జాతీయ స్థాయిలో ఆ పార్టీ నైతిక స్థైర్యం పూర్తిగా దెబ్బతింటుంది. అటు బీజేపీ కూడా క్రైస్తవ ఓటర్లను ఆకట్టుకుంటూ ఇక్కడ బలపడాలని చూస్తోంది. ప్రియాంకా గాంధీ వాయనాడ్ నుంచి ఎంపీగా ఉండటంతో గెలుపు సాధించడం ప్రతిష్టాత్మకంగా మారింది. అసోంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. అభివృద్ధి , హిందుత్వ నినాదాలతో బీజేపీ మూడోసారి అధికారంపై కన్నేసింది. కాంగ్రెస్ పార్టీ ఇక్కడ అంతర్గత కుమ్ములాటలతో ఇబ్బంది పడుతోంది. పైగా కీలక నేతలు బీజేపీలో చేరడం ఆ పార్టీకి పెద్ద దెబ్బ. ఏఐయుడిఎఫ్ వంటి పార్టీలతో పొత్తులు కుదిరితేనే కాంగ్రెస్ ఇక్కడ గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది, లేదంటే బీజేపీకి మార్గం సుగమం అవుతుంది. పుదుచ్చేరిలో ఎన్. రంగస్వామి నేతృత్వంలోని ఏఐఎన్ఆర్‌సీ , బీజేపీ కూటమి అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది. గతంలో ఇక్కడ కాంగ్రెస్ బలంగా ఉండేది, కానీ నేతల వలసలు ఆ పార్టీని బలహీనపరిచాయి. ఇక్కడ కూడా డీఎంకే మద్దతుతోనే కాంగ్రెస్ తన ఉనికిని చాటుకోవాల్సిన పరిస్థితి ఉంది. చిన్న రాష్ట్రం అయినప్పటికీ, ఇక్కడ గెలుపు కేంద్రంలోని అధికార పార్టీకి ప్రతిష్టాత్మకం. ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకం. కేరళలో అధికారం దక్కించుకోలేకపోతే, ఆ పార్టీ కేవలం కొన్ని చిన్న రాష్ట్రాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. మరోవైపు, బెంగాల్ , తమిళనాడులో ప్రాంతీయ పార్టీలైన టీఎంసీ, డీఎంకేలు గెలిస్తే, ఇండియా కూటమిలో కాంగ్రెస్ ప్రాధాన్యత తగ్గి, మమతా బెనర్జీ , స్టాలిన్ వంటి నేతలు జాతీయ నాయకత్వం వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఐదు రాష్ట్రాల ఫలితాలు దేశ రాజకీయ గమనాన్ని మార్చనున్నాయి.

# జీవన రెడ్డి దారెటు...

**కరీంనగర్, ఫిబ్రవరి 21( వెలుతురు):** జగిత్యాల కాంగ్రెస్‌లో సీనియర్ నేత టి.జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య నడుస్తున్న ఆధిపత్య పోరు ఇప్పుడు కేవలం నియోజకవర్గానికే పరిమితం కావట్లేదు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక సంచలనంగా మారింది. దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండాను మోస్తూ, పార్టీ కష్టకాలంలోనూ అండగా నిలిచిన ఒక సీనియర్ నేత.. నేడు సొంత పార్టీలోనే 'మనుగడ' కోసం పోరాడాల్సి రావడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. తెలంగాణ రాజకీయాల్లో 'క్లీన్ ఇమేజ్' ఉన్న అతికొద్ది మంది నేతల్లో జీవన్ రెడ్డి ఒకరు. కానీ, ప్రస్తుతం ఆయన ఎదుర్కొంటున్న పరిస్థితులు ఒక విధమైన రాజకీయ సంక్షోభాన్ని తలపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ, కేడర్ గొంతుకగా నిలిచిన ఆయనకు.. తన ప్రత్యర్థిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లోకి



రావడమే పెద్ద దెబ్బగా మారింది.గత ఎన్నికల్లో సంజయ్ కుమార్ చేతిలో జీవన్ రెడ్డి ఓడిపోయారు. అయితే, రాజకీయ సమీకరణాల్లో భాగంగా సంజయ్ కుమార్‌ను పార్టీలోకి చేర్చుకోవడం జీవన్ రెడ్డి వర్గానికి మింగుడుపడలేదు. అప్పటి నుండి నియోజకవర్గంలో ప్రోటోకాల్ విషయంలోనూ, అభివృద్ధి పనుల విషయంలోనూ ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం నెలకొంది. పార్టీ కోసం దశాబ్దాలుగా జెండాలు మోసిన కార్యకర్తలను కాదని, నిన్నగాక మొన్న వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తుంటే ఇక మా ఉనికి ఎక్కడ? అనే ప్రశ్న జీవన్ రెడ్డి మద్దతుదారుల నుండి బలంగా వినిపిస్తోంది.ఇటీవల జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు ఈ విభేదాలను పతాక స్థాయికి తీసుకెళ్లాయి. పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వర్గానికి కాకుండా, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన నేతకే చైర్మన్ పీఠం అప్పగించడం అగ్నికి ఆజ్యం పోసింది. ఈ క్రమంలో జీవన్ రెడ్డి తన అనుచరులను స్వతంత్రులుగా పోటీ చేయించి గెలిపించుకోవాల్సి రావడం, ఆయన పడుతున్న ఆవేదనకు అద్దం పడుతోంది. "ఇంకెంత కాలం ఈ అవమానాలు భరించాలి? పార్టీలో నా భవిష్యత్తు ఏంటో అర్థం కావడం లేదు" అని ఆయన బహిరంగంగా వ్యాఖ్యానించడం ఆయన మనస్తాపానికి నిదర్శనం. జీవన్ రెడ్డికి జరుగుతున్న అన్యాయంపై మరో సీనియర్ నేత జగ్గారెడ్డి స్పందించారు. "కష్టకాలంలో పార్టీని వీడని వారికి న్యాయం చేయాలి" అని అధిష్టానాన్ని కోరారు.జగిత్యాల ప్రజల్లో జీవన్ రెడ్డి పట్ల అపారమైన గౌరవం ఉంది. సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉండే 'మనసున్న నేత'గా ఆయనకు పేరుంది. ఇప్పుడు ఆయన రాజకీయ మనుగడే ప్రశ్నార్థకం కావడం పట్ల స్థానికంగా తీవ్ర సానుభూతి వ్యక్తమవుతోంది. ఒకవేళ జీవన్ రెడ్డి గనుక పార్టీని వీడితే, జగిత్యాలలో కాంగ్రెస్‌కు ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకు భారీగా దెబ్బతినే ప్రమాదం ఉంది.ఒకవైపు అధికారంలో ఉన్న పార్టీకి ఎమ్మెల్యేల మద్దతు అవసరమే అయినప్పటికీ, దశాబ్దాల చరిత్ర ఉన్న సీనియర్ నేతలను దూరం చేసుకోవడం పార్టీ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేత పార్టీ వీడడం అంటే అది కేవలం ఒక నాయకుడిని కోల్పోవడం కాదు, నమ్మకమైన కేడర్‌ను కోల్పోవడమే. వచ్చే ఎన్నికల నాటికి ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, జీవన్ రెడ్డి ప్రత్యామ్నాయ దారి వెతుక్కోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం కలుగజేసుకుని, ఈ సీనియర్ వర్సెస్ వలస నేతల గొడవకు స్వస్తి పలకకపోతే జగిత్యాల కోటలో హస్తం పార్టీకి పతనం తప్పకపోవచ్చు.

# ఎమ్మెల్యేలనూ కూడగడుతున్నారా



**హైదరాబాద్, ఫిబ్రవరి 21( వెలుతురు):** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మంత్రి పదవి ఆశించిన ఆయన, అది దక్కకపోవడంతో తన అసంతృప్తిని బాహాటంగానే వెళ్లగక్కుతున్నారు. కేవలం అసంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా, ఒకానొక దశలో ఏకంగా ముఖ్యమంత్రి పదవినే సవాల్ చేసే స్థాయికి ఆయన వ్యాఖ్యలు వెళ్లడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. మంత్రి పదవి ఇవ్వకుంటే తానేంటో చూపిస్తానన్నట్లుగా ఆయన చేస్తున్న హెచ్చరికలు పార్టీలో అంతర్గత పోరును వీధికెక్కించాయి. రాజగోపాల్ రెడ్డి కేవలం మాటలకే పరిమితం కాకుండా, తెరవెనుక పావులు కదుపుతున్నారనే ప్రచారం కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. తనకు అనుకూలంగా ఉన్న కొంతమంది ఎమ్మెల్యేలతో ఆయన నిరంతరం చర్చలు జరుపుతున్నారని, అవసరమైతే ఒక వర్గంగా విడిపోయే యోచనలో ఉన్నారని జోరుగా చర్చ సాగుతోంది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి తన డిమాండ్లను నెరవేర్చుకోవడమే లక్ష్యంగా ఆయన ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ ఆయన చేస్తున్న విమర్శలు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించేలా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాజగోపాల్ రెడ్డి దూకుడుగా వ్యవహరిస్తున్నా, అధిష్టానం ఇప్పటివరకు చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. అయితే, ఇప్పుడు పరిస్థితి చేతులు దాటిపోతోందని, ఆయన ఏకంగా ప్రభుత్వాన్ని బలహీనం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని సంకేతాలు అందడంతో హైకమాండ్ అప్రమత్తమైంది. ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలు ఈ వ్యవహారాన్ని ఇప్పటికే కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే సహించేది లేదని అధిష్టానం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే పీసీసీ చీఫ్ చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. రాజగోపాల్ రెడ్డిని పిలిపించి మాట్లాడతామని, ఆయన అభ్యంతరాలు ఏమిటో తెలుసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఇది ఒక రకంగా రాజగోపాల్ రెడ్డికి ఇస్తున్న చివరి హెచ్చరికగా భావించవచ్చు. సర్దిచెప్పే ప్రయత్నాలు విఫలమైతే, పార్టీ లైన్ దాటి వెళ్తున్న నేతపై కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమనే సంకేతాన్ని పీసీసీ పంపింది. రాజగోపాల్ రెడ్డిని దారికి తెచ్చేందుకు అధిష్టానం త్వరలోనే ఒక స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రానుంది.రాజగోపాల్ రెడ్డి గతాన్ని పరిశీలిస్తే, ఆయన గతంలో కూడా పార్టీని వీడి మళ్ళీ తిరిగి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఆయన మళ్ళీ అదే బాట పడతారా లేక మంత్రి పదవి కోసం ఒత్తిడి తంత్రం మాత్రమే ఉపయోగిస్తున్నారా అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ ఆయన శాంతించకపోతే, ఆయనపై వేటు వేయడం ద్వారా ఇతరులకు గుణపాఠం చెప్పాలని రేవంత్ రెడ్డి వర్గం భావిస్తోంది. రాజగోపాల్ రెడ్డి వైఖరి పార్టీకి బలమా లేక బలహీనతా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. సీనియర్ నేతగా ఆయనకున్న బలాన్ని కాపాడుకుంటూనే, ముఖ్యమంత్రి పీఠాన్ని సవాల్ చేసే ధోరణిని అధిష్టానం ఎలా అణచివేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఆయన దారికి రాకపోతే, కాంగ్రెస్ తనదైన శైలిలో ఆయనకు దారి చూపించే అవకాశం మెండుగా ఉంది.

# ఏపీలో పెరగనున్న 50 నియోజకవర్గాలు

**తిరుపతి, ఫిబ్రవరి 21( వెలుతురు):** కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. నియోజకవర్గాల పునర్విభజనపై సంకేతాలు పంపింది. 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పునర్విభజనకు సంబంధించి బిల్లును పార్లమెంటులో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఏపీలో అసెంబ్లీ సీట్లు మరో 50 పెరిగే అవకాశం ఉంది. ఏడు పార్లమెంట్ స్థానాలు సైతం పెరగనున్నట్లు తెలుస్తోంది.. నియోజకవర్గాల పెంపు అనేది రాష్ట్ర విభజన సమయంలోనే ప్రస్తావనకు వచ్చింది. విభజన చట్టంలోనే నియోజకవర్గాల పునర్విభజన ద్వారా రాజకీయ అవకాశాలు పెంచుతామని స్పష్టంగా చెప్పారు. పాలనా వికేంద్రీకరణకు నియోజకవర్గాల పెంపు చేపడతామని చెప్పుకొచ్చారు. కానీ ఇంతవరకు నియోజకవర్గాల పునర్విభజన జరగలేదు.ప్రస్తుతం రాష్ట్రంలో 175 అసెంబ్లీ? 25 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు.. 117 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అయితే పునర్విభజనతో అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ సీట్లు పెరిగే అవకాశం ఉంది. చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అప్పట్లో అధికార పార్టీకి అనుకూలంగా ఈ ప్రక్రియ జరిగింది అనేది ఒక విశ్లేషణ. 2004లో రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే అప్పట్లో తెలుగుదేశం పార్టీ కూడా బలంగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపికి బలమైన స్థానాలను? విభజించి బలహీనపరిచారు అన్నది ఒక ఆరోపణ. ఇప్పుడు కూడా టిడిపి కూటమి రాష్ట్రంలో ఉంది. కేంద్రంలో టిడిపి బలమైన భాగస్వామ్య పక్షంగా ఉంది. ఇప్పుడు గాని నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు తారుమారు అయ్యే ఛాన్స్ కనిపిస్తోంది.మొన్నటి ఎన్నికల్లో జనసేన 21, బిజెపి 10, మిగిలిన స్థానాల్లో టిడిపి పోటీ చేసింది. అయితే 164 సీట్లలో కూటమి గెలిచింది. అయితే పొత్తులో భాగంగా ఓ 50 మంది నేతలు తమ సీట్లను త్యాగం చేశారు. టిడిపిలో ఇటువంటి వారి సంఖ్య అధికంగా ఉంది. మరోవైపు జనసేనతో పాటు బిజెపిలో సైతం చాలామంది ఎమ్మెల్యే సీట్ల ఆశావాహులు ఉన్నారు. ఎన్నికలకు ముందు, తరువాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపి కూటమిలో చాలామంది నేతలు చేరారు. ఇప్పుడు వారందరికీ రాజకీయ అవకాశాలు కల్పించడం అనేది కష్టం. ఇటువంటి సమయంలో నియోజకవర్గాల పునర్విభజన ద్వారా 50 అసెంబ్లీ స్థానాలు, ఏడు పార్లమెంటు సీట్లు పెరిగితే మాత్రం కూటమికి ప్లస్ గా మారుతుంది. ఇంకోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు.. విభజనతో మరింత బలహీనమవుతాయి. ఇలా ఎటు చూసుకున్నా నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపి కూటమికి ఎక్కువగా మేలు జరుగుతుంది.

# జెండాలు మోసిన వారికే అగ్రతాంబులం

**కాకినాడ, ఫిబ్రవరి 21( వెలుతురు):** జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి పార్టీ సభ్యత్వాలకు శ్రీకారం చుట్టారు. పార్టీ సభ్యత్వాల నమోదుతో జనసేన గ్రౌండ్ లెవెల్లో మరింత బలోపేతం అవుతుందని ఆయన నమ్ముతున్నారు. పార్టీ సభ్యత్వాలు తీసుకున్న వారు జనసేన విజయాలకు పనిచేస్తారన్న విశ్వాసంతో ఉన్నారు. పల్లెలు, పట్టణాల్లో జనసేన క్యాడర్ పెరిగేందుకు ఇది ఉపయోగపడుతుంది. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జనసేన సభ్యత్వాల నమోదును ప్రారంభించారు. ఇప్పటికే జనసేనకు కార్యకర్తల బలం ఉంది. అభిమానుల బలం కూడా జనసేన సొంతం. ఇక సామాజికవర్గం అండదండలు ఎటూ ఉన్నాయి. అదనంగా క్యాడర్ ను పెంచుకునేందుకు పవన్ సభ్యత్వ నమోదు ప్రారంభించారు.స్థానిక సంస్థల ఎన్నికలతో జనసేన రాష్ట్రంలో బలపడాలని చూస్తుంది. శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించాలంటే స్థానిక నాయకత్వం బలంగా ఉంటేనే అది సాధ్యమవుతుంది. దీంతో పాటు జనసేనలో ఇప్పటి వరకూ పదవులు దక్కలేదని చాలా మంది నిరాశలో ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన వారిని ఎంపిక చేయడమే ధ్యేయంగా పనిచేయాలని, సుదీర్ఘ కాలం పార్టీలో వారి కున్న హిస్టరీని చూసి ఎంపిక చేయాలని ఇప్పటికే ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. పార్టీ కోసం ఆర్థికంగా నష్టపోయిన వారు కూడా ఉన్నారు. 2014 నుంచి పార్టీలోనే ఉంటున్న వారిని గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిసింది.జనసేన ద్వితీయ శ్రేణి నేతల్లో అసంతృప్తి ఉందని జనసేనాని కూడా గుర్తించారు. నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినప్పటికీ కూటమిలో భాగస్వామిగా ఉన్నందున అందరికీ న్యాయం చేయలేకపోయామని పవన్ కల్యాణ్ చెబుతున్నారు. కానీ పదవి రాని వారు మాత్రం తమకు జనసేనలో గుర్తింపు లేదని బాధపడుతున్నారు. అందుకోసమే ఇకపై ఒరిజినల్ జనసైనికులకు, వీరమహిళలకు నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఇకపై ఏ పోస్టు భర్తీ అయినా నామినేటెడ్ పోస్టులను ద్వితీయ శ్రేణి నేతల్లో బాగా కష్టపడిన వారిని గుర్తించి, పార్టీ జెండా మోసే వారికే ప్రయారిటీ ఇచ్చేలా పవన్ కల్యాణ్ ప్లాన్ చేశారు. త్వరలోనే అది అమలులోకి తీసుకురానున్నారు. ఇకపై జెండా మోసిన వారికే జై కొట్టనున్నారు.

# లోకేష్ ను హీరో చేస్తున్న జగన్

**విజయవాడ, ఫిబ్రవరి 21( వెలుతురు):** వైసీపీ అధినేత మాజీ సీయం జగన్ మోహన్ రెడ్డి తెలిసి అన్నారో లేక అనుకోకుండా అనేసారో తెలీదు కానీ తనకు లోకేష్ తోనే పోటీ అని తేల్చేశారు. తాజాగా పెట్టిన ప్రెస్ మీట్‌లో ఆయన చంద్రబాబు, పవన్‌తో పాటు నారా లోకేష్‌పై విమర్శలు గుప్పించారు. ప్రధానంగా అయన టార్గెట్ లోకేష్ వైపే నడిచింది. శ్రీలంకలో ఇండియా ఆడుతున్న ౨20 వరల్డ్ కప్ మ్యాచ్ చూడడానికి ప్రత్యేకంగా లోకేష్ వెళ్ళాలా? ఇంట్లో కూర్చుని చూడకూడదా అంటూ ఆయన సెటైరికల్‌గా మాట్లాడారు. ఇప్పటికే లోకేష్‌పై వచ్చిన విమర్శలకు ఆయన స్వయంగా సోషల్ మీడియా ద్వారా కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారు. సొంత డబ్బుతో మ్యాచ్ చూడడానికి వెళ్లినట్టుగానే చెప్పుకొచ్చారు లోకేష్. దానిపై మాజీ ముఖ్యమంత్రి హోదాలో జూ జగన్ ఇప్పుడు మాట్లాడడం ద్వారా సామాన్య జనాలకు ఒక మెసేజ్ ఇచ్చేసారు జగన్ అంటున్నారు ఎనలిస్ట్ లు. ఎందుకంటే సహజంగా జగన్ మాట్లాడే విధానం ఇలా ఉండదు అనేది వారి విశ్లేషణ.రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి



చంద్రబాబు మాత్రమే తన ప్రత్యర్థి అనీ వేరే ఎవరూ తనకు సమానులు కాదు అన్నట్టుగా జగన్ వ్యవహార శైలి ఉండేది. పాదయాత్ర చేసినప్పుడు గానీ సీయం అయ్యాక గానీ చంద్రబాబు టార్గెట్ గానే జగన్ మాటలు ఉండేవి. లోకేష్ ప్రస్తావన వచ్చినప్పుడు కూడా ముక్తసరిగా మాట్లాడి ఆ టాపిక్ ని పెద్దగా హైలైట్ చేసేవారు కాదు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విషయంలోనూ ఆయన వ్యవహారశైలి అలానే ఉండేది. అధికారంలో ఉన్న ఐదేళ్ళలో ఒక్కసారి కూడా పవన్ ను పేరు పెట్టి పిలవ లేదు జగన్. కేవలం 'దత్త పుత్రుడు ' అని మాత్రమే ప్రస్తావించేవారు. కానీ తాజా ప్రెస్ మీట్ లో పవన్ కళ్యాణ్, లోకేష్ ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. పోనీ పవన్ ఇప్పుడు ఉప ముఖ్య మంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి తనతో సమానుడు అని భావించినా లోకేష్ ను టార్గెట్ చేయడం తో భవిష్యత్ లో తనకూ లోకేష్ కూ మధ్య మాత్రమే అసలు సిసలు పోటీ అని ఫిక్స్ అయిపోయారా అనే అభిప్రాయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అవునన్నా కాదన్నా ప్రస్తుతం ఏపీ ప్రభుత్వంలోనూ టీడీపీలోనూ నారా లోకేష్ అండ్ టీమ్ దే హవా అన్నది సుస్పష్టం. మొత్తం వ్యవహారాలు అన్నీ ఆయన టీమ్ చక్క బెడుతోంది. మోదీ, అమిత్ షా వంటి బీజేపీ అగ్ర నేతలు కూడా లోకేష్ తో వ్యవహరిస్తున్న తీరు భవిష్యత్ టీడీపీ అధినేతగా లోకేష్ ని గుర్తిస్తున్నట్టుగానే ఉంది. టీడీపీ సోషల్ మీడియా యూనిట్స్ కూడా దాన్నే ప్రొజెక్ట్ చేస్తున్నాయి. ఇప్పుడు ఏకంగా జూ జగన్ కూడా లోకేష్ నే తన పొలిటికల్ ప్రత్యర్థిగా డిసైడ్ అయిపోయిన దృశ్యం తెరపైకి వచ్చేసింది. ఇదివరకూ చంద్రబాబు ను టార్గెట్ చేసి జగన్ మాట్లాడుతూ ఉంటే పవన్ పై ఆయన సామాజిక వర్గ నేతలు లోకేష్ పై జగన్ తరువాతి స్థాయి నేతలూ విమర్శలు గుప్పించే వారు. ఇప్పుడు డైరెక్ట్ గా జగనే లోకేష్ ను టార్గెట్ చేయడం చూస్తుంటే పొలిటికల్ గా కింది స్థాయి కేడర్ కు లోకేష్ తన ఫ్యూచర్ పొలిటికల్ ప్రత్యర్థి అనే సంకేతం ఇస్తున్నారా అనే డౌట్స్ రాజకీయ వర్గాల్లో బలపడుతున్నాయి.

# కార్లతో ర్యాలీతో నోటీసుల ఉల్లంఘన..

## - అంబటి రాంబాబు, జక్కంపూడి రాజాలపై కేసు నమోదు




**అమరావతి, ఫిబ్రవరి 21( వెలుతురు):**
మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుపై మరో కేసు నమోదయింది. ఆయనతో పాటు రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పలువురు వైసీపీ నేతలపై కూడా రాజమండ్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు ఇచ్చిన నోటీసులను ధిక్కరించి భారీ ర్యాలీ నిర్వహించడంతో వివిధ సెక్షన్ల కింద కేసు ఫైల్ చేశారు. ఈ కేసును రాజమండ్రి ప్రకాశ్ నగర్ సీఐ బాజీలాల్ విచారణ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... 18 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న అంబటి రాంబాబు రెండు రోజుల క్రితం బెయిల్ పై విడుదలైన సంగతి తెలిసిందే. ఈనెల 19న రాజమండ్రి నుంచి గుంటూరుకు బయలుదేరిన అంబటి రాంబాబుకు పోలీసులు సెక్షన్ 30 కింద నోటీసులు అందించారు. కార్లతో భారీ ఊరేగింపు నిర్వహించవద్దని, రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జిపై అధిక వాహనాలతో వెళ్లకూడదని నోటీసులో పేర్కొన్నారు. అయినప్పటికీ అంబటి, జక్కంపూడి రాజా తమ అనుచరులతో కలిసి కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో వారిపై కేసులు నమోదయ్యాయి.

# తిరుమలలో పోటెత్తిన భక్తులు..

## - సర్వదర్శనానికి 20 గంటల సమయం

**తిరుమల, ఫిబ్రవరి 21( వెలుతురు):**
తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కొండపై భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో సర్వదర్శనానికి ఏకంగా 18 నుంచి 20 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు విస్తరించాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శనివారం ఉదయం వెల్లడించిన వివరాల ప్రకారం, శుక్రవారం ఒక్కరోజే 68,156 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 28,295 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.46 కోట్లుగా నమోదైంది. గురువారంతో పోలిస్తే దర్శన సమయం 10-12 గంటల నుంచి ఒక్కసారిగా 20 గంటలకు చేరడం రద్దీ తీవ్రతకు అద్దం పడుతోంది. మరోవైపు, రానున్న వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, దర్శన సమయాన్ని తగ్గించే లక్ష్యంతో టీటీడీ అదనపు ఈవో ఆధ్వర్యంలో నిన్న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. డేటా ఆధారిత వ్యూహంతో రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ఎమ్మెల్యే జివి ఆసక్తికర వ్యాఖ్యల

## - 50కోట్లు అనడానికి బదులు 50వేల కోట్లు అంటూ వ్యాఖ్య

## - సరిదిద్ది నవ్వుకున్న చంద్రబాబు




**పల్నాడు, ఫిబ్రవరి 21( వెలుతురు):**
వినుకొండలో సీఎం చంద్రబాబు పర్యటనలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీఎం బహిరంగ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రసంగిస్తూ.. వినుకొండలో పార్కు, స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం కోసం రూ.50 వేల కోట్లు నిధులు కేటాయించాలని అన్నారు. అది విన్న సీఎం చంద్రబాబు నవ్వులు చిందించారు. అనంతరం ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను సరిదిద్దుకొని రూ.50 కోట్లు కేటాయించాలని కోరారు. ఈ వ్యాఖ్యలతో అక్కడున్న టిడిపి వారు కూడా నవ్వులు చిందించారు.

# స్టాలిన్‌ను కలిసిన ఓపీఎస్.. తమిళ రాజకీయాల్లో సంచలనం..

**హైదరాబాద్, ఫిబ్రవరి 21( వెలుతురు):**
తమిళనాడు రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వం , ప్రస్తుత ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ భేటీ కావడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. తమిళనాడు శాసనసభ సమావేశాల సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వం, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను ప్రత్యేకంగా కలిశారు. ఏఐఏడీఎంకే లో చోటు చేసుకున్న అంతర్గత విభేదాల వల్ల ఆ పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఓపీఎస్, తన సొంత వర్గంతో రాజకీయంగా ఒంటరయ్యారు. ఈ క్రమంలో అధికార పక్ష నేతను ఆయన కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తమిళనాడు శాసనసభలో రెండ్రోజుల పాటు జరిగిన తాత్కాలిక బడ్జెట్ చర్చల సందర్భంగా ఓపీఎస్ మద్దతుదారుడు, ఎమ్మెల్యే ఐయ్యప్పన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ము.క. స్టాలిన్ మళ్లీ విజయం సాధించి, తమిళనాడు ముఖ్యమంత్రి కావాలని ఆయన ఆకాంక్షించారు. అంతేకాకుండా, పురట్చి తలైవర్ ఎంజీఆర్, పురట్చి తలైవి అమ్మ జయలలిత ఆశీస్సులతో స్టాలిన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు తెలపడం అందరినీ ఆశ్చర్యపరిచింది. శాసనసభ సమావేశాల ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసిన ఓపీఎస్, అనంతరం మీడియాతో మాట్లాడారు. డీఎంకే ఐదేళ్ల పాలన అత్యంత అద్భుతంగా ఉందని కొనియాడారు. అందుకే ఉదయాన్నే ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలిపానని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి చూస్తే మళ్లీ డీఎంకే అధికారంలోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఆయన విశ్లేషించారు. తన మద్దతుదారు ఐయ్యప్పన్ అసెంబ్లీలో మాట్లాడిన మాటలు ప్రజల మనోగతానికి ప్రతిరూపమని ఓపీఎస్ సమర్థించారు.మీరు డీఎంకేలో చేరుతారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఓపీఎస్ స్పందిస్తూ.. కొంతకాలం వేచి చూడండి అని బదులిచ్చారు. ఈ సమాధానం ఆయన పార్టీ మారబోతున్నారనే అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి, జయలలిత మరణం తర్వాత ఏఐఏడీఎంకే నుండి బహిష్కరణకు గురైన ఓపీఎస్.. 'ధర్మయుద్ధం' చేసినా, 'హక్కుల పునరుద్ధరణ కమిటీ' పెట్టి పోరాడినా ఆశించిన ఫలితం దక్కలేదు. ఆయన ప్రధాన అనుచరులంతా ఒక్కొక్కరుగా ఇతర పార్టీల్లో చేరిపోగా, ఇప్పుడు ఆయన వద్ద మిగిలింది కేవలం ఎమ్మెల్యే ఐయ్యప్పన్ మాత్రమే. ఎటు వెళ్లాలో తెలియని స్థితిలో, రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి ఓపీఎస్ డీఎంకే వైపు మొగ్గు చూపుతున్నారా అనే సందేహం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. దీనికి సంబంధించిన స్పష్టత అతి త్వరలోనే వచ్చే అవకాశం ఉంది.

# కామారెడ్డి ఎమ్మెల్యే ఆఫీస్ ముట్టడి

## - కాంగ్రెస్ కార్యకర్తల దాడితో ఉద్రిక్తత

## - పరస్పరం దాడి చేసుకున్న బిజెపి, కాంగ్రెస్ కార్యకర్తలు

## - పోలీసులు రంగోలకి దిగడంతో అదుపులోకి పరిస్థితి



**కామారెడ్డి, ఫిబ్రవరి 21( వెలుతురు):**
కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు గీరెడ్డి మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వచ్చారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డి కారును భాజపా కార్యకర్తలు ధ్వంసం చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైటెన్షన్ నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య మాటల యుద్ధం ఉద్రిక్తతలకు దారితీసింది. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ నేత గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ప్రయత్నించడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ప్రభుత్వ, అరోరా కాలేజీ భూములను వెంకట రమణారెడ్డి కబ్జా చేశారని షబ్బీర్ ఇటీవల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన వెంకట రమణారెడ్డి.. ప్రభుత్వ కాలేజీ భూములు, శిశుమందిర్ పాఠశాల, అరోరా కాలేజీ విషయంలో కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలపై తాను చర్చకు సిద్ధమని తెలిపారు. కాంగ్రెస్ ప్రజలకు నిజాలు తెలియాల్సిన అవసరం ఉందని.. సాక్ష్యాధారాలతో చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాలు విసిరారు. ఈ నేపథ్యంలో శిశుమందిర్ వేదికపై బహిరంగ చర్చకు రెండు పార్టీలు సిద్ధమయ్యాయి. ఇరు పార్టీల నేతల సవాళ్లతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి క్యాంప్ ఆఫీసు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యాంప్ ఆఫీసు నుంచి బయటకు రాకుండా ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేశారు. మరోవైపు సవాలును స్వీకరించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ సర్పంచ్ గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన బీజేపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ముదరడంతో మహేందర్ రెడ్డి కారుపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. కారును బోల్తా పడేశారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరు పార్టీల నేతలను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పడంతో కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# కొత్త నేతలను వెతికే పనిలో కాంగ్రెస్



**హైదరాబాద్, ఫిబ్రవరి 21( వెలుతురు):**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత నుంచి వరుసగా సాధిస్తున్న రాజకీయ విజయాలు, పాలనాపరమైన సంస్కరలపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఉపఎన్నికలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడం పట్ల ఏఐసీసీ అగ్రనాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మంత్రుల బృందం గురువారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగావచ్చే అసెంబ్లీ ఎన్నికలపై కూడా ఫోకస్ పెట్టినట్టు స్పష్టం చేసింది. పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన వారిని ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించాలని ఆదేశించారు. తెలంగాణలో గత రెండేళ్లలో పార్టీ సాధిస్తున్న పురోగతిని సమీక్షించడానికి ముఖ్యమంత్రి, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడిని ఢిల్లీకి పిలిపించిన అధిష్ఠానం, దాదాపు రెండు గంటలపాటు లోతైన చర్చలు జరిపింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక మొదలు కొని ఇటీవల ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ సాధించిన ఫలితాల పట్ల మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 80 శాతం మంది ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఆస్వాదిస్తున్నారని, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే దానికి నిదర్శనమని ఖర్గే కొనియాడారు. ఇప్పటి వరకు అన్ని సానుకూలంగా సాగాయని, భవిష్యత్‌లో కూడా ఇదే పట్టుదలతో మంచి ఫలితాలు సాధించాలని నాయకత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలోనే మంత్రులు తమ శాఖల పనితీరును, అమలు చేస్తున్న కీలక పథకాలను అధిష్ఠానానికి వివరించారు. సమ్మక్క సారలమ్మ జాతరను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించిన తీరును మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నివేదిక ఇచ్చారు. పేదలకు ఇళ్ల నిర్మాణం, భూభారతి కార్యక్రమం ద్వారా చేపట్టిన భూసర్వే వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో పామాయిల్ తోటల పెంపకం, దాని వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. గిగ్ వర్కర్స్ కోసం ప్రభుత్వం తీసుకురాబోతున్న కొత్త విధానం గురించి మంత్రి వివేక్ వివరించగా, ఈ చట్టాన్ని వీలైనంత త్వరగా తీసుకురావాలని రాహుల్ సూచించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమైన సమ్మక్క- సారలమ్మ జాతర నిర్వహణపై రాహుల్ గాంధీ ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఈ జాతర చరిత్ర, ప్రభుత్వం అక్కడ చేపట్టిన కొత్త నిర్మాణాల గురించి తెలుసుకున్న ఆయన, సమ్మక్క-సారలమ్మపై జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఒక సినిమా తీస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. జాత విజయవంతం కావడంపై అభినందిస్తూ తనను కూడా ఆహ్వానించి ఉంటే వచ్చే వాళ్లమని అన్నారు. పాలనతో పాటు పార్టీ అంతర్గత వ్యవహారాలపై కూడా ఢిల్లీ వేదికగా చర్చ జరిగింది. ఇటీవల ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై విమర్శలు చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంశంపై అధిష్ఠానం ఆరా తీసింది. త్వరలోనే ఆయనను ఢిల్లీకి పిలిపించి మాట్లాడతామని అగ్రనేతలు అన్నట్టు తెలుస్తోంది. అలాగే రాజ్యసభ ఎన్నికల అంశంపై మరో రెండు రోజుల్లో ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్‌తో విడిగా చర్చించనున్నారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జులను మార్చాలని హైకమాండ్ ఆదేశించింది. మరోవైపు కరీంనగర్ కార్పొరేషన్ ఫలితాల విషయంలో మాత్రం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ స్థానాన్ని ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ ప్రశ్నించగా, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఇచ్చిన వివరణ పట్ల వారు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. రాష్ట్ర మంత్రివర్గమంతా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఫామ్‌హౌస్ నుంచి పాలన చేయడం తప్పని, జాతీయ పార్టీ నాయకత్వానికి కలవడం ఎలా తప్పు అవుతుందని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ దిల్లీలో పార్టీ కార్యాలయం ఎందుకు నిర్మించిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల్లో అత్యధికం ఇప్పటికే అమలు చేస్తున్నామని, కేసీఆర్‌లా తాము ప్రజలను వదిలేసి పోయే రకం కాదని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా మార్చి రెండో వారానికిల్లా నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. మిగిలిన పీసీసీ కార్యవర్గ పోస్టులు, జిల్లా, బ్లాక్ కమిటీలను కూడా అదే గడువులోగా భర్తీ చేస్తామని మహేష్ కుమారు గౌడ్ వెల్లడించారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో పని చేయడం వల్లే స్థానిక సంస్థల్లో మంచి ఫలితాలు వచ్చాయని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ వివరించారు.

# పరిషత్‌లు రద్దు దిశగా అడుగులు




**హైదరాబాద్, ఫిబ్రవరి 21( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల పరిపాలనా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని ఎంపీటీసీ, జడ్‌పీటీసీ వ్యవస్థలను పూర్తిగా రద్దు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఒక వేళ ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, తెలంగాణ రాజకీయాల్లో ఇది ఒక పెను సంచలనంగా మారొచ్చు. తెలంగాణలో ప్రస్తుతం అమల్లో ఉన్న మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పాత్రపై ప్రభుత్వం సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించింది. ఈ వ్యవస్థ రద్దు చేయాలనే ఆలోచన వెనుక మూడు బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. ఈ వ్యవస్థ ద్వారా ప్రజల చేత ఎన్నికైన ప్రతినిధులకు క్షేత్రస్థాయిలో సరైన అధికారులు కానీ, నిర్దిష్టమైన బాధ్యతలు కానీ లేవని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. కేవలం పదవులు ఉండి, నిధులు, విధులు లేకపోవడం వల్ల ఆశించిన అభివృద్ధి జరగడం లేదని సర్కారు భావిస్తోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయడం ద్వారా భవిష్యత్‌లో ఈ స్థానాలకు ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరమే ఉండదని ప్రభుత్వం యోచిస్తోంది. ఇది ప్రభుత్వ ఖజానాపై భారాన్ని తగ్గించమే కాకుండా తరచూ వచ్చే ఎన్నికల కోడ్ అడ్డంకులను కూడా నివారిస్తుందని అంటున్నారు. ప్రస్తుతం వ్యవస్థల వల్ల పాలనాపరంగా పెద్దగా ఉపయోగం లేదని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనపై స్పష్టత రావడానికి ఫిబ్రవరి 23న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశం అత్యంత కీలకమైంది. ఈ సమావేశంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థల రద్దుపై ప్రభుత్వం చర్చించే ఛాన్స్ ఉంది. ఈ లోగా ఈ అంశంపై ఒక సమగ్ర నివేదికను సమర్పించాలని రేవంత్ ప్రభుత్వం పంచాయతీ రాజ్‌శాఖను ఆదేశించింది. ఈ నివేదికలో ఈ వ్యవస్థల వల్ల జరుగుతున్న లాభనష్టాలు, రద్దు చేస్తే కలిగే పరిణామాలు , ఇతర రాష్ట్రాల్లోని పరిస్థితులను పొందుపరచనున్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు వేగంగా తీసుకుంటున్నా చట్టపరంగా, రాజ్యాంగపరంగా ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని తెలుస్తోంది. దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ అనేది 73వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశవ్యాప్తంగా ఒకే తీరుగా అమలులోకి వచ్చింది. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం, రాష్ట్రాలు తమ ఇష్టానుసారం మూడు అంచెల వ్యవస్థలో మార్పులు చేయడం సాధ్యం కాదు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా రాజ్యాంగ సవరణ తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నివేదిక ఆధారంగా, ఈ ప్రతిపాదన చట్టపరంగా, రాజకీయంగా ఎంత వరకు సాధ్యమవుతుందనే దానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. కేవలం రాష్ట్ర స్థాయిలో ఒక తీర్మానం చేయడం ద్వారా లేదా ఆర్డినెన్స్ తీసుకురావడం ద్వారా ఈ వ్యవస్థను రద్దు చేయడం కుదరదని ఒక వేళ కేంద్రం సహకరించకపోతే ఇది న్యాయపరమైన చిక్కులకు దారి తీస్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు ఈ వ్యవస్థలో సర్పంచులకు గ్రామంలో నిధులు, విధులు ఉంటాయి. కానీ ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు ప్రత్యేకంగా నిధులు గానీ, కార్యాలయాల్లో కనీసం కూర్చునేందుకు సీటు గానీ ఉండటం లేదనే అసంతృప్తి ఉంది. ఒకే గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ మధ్య తరచూ ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. అధికారాల విభజనలో స్పష్టత లేకపోవడం అభివృద్ధికి ఆటంకంగా మారుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఓటు హక్కు ఉంది, కానీ సర్పంచులకు లేదు. వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఈ అసమానతలను తొలగించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.అయితే.. ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థలు 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా ఏర్పడ్డాయి. వీటిని రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టసవరణ చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం విన్నపం మాత్రమే చేయగలదు. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులను రద్దు చేస్తే, పార్టీ క్యాడర్‌లో అసంతృప్తి జ్వాలలు ఎగిసే అవకాశం ఉంది. రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం ఉన్న ఈ మెట్లను తొలగిస్తే రాజకీయ నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది. ఇప్పుడు అదే పార్టీ అధికారంలో ఉండి ఆ వ్యవస్థలోని భాగాలను రద్దు చేస్తే దేశవ్యాప్తంగా తప్పుడు సంకేతాలు వెళ్తాయనే వాదన కూడా పార్టీలో వినిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా జెడ్పీటీసీగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి నేడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. కాబట్టి ఆయన ఈ వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తిస్తారా లేదా పాలనా సౌలభ్యం కోసం రద్దు వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. ఫిబ్రవరి 23న జరగబోయే కేబినెట్ భేటీలో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ ప్రభుత్వం ఈ నిర్ణయానికే కట్టుబడితే, ఇది తెలంగాణ రాజకీయాల్లో ఒక పెను మార్పుగా నిలుస్తుం

# 1,100 ఫైల్స్ దగ్ధం ..

- డేటా రికవరీ చేయడం కష్టం
- కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ ఎంతో ముఖ్యం
- నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటనపై ప్రత్యేక బృందం




**ములుగు, ఫిబ్రవరి 21( వెలుతురు):**
నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఇటీవల జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మొత్తం 1,100 ఫైల్స్ దగ్ధం అయినట్లు నాగ్‌పూర్ నుంచి వచ్చిన స్పెషల్ టీం గుర్తించింది. ఈ దగ్ధమైన ఫైల్స్‌లోని డేటా రికవరీ కోసం ఆ బృందం ఎంతో తీవ్రంగా ప్రయత్నించింది. తాజాగా ఈ ఫైల్స్‌లోని డేటా రికవరీ చేయడం కష్టమని ప్రత్యేక బృందం తేల్చి చెప్పింది. ఈ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో వివిధ కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో వెంట్రుకలు, ఎలక్ట్రానిక్ డివైజ్‌ల విశ్లేషణ, రక్తం, వేలిముద్రలు, బుల్లెట్లు, లేదా డీఎన్ఏ నమూనాలు, ఆయుధాలు, డాక్యుమెంట్లు ఫోర్జరీ జరిగాయా లేదా ప్రతీది ఇతర అన్ని ఆధారాలను ల్యాబ్‌లోనే పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తారు. ఈ ఆధారాలు ఎన్నో కోర్టు తీర్పుల్లో కీలకంగా ఉంటాయి. కానీ ఈ ప్రమాద ప్రభావం వల్ల కేసుల దర్యాప్తుపై ఎంత వరకు పడనుందనేది ఆందోళనకరమైన విషయం.

# ఆయేషా మీరా హత్య కేసు ముగింపు

- విజయవాడ సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు
- అవశేషాలను తల్లిదండ్రులకు అప్పగింత!
- ఫిబ్రవరి 27న తెనాలిలో అంత్యక్రియలు



**అమరావతి, ఫిబ్రవరి 21( వెలుతురు):**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో విజయవాడలోని సీబీఐ ప్రత్యేక కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తును ముగిస్తున్నట్లు ప్రకటించిన న్యాయస్థానం.. వైద్య బృందం సేకరించిన ఆయేషా భౌతిక అవశేషాలను ఆమె తల్లిదండ్రులకు అప్పగించాలని సీబీఐని ఆదేశించింది. ఫిబ్రవరి 27న తెనాలిలో ప్రభుత్వ భద్రత నడుమ మత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఆయేషా హత్య కేసులో నిందితులను గుర్తించడానికి తగిన ఆధారాలు లభించలేదని సీబీఐ ఇటీవల కోర్టుకు తుది నివేదిక సమర్పించింది. ఈ నివేదికను తాజాగా న్యాయస్థానం ఆమోదించింది. దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఆయేషా మీరా మృతదేహానికి రెండో సారి పోస్టుమార్టం నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి వైద్యుల అభిప్రాయం తీసుకున్న అనంతరం అవశేషాలను సీబీఐ కోర్టు ముందుంచారు. ఈ క్రమంలో తమ కుమార్తె అవశేషాలను అంత్యక్రియల నిమిత్తం తమకు అప్పగించాలని కోరుతూ ఆయేషా తల్లిదండ్రులు షంషాద్ బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషా పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, ఫిబ్రవరి 27వ తేదీ తెనాలిలో అంత్యక్రియలు జరపాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని సీబీఐ, రెవెన్యూ, పోలీసు అధికారులు, మత పెద్దల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అవశేషాల తరలింపునకు ప్రత్యేక వాహనం, ఎస్కార్ట్, భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2007లో విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలోని హాస్టల్‌లో ఆయేషా మీరా దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే.

# మీరే నాకు జీతం ఇస్తున్నారు సార్..

- సుందర్ పిచాయ్‌తో యూట్యూబర్ సరదా ముచ్చట



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21( వెలుతురు):**
దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో ఓ యూట్యూబర్ కు సర్ ప్రైజ్ ఎదురైంది. ఏకంగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ పక్కన కూచునే అవకాశం దక్కింది. తన సీటుకు రెండు సీట్ల అవతల ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన వ్యక్తి కూర్చోవడంతో ఆ యూట్యూబర్ సంతోషం మామూలుగా లేదు. తిన్నగా ఆయన వద్దకు వెళ్లి 'నమస్తే సార్.. మీరే నాకు నెలనెలా డబ్బులు ఇస్తున్నారు' అంటూ పలకరించాడు. దీనికి ఆశ్చర్యపోయిన సుందర్ పిచాయ్.. అదెలాగని ప్రశ్నించగా తానో యూట్యూబర్ నని, నెలనెలా యూట్యూబ్ నుంచి ఆదాయం పొందుతున్నానని చెప్పడంతో ఆయన కూడా నవ్వేశారు. అనంత్ లధా అనే యూట్యూబర్ కు ఎదురైందీ అనుభవం. ఈ విషయాన్ని ఆయన తన ఎక్స వేదికగా పంచుకోవడంతో ఆ పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చార్టర్డ్ అకౌంటెంట్ నుంచి యూట్యూబర్ గా మారిన అనంత్ లధా.. 'ఇన్వెస్ట్ ఆజ్ ఫర్ కల్' అనే ప్లాట్‌ఫారమ్ నడుపుతున్నారు. ఏఐ సదస్సులో సుందర్ పిచాయ్‌తో కలిసి దిగిన సెల్ఫీని షేర్ చేస్తూ తన 'ఫ్యాన్ బాయ్' మూమెంట్ గురించి ఎక్స్ లో పోస్ట్ చేశారు. సదస్సులో సుందర్ పిచాయ్ పక్కనే కూర్చునే అవకాశం రావడంతో అనంత్ ఆయనతో మాటలు కలిపానని చెప్పారు. ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు సుందర్ పిచాయ్ సింప్లిసిటీని మెచ్చుకుంటూ కామెంట్లు పెడుతున్నారు. "బిజీ షెడ్యూల్ లోనూ సామాన్య వ్యక్తులతో ఆయన మాట్లాడే విధానం అద్భుతం" అని ఒకరు, "తర్వాతి వంతు జుకర్ బర్గ్ లేదా ఎలాన్ మస్క్ అనుకుంటా.. వారు కూడా మీకు డబ్బులు ఇస్తారుగా!" అంటూ మరొక నెటిజన్ చమత్కరించారు.

# మండలిలో ఫోటోలతో శ్రీవారికి అపచారం

- లడడూలో వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పింది
- లడ్డు గురించి మాట్లాడితే హెరిటేజ్‌ను ముందుకు తెచ్చారు
- తప్పు చేసిన ఎవ్వరినీ వదలబోనన్న సిఎం చంద్రబాబు

**పల్నాడు,ఫిబ్రవరి21( వెలుతురు):**
చెప్పులు వేసుకుని వేంకటేశ్వరస్వామి ఫొటోలను మండలిలో వైకాపా సభ్యులు విసిరేశారని సిఎం చంద్రబాబు మండిపడ్డారు. శ్రీవారి విషయం బయట మాట్లాడకూడదని రెండు రోజులుగా ఆగానన్నారు. వేంకటేశ్వరస్వామి స్వయంగా తనను కాపాడారని.. వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. ఏపీ శాసనమండలిలో వేంకటేశ్వర స్వామి ఫొటోలతో వైసీపీ సభ్యులు చేసిన నిరసనలపై సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ అంశంపై వినుకొండ సభలో సీఎం మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూను అపవిత్రం చేశారని చెబితే హెరిటేజ్‌ను తెరపైకి తీసుకొచ్చారన్నారు. 'నేను ప్రాణం పోయినా తప్పు చేయను' అని స్పష్టం చేశారు. లడ్డూ ప్రసాదానికి వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పిందన్నారు. తప్పు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ÷ర్ అయ్యారు. తప్పును పక్క వాళ్లపై నెట్టే నీచులు కూడా ఉన్నారన్నారు. అలాంటి కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయం చేయాలా అని విమర్శించారు. తాను కూడా జైలుకు వెళ్తానని ఊహించలేదని.. నోటీసు ఇస్తే సమాధానం చెప్పేవాడినని సీఎం చంద్రబాబు అన్నారు. 'నా ప్రాణం పోయినా పరవాలేదు... రాష్ట్రం కోసం పోరాడతాను' అని చెప్పుకొచ్చారు. చాలా మంది తాను జైల్లో నుంచి ప్రాణాలతో బయటకురారని అనుకున్నారని ముఖ్యమంత్రి



పేర్కొన్నారు. కొందరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు మట్లాడుతున్నారని.. రెచ్చగొట్టే పనులు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. డ్రగ్స్ మత్తులో ఆడబిడ్డల జోలికొస్తే వారికదే చివరిరోజు అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వివేకా హత్యను గుండె పోటు అని నమ్మించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నారాసుర రక్త చరిత్ర అంటూ తనపై నెపం నెట్టారని.. వివేకా హత్య చుట్టూ నాటకాల రాయుడు నాటకాలు ఆడారంటూ ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సదస్సులో కాంగ్రెస్ తీరు ఆవేదన కలిగించిందన్నారు. కాంగ్రెస్ తీరు దేశానికి మంచిది కాదన్నారు. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గమనించాలని తెలిపారు. దేశానికి మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు

## నెలఖరు వరకు తెలంగాణలో పత్తి కొనుగోళ్లు

- ప్రభుత్వం విజ్ఞప్తితో సిసిఐ నిర్ణయం

**హైదరాబాద్,ఫిబ్రవరి21( వెలుతురు):**
తెలంగాణలో ఈ నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లు చేయనున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తితో సీసీఐ నిర్ణయం తీసుకుంది. జాయింట్ సెక్రెటరీ, కేంద్ర జౌళిశాఖకి రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి లేఖ రాశారు. పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మంత్రి తుమ్మల కోరారు. కేంద్ర ప్రభుత్వం, సీసీఐ నిర్ణయంతో మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. అయితే పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవతో కూడా పత్తి రైతులకు ఊరట లభించింది. సీసీఐ సంస్థ పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో సమస్యను ఎంపీ వంశీ దృష్టికి తీసుకెళ్లారు రైతులు. వెంటనే స్పందించిన ఎంపీ వంశీ.. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా( సీసీఐ)తో మాట్లాడి ప్రొక్యూర్మెంట్ గడువును పొడిగించాలని కోరారు. రైతులకు సంబంధించిన పత్తి పంట ఇంకా పూర్తి దశలోకి చేరుకోలేదని.. ఇంకా పత్తి తీసే దశ ఉందని సీసీఐ దృష్టికి తీసుకెళ్లారు. పత్తి కొనుగోళ్ల పక్రియను మరికొన్ని రోజులు కొనసాగించాలని ఆయన కోరారు. ఎంపీ వంశీ లేఖకు స్పందించిన సీసీఐ సంస్థ మరో 7 రోజులు పత్తి కొనుగోళ్లు చేసుకోడానికి వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అవకాశాన్ని నియోజకవర్గ రైతులు సద్వినియోగం చేసుకోవాలనీ ఎంపీ వంశీ కోరారు. ఎంపీ వంశీ కృష్ణ చేసిన కృషికి హర్షం వ్యక్తం చేశారు స్థానిక రైతులు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com